అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

శుక్రవారం 17-01-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 17

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు వెల : 6.50

ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్



13లో..

కేంద్ర మంత్రివర్గం ఆమోదం

రూ. 3,985 కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ప్యాడ్

స్టీల్‌ప్లాంట్‌పై క్యాబినెట్‌లో చర్చ

అనుమతులివ్వండి

కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

ఆర్టీసీ బస్సులను ఈ - మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలి : కేంద్రమంత్రి కుమారస్వామికి వినతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అభివృద్ధి కోసం అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. గురువారం నాడిక్కడ రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి వరుసగా కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఇందులో భాగంగా కేంద్ర మంత్రులు భూపేందర్ యాదవ్, కుమార స్వామి, మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో వేర్వేరుగా సమావేశం అయ్యారు. తొలుత కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సీఎం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం ఇందిరా పర్యావరణ్ భవన్‌లో కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. దాదాపు అరగంటకుపైగా సాగిన ఈ భేటీలో సీఎం వెంట రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, సీఎస్ శాంతికుమారి, సీఎం స్పెషల్ సెక్రెటరీ వి.శేషాద్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, పీసీసీఎఫ్ డొబ్రియల్,



తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను సీఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో తెలంగాణ వ్యాప్తంగా 161 ప్రాజెక్టులు నిలిచిపోయాయని వివరించారు. 38 ప్రాజెక్టుల కు వన్యప్రాణి సంరక్షణ చట్టాల పరమైన అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. ఈ ప్రాజెక్టుల్లో అత్యధికం రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయని కేంద్ర మంత్రికి వివరించారు. అనుమతులు రాకపోవడంతో జాతీయ రహదారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం, పీఎంజీఎస్‌వై, పొరుగు రాష్ట్రాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు నిలిచిపోయాయని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన ...6లో

తెలంగాణలో లిక్కర్ స్కాం భాగస్వామిని ఓడించాం

అసలు భాగస్వామిని ఢిల్లీలో ఓడిస్తాం

మోడీ, కేజ్రీవాల్ పేర్లే వేరు.. చేతలు ఒక్కటే : సీఎం రేవంత్ రెడ్డి 5లో..

ఢిల్లీ ఎన్నికలకు సంబంధించి గ్యారెంటీ పోస్టర్లు విడుదల

ఢిల్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి, అధ్యక్షులతో కలిసి రేవంత్ మీడియా సమావేశం

భారీ పెట్టుబడులే లక్ష్యంగా సింగపూర్, దావోస్‌కు సీఎం

6లో..

ఆరురోజుల విదేశీ పర్యటన

వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొననున్న రేవంత్

క్లీన్ అండ్‌గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఫ్యూచర్ సిటీపై ఫోకస్



అంబుజాను రద్దు చేయాల్సిందే

ప్రభుత్వానికి రైతుల గోడు పట్టదా?

ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తప్పదు : మీడియా సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రామన్నపేటలో బైక్ ర్యాలీ, అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ స్థల పరిశీలన

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో జనవాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాల్సిందేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రామన్నపేట పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి వేలాది మందితో కలిసి కొమ్మాయిగూడెం ...3లో

ప్రపంచం మెచ్చిన నేత సుందరయ్య

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

శోభనాద్రిపురంలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహావిష్కరణ

పార్టీ శాఖ నూతన కార్యాలయం ప్రారంభం

వివరాలు 14లో



నిబంధనలు ఎందుకు ఉల్లంఘించారు?

ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌లో కేటీఆర్‌కు ఈడీ సూటి ప్రశ్న.. 48కి పైగా ప్రశ్నలు..ఏడు గంటలు విచారణ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణలో నిబంధనలను ఎందుకు ఉల్లంఘించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సూటిగా ప్రశ్నించారు. గురువారం ఈ కేసులో తమ ఎదుట విచారణకు హాజరైన కేటీఆర్‌ను దాదాపు ఏడు గంటల పాటు జాయింట్ డైరెక్టర్ నేతృత్వంలోని నలుగురు సభ్యులతో కూడిన ఈడీ అధికారుల బృందం విచారించింది. 48కి పైగా ప్రశ్నలను సంధించింది. ఈ సందర్భంగా ఆయన వెంట వచ్చిన న్యాయవాదిని వెలుపల రిసెప్షన్‌లోనే కూర్చోబెట్టి కేవలం కేటీఆర్‌ను మాత్రమే లోనికి తీసుకెళ్లి అధికారులు ...6లో

లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధమా? : సీఎంకు కేటీఆర్ సవాల్ 6లో..

బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్

12 మంది మావోయిస్టులు మృతి | పక్షం రోజుల్లోనే పాతిక మంది హతం

నవతెలంగాణ-చెర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఊసూర్ పోలీస్ స్టేషన్ పరిధి పూజారి కాంకేర్ దండకారణ్యంలో గురువారం భారీ ఎదురు కాల్పులు జరిగాయి. 12 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు బస్తర్ ఐజీ పి.సుందర్‌లాల్ ప్రకటించారు. దక్షిణ బస్తర్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారంతో బీజాపూర్, దంతేవాడ, సుక్మా జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, కోబ్రా 204, 205, 206, 208, 210, సీఆర్పీఎఫ్ 229 బెటాలియన్‌ల సంయుక్త పోలీసులు వెయ్యి మంది అడవులను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురుపడగా ఇరువురి మధ్య



భారీగా కాల్పులు జరిగాయి. ఘటన స్థలం నుంచి పెద్దఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు ఐజీ తెలిపారు. 12 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయన్నారు.

పక్షం రోజుల్లో పాతికమంది మావోయిస్టుల హతం

ఈ ఏడాది ఆరంభంలో పక్షం రోజుల్లో సుమారు పాతిక మంది మావోయిస్టులు ఇప్పటివరకు మృతిచెందారు. జనవరి 3న గరియాబాద్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. జనవరి 9న సుకుమా జిల్లా పాలగూడాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు, అదేవిధంగా ఈనెల 12న బీజాపూర్ జిల్లా మద్దెడు బందే పారాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు. గురువారం జరిగిన కాల్పుల్లో 12 మంది మృతిచెందారు. ఇదిలా ఉంటే జనవరి 6న బీజాపూర్ జిల్లా నయమేడు అడవుల్లో భద్రత బలగాలు ప్రయాణం చేస్తున్న స్కార్పియో వాహనాన్ని మావోయిస్టులు భారీ మందు పాతర పెట్టి పేల్చడంతో 9 మంది పోలీసులు, డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన విషయం విదితమే.

సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి

గుర్తు తెలియని దుండగుడి చర్య




ఆరు చోట్ల గాయాలు

ప్రాణాపాయం లేదన్న వైద్యులు

ముంబయి పోలీసుల దర్యాప్తు

ముంబయి : బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగింది. ఒక గుర్తు తెలియని వ్యక్తి ముంబయిలోని నటుడి ఇంట్లోకి చొరబడి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన సైఫ్‌ను చికిత్స కోసం ఆయన కుటుంబీకులు వెంటనే లీలావతి ఆస్పత్రికి తరలించారు. ఆయనకు చికిత్స జరిపిన వైద్యులు.. ఆయన సేఫ్‌గానే ఉన్నారని ప్రకటించారు. ఈ దాడి ఘటనపై సైఫ్ అలీఖాన్ టీమ్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది. పోలీసులు, కుటుంబీకుల సమాచారం ప్రకారం.. ముంబయిలోని బాంద్రాలో గల తన ఇంటిలో గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకున్నది. ఇంట్లోకి చొరబడిన ఆగంతకుడు దొంగతనానికి యత్నించాడు. ఇది గమనించిన సైఫ్ అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో ఆ దుండగుడు నటుడిపై దాడి చేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దాడిలో సైఫ్‌కు ఆరు చోట్ల కత్తి గాయాలయ్యాయి. ఈ విషయం ...13లో



పునర్విభజన చట్టం ప్రకారమే

13లో..

కృష్ణా జలాలపై వాదనలు

అదనపు టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌పై తొలుత విచారణ

ట్రిబ్యునల్ కీలక నిర్ణయం

పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్

హరీశ్‌రావు నేతృత్వంలో రెండు పిటిషన్లు దాఖలు

పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై చర్యలు చేపట్టేలా స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని వినతి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కారు గుర్తుపై గెలిచి.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు చేపట్టేలా స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యవేక్షణలో మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై రెండు ...13లో

ఎట్టకేలకు..

తీవ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాల జాబితా నుంచి క్యూబా తొలగింపు : అమెరికా నిర్ణయం



వాషింగ్టన్ : క్యూబాను తీవ్రవాదానికి ప్రోత్సాహం అందిస్తున్న దేశాల జాబితా నుండి మినహాయిస్తూ బైడెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆంక్షలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని తెలిపింది. హెల్మ్స్-బర్టన్ చట్టం కింద దాఖలయ్యే పిటిషన్లకు వ్యతిరేకంగా అమెరికా న్యాయస్థానాల్లో ఎలాంటి చర్యలు తీసుకోకుండా నివారించేందుకు అధ్యక్షుని విశేషాధికారాన్ని ఉపయోగించాలని కూడా నిర్ణయించింది. అమెరికా పౌరులు, ...5లో



ఓఎంఆర్ పద్ధతిలో నీట్ యూజీ-2025 పరీక్ష

వివరాలు 13లో

హిండెన్‌బర్గ్ క్లోజ్





సంస్థ వ్యవస్థాపకులు నాథన్ అండర్సన్ సంచలన నిర్ణయం

- కార్యకలాపాలు మూసివేస్తున్నట్టు ప్రకటన
- బెదిరింపులు, ఆరోగ్య కారణాలు, వ్యక్తిగత అంశాలు లేవని వెల్లడి
- 2017లో పది మంది ఉద్యోగులతో ప్రారంభం
- అమెరికాలోని న్యూయార్క్ కేంద్రంగా కార్యకలాపాలు
- ప్రపంచవ్యాప్తంగా పలు ప్రముఖ కంపెనీల అవకతవకలు వెలికితీత
- 2023లో అదానీ గ్రూపు ఆర్థిక వ్యవహారాలపై సంచలన నివేదిక

న్యూఢిల్లీ : అదానీకి గ్రూపుపై సంచలన ఆరోపణలతో సుపరిచితమైన అమెరికన్ కేంద్రంగా పని చేసే షార్ట్ సెల్లర్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ అనూహ్య నిర్ణయం తీసుకున్నది. కంపెనీ తన కార్యకలాపాలను మూసివేయనున్నది. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపకుడు అయిన నాథన్ అండర్సన్ ఒక లేఖలో పేర్కొన్నారు. దీనిని కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. "గతేడాది నుంచి నా కుటుంబం, స్నేహితులు, మా బృందంతో చర్చించి, తుదకు హిండెన్‌బర్గ్ రీసెర్చ్ కార్యకలాపాలు మూసివేయాలని నిర్ణయం తీసుకున్నాను. మేము చేస్తోన్న పనులకు సంబంధించిన ఐడియాలు పూర్తి కావటంతో ఈ నిర్ణయానికొచ్చాం. దీని వెనక ఎలాంటి బెదిరింపులు, ఆరోగ్య కారణాలు, వ్యక్తిగత అంశాలు లేవు" అని ఆయన వివరించారు. తన బృందం మంచి స్థాయికి చేరుకునేందుకు సాయపడతానన్న ఆయన.. ఇక తన భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి పెడతానని చెప్పారు.

హిండెన్‌బర్గ్ సంస్థను 2017లో పది మంది ఉద్యోగులతోనే ప్రారంభించారు. అమెరికాలోని న్యూయార్క్ కేంద్రంగా ఇది పని చేస్తోంది. ఆర్థిక రంగంలో మానవ నిర్మిత కృత్రిమ విపత్తులను గుర్తిస్తామని ఈ కంపెనీ తన వెబ్‌సైట్‌లో పేర్కొన్నది. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రముఖ కంపెనీలలో జరిగే అవకతవకలు, మోసాలను గుర్తించటం, పెట్టుబడులు, రుణాలు, డెరివేటివ్‌లను విశ్లేషించటం దీని పని. ఈ కంపెనీ షార్ట్ సెల్లింగ్‌లలోనూ పెట్టుబడులు పెడుతుంది. ఈ సంస్థ విడుదల చేసిన నివేదికలు యా దేశాల్లో, ప్రపంచ స్టాక్ మార్కెట్‌లోనూ సంచలనంగా మారిన విషయం విదితమే. హిండెన్‌బర్గ్ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా 60కి పైగా దేశాల్లో నెట్‌వర్క్ ఉన్నది. ఈ దేశాల్లోని మాజీ టాప్ బ్యూరోక్రాట్లు, కార్పొరేట్ కంపెనీ ఉద్యోగులు, ఆర్థిక సంస్థలతో హిండెన్‌బర్గ్‌కు మంచి సంబంధాలున్నాయి.

నాథన్ అండర్సన్ 2017లో ఈ కంపెనీని ఏర్పాటు చేశారు. ఈయనకు సంబంధించిన పూర్తి విషయాలు అంతగా అందుబాటులో లేవు. అమెరికలోని కనెక్టికల్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డిగ్రీని ఈయన పూర్తి చేశారు.

హిండెన్‌బర్గ్ సంచలన నివేదికతో అదానీ గ్రూప్ షేక్

హిండెన్‌బర్గ్ భారతీయులకూ సుపరిచితమే. అదానీ గ్రూపు సామ్రాజ్యాన్ని షేక్ చేసిన హిండెన్‌బర్గ్.. దేశ రాజకీయ, ఆర్థిక వ్యవహారాలనూ తీవ్రంగా ప్రభావితం చేసింది. అదానీ గ్రూపు ఆర్థిక వ్యవహారాలు, అప్పులు, స్టాక్ మ్యానిపులేషన్ గురించి హిండెన్‌బర్గ్.. జనవరి, 2023లో ఒక సంచలన నివేదికను బయట పెట్టింది. దీంతో ఆ నివేదిక దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. అటు, భారతీయ స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు రూ.లక్షల కోట్ల సంపదను కోల్పోయింది. ప్రపంచ ...13లో



13లో..

విద్యార్థినిపై లైంగికదాడి

హాస్టల్ యజమాని, డ్రైవర్ అఘాయిత్యం

పోలీసులకు బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు

ఏపీలో భూములపై కార్పొరేట్ రాబందులు

పాలసీల రెక్కల చప్పుడు

విజన్ 2047 లోగుట్టు

రాష్ట్రంలో భూములపై కార్పొరేట్ రాబందులు కన్నేశాయి. సర్కారు అండదండలతో భూములను దిగమింగడమే లక్ష్యంగా దుర్భిణీ వేసి గాలిస్తున్నాయి. ప్రభుత్వ పోరంబోకు, ఊరుమ్మడి, అటవీ, చివరకు ఉప్పు భూములు, మడ అడవులను సైతం స్వాహా చేయడానికి సిద్ధమౌతున్నాయి. కొండలమీద గిరిజనులు, సముద్ర తీరాల్లోని మత్స్యకారులు, పల్లెసీమల్లోని వ్యవసాయదారులు, నగరాలు, పట్టణాల్లోని పేద,మధ్యతరగతి బడుగుజనం వీరంతా ఈ భూ యజ్ఞంలో సమిధలే! ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక, క్రీడలు... పేరేదైనా చివరన చేర్చే అభివృద్ధి అర్థం ఒక్కటే! అదే.. భూములను కొల్లగొట్టడం! అదాని, అంబానీల అడుగులకు మడుగులొత్తే నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో రాష్ట్రాన్ని కార్పొరేట్ల పరం చేయడం!! నమ్మశక్యం కావడం లేదా...! అయితే రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన పాలసీల రెక్కల చప్పుడు వినండి!!



విజయవాడ : 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్ర' ...ఇది కేంద్ర ప్రభు త్వపు అడుగుజాడల్లో టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'స్వర్ణాంధ్ర విజన్ 2047' డాక్యుమెంట్ లక్ష్యం! అయితే, 'వెల్తీ..హెల్తీ..హ్యాపీ' ఎవరికి దక్కనున్నాయన్నదే అసలైన ప్రశ్న! విజన్ డాక్యుమెంట్‌కు అనుబంధంగా విడుదల చేసిన వివిధ పాలసీలను పరిశీలిస్తే ప్రభుత్వం చెబుతున్న అభివృద్ధి సంగతేమో కానీ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూములపైన కార్పొరేట్ల దృష్టి పడిందన్నది అర్థమవుతుంది.వారి కన్ను పడిన ప్రతి ఎకరాన్ని కట్టబెట్టడానికి ప్రభుత్వం జీ..హుజార్ అంటున్న విషయం స్పష్టమౌతుంది! పాలసీల అమలులో భాగంగా ఐదేళ్లలో భూ పందారాన్ని పూర్తిచేస్తారు! అభివృద్ధి అంటారా... అది 2047 నాటి మాట!!

ఎంత భూమి .....?

రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు ఎంత భూమి కావాలి? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం! రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయమై స్పష్టత ఇవ్వడం లేదు. అయితే, 'ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ'లో ఇప్పటి వరకు ఎంత భూమి అందుబాటులో ఉందో ప్రభుత్వం వివరించింది. 'రాష్ట్రంలోని మూడు జాతీయ పారిశ్రామిక కారిడార్లు (విశాఖపట్నం-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్ బెంగళూరు)కు అదనంగా 20 క్లస్టర్లలో 14,093 ఎకరాల భూమి ఇప్పటికే అందుబాటులో ఉంది.' అని ఈ పాలసీలో ప్రభుత్వం పేర్కొంది. 'ఇది కాకుండా మరో 30 క్లస్టర్లకోసం 1.30 లక్షల ఎకరాల భూమిని గుర్తించాం. దీనిలో 54,781 ఎకరాలు పోర్టు ఆధారిత భూమి. మిగిలిన 75,683 ఎకరాలు పోర్టులతో సంబంధం ఉన్న లోతట్టు భూములు(హింటర్‌ల్యాండ్) అని ప్రభుత్వం పేర్కొంది. ఇలా గుర్తించిన భూమిలో 44,777 ఎకరాల భూమి ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లు పాలసీలో పేర్కొన్నారు.' ఇంతటితో కార్పొరేట్లకు భూ పందేరం ఆగిందనుకుంటే పొరపాటే! ఇవి పాక్షిక లెక్కలే! ఆ పాలసీలోనే ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రైవేటు వ్యక్తులు సొంతగా భూమిని సమకూర్చుకోవచ్చని పేర్కొంది. అలా సమకూర్చుకునే భూమికి అన్ని రకాల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంతో పాటు, రాయితీలను ఇస్తామని పేర్కొంది. ఇలా ప్రైవేటు వ్యక్తులు సమకూర్చుకునే భూమికి ఎటువంటి పరిమితి పెట్టలేదు. పైగా 'సొంతగా సమకూర్చుకోవాలి' అని చెబుతున్నప్పటికీ ప్రభుత్వం నుండి అన్ని రకాల సహాయ,సహకారాలు లభిస్తాయన్నది బహిరంగ రహస్యమే! ఇప్పటికే రాష్ట్రంలో 211 ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయి. వీటిలో అధికభాగం పారిశ్రామిక కార్యక్రమాలకు దూరంగానే ఉన్నాయి. వాటికి కొత్తగా ఏర్పాటు కానున్న పార్కులు అదనం! ఇది కాకుండా, టూరిజం, క్రీడలు, మారిటైమ్ వంటి పాలసీలకు అదనంగా భూమిని సేకరించాల్సిఉంది!

తీరంలో మిగిలేదేమిటి?

పోర్టులు, పోర్టు ఆధారిత పరిశ్రమల పేరుతో ప్రకటించిన 'మారిటైం పాలసీ' అమలు కోసం ఎంత భూమి అవసరమౌతుందన్న విషయం కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదు. నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు వద్ద 9 వేల ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సేకరించింది. తాజాగా మరో 10 వేల ఎకరాలను సేకరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇదిగాక, భారత్ పెట్రోలియం కార్పొరేషన్‌కు 6 వేల ఎకరాలను కేటాయించనున్నారు. ఈ జిల్లాలో ఇప్పటికే, కృష్ణపట్నం పోర్టు, సెజ్‌ల పేరిట వేలాది ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి ఉంది. ఆ భూముల్లో అధికభాగం ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. తాజాగా ప్రకటించిన మారి టైం పాలసీ ప్రకారం పోర్టునుండి 100 కి.మీల పరిధిని పోర్టు సన్నిహిత ప్రాంతం (పోర్టు ప్రాక్సిమల్ ఏరియా)గా ప్రకటించారు. ఈ ప్రాంతంలో పోర్టు అనుబంధ పరిశ్రమల ఏర్పాటు పేరిట కార్పొరేట్లు ఎక్కడ కోరితే అక్కడ భూములు ఇవ్వడానికి ప్రభుత్వం సన్నద్ధమౌతోంది. దీంతో కోస్తా జిల్లాల ప్రజానీకంపై తీవ్రస్థాయిలో ప్రభావం పడనుంది. విజయనగరం,శ్రీకాకుళం వంటి జిల్లాలు దాదాపుగా నూరుశాతం పోర్టు ప్రాక్సిమల్ ఏరియా పరిధిలోకి వస్తుండటం గమనార్హం. ఈ ప్రాంతంలో ఏర్పడే పోర్టు ఆధారిత పరిశ్రమల కోసం రాష్ట్రంలో అమలులో ఉన్న అన్ని రకాల భూ సేకరణ, సమీకరణ విధానాలను అమలు చేస్తామని పాలసీలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అత్యధిక వ్యవసాయ భూములు ఈ పాలసీ పరిధిలోకి నేరుగా వస్తున్నాయి. అయితే, ఈ వ్యవసాయ భూముల పరిరక్షణకు ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వలేదు. అదే విధంగా పర్యావరణ పరంగా అత్యంత ప్రాముఖ్యత ఉన్న ఉప్పు భూములు, మడ అడవుల పరిరక్షణ విషయంలోనూ ప్రభుత్వం పాలసీలో మౌనం వహించింది. ఇప్పటికే ఈ భూములపై కార్పొరేట్లు కన్నేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

టూరిజం కోసం వివాదాలు లేని భూమి

పర్యాటక రంగ అభివృద్ధికోసం ఎటువంటి వివాదాలు లేని (ఎన్‌కంబరెన్స్ ఫ్రీ) భూమిని కార్పొరేట్లకు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పర్యాటక ప్రదేశాల్లో విలాసవంతమైన హోటళ్లు, ఎగ్జిబిషన్లు, ఇతర వినోదాల నిర్వహణ కోసం ఈ కేటాయింపులు జరగనున్నాయి. ఆలయాలు, అడవులు, సముద్రతీరాలను ఆరు రకాల సర్క్యూట్‌లగా విభజించిన ప్రభుత్వం ఈ అన్ని ప్రాంతాల్లోనూ భూములు కేటాయిస్తామని తెలిపింది. ఈ తరహా భూములను రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం. వీటి కేటాయింపులకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో విడుదల చేస్తామని పాలసీలో పేర్కొంది. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ భూములుంటే వాటిని కార్పొరేట్లకు అప్పగించడం. లేని పక్షంలో భాగస్వామ్యం పేరుతో ప్రజల నుండి భూమలను తీసుకోవాలని భావిస్తున్నటు సమాచారం.

మైదానాలతో పాటు ఊరుమ్మడి స్థలాలకు ఎసరు !

లక్ష్యం చెప్పి విడుదల చేసిన స్పోర్ట్స్ పాలసీలో ఇప్పటికే ఉన్న మౌలికవసతులను దీర్ఘకాలిక ప్రాతిపదికన లీజుకివ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. దీనర్థం క్రీడా మైదానాలను ప్రైవేటుకు అప్పగించడమన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పిపిపి పద్ధతిలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు పాలసీలో పేర్కొన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఊరుమ్మడి స్థలాలను సైతం క్రీడల అభివృద్ధికోసం ప్రైవేటుసంస్థలకు కేటాయిస్తామని, రెవిన్యూ షేరింగ్ పద్ధతిలో ఈ ప్రక్రియ జరుగుతుందని పాలసీలో పేర్కొనడం స్థానిక సంస్థలు, వాటి ప్రజాప్రతినిధులతో భూములపై వివాదం రాకుండా చూడటం కోసమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ ప్రకారం ఏర్పాటు చేసే స్పోర్ట్స్ ఎకనామిక్ జోన్‌లకు ప్రత్యేకంగా భూ కేటాయింపులు చేయనున్నారు.

అన్ని పాలసీల్లోనూ...

ఇవే కాదు. మిగిలిన అన్ని పాలసీలూ భూమి చుట్టే తిరిగాయి. కొన్నింటికి పారిశ్రామిక విధానం ప్రకారం, మరికొన్నింటికి విడిగా భూములు కట్టబెడతామని ప్రభుత్వం పేర్కొంది. ఎర్లీ బర్డ్ ఇన్సెంటివ్ (ముందు వచ్చినవాళ్లకి వచ్చినట్లు రాయితీలు) పెట్టుబడులు ఆధారంగా టైలర్ మేడ్ ఇన్సెంటివ్ (అవసరానికి తగిన విధంగా రాయితీలు)గా ఈ ప్రక్రియ సాగనుంది. అదే సమయంలో పరిహారం గురించి మాత్రం ఇప్పటికే ఉన్న విధానాలను ప్రస్తావించి ఊరుకుంది. వాటి అమలు తీరు గురించిగాని, ప్రత్యేకంగా న్యాయం చేయడం గురించి గాని ఎటువంటి ప్రస్తావన లేదు.

కేరళ జీవ సమాధి ఘటన..
మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు

తిరువనంతపురం: కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో గోపన్ స్వామి అనే వ్యక్తి జీవ సమాధి అంశం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఆ సమాధిని తవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో పోలీసులు సమాధిని తవ్వి ఆయన మృతదేహాన్ని వెలికితీశారు.

సమాధి వద్దకు ఉదయం 7 గంటల సమయంలో చేరుకున్నామని.. దానిని తవ్వడాన్ని కుటుంబసభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే భారీ భద్రత నడుమ కాంక్రీటుతో నిర్మించిన గోపన్ స్వామి సమాధిని తవ్వామని పోలీసులు పేర్కొన్నారు. లోపల ఆయన మృతదేహం ధ్యాన స్థితిలో ఉందని.. ఛాతి వరకు పూజా సామగ్రి నింపి ఉందని తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తిరువనంతపురంలోని మెడికల్ కాలేజీకి తరలించినట్టు పేర్కొన్నారు.

గోపన్ స్వామి అలియాస్ మణ్యన్ జీవ సమాధి అయ్యారని కొన్నిరోజుల క్రితం ఆయన కుటుంబీకులు పోస్టర్లు ప్రచురించారు. బంధువులు, స్థానికులకు తెలియకుండా అతన్ని నెయ్యాటింకరలోని ఓ దేవాలయం సమీపంలో పూడ్చిపెట్టడంతో ఆయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ఎవరూ చూడకుండా తనను సమాధి చేయాలని గోపన్ చెప్పినట్టు ఆయన కుమారులు సనందన్, రాజేశన్ పేర్కొన్నారు.

ఈవిషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. సబ్ కలెక్టర్ ఆల్ఫ్రేడ్ తన సిబ్బందితో





వెళ్లి సమాధిని తవ్వాలని ఆదేశించారు. ఈ చర్యను గోపన్ స్వామి భార్య కుమారులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు న్యాయపరంగా ముందుకెళ్లారు. సమాధిని తవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో మరోసారి ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనపై విచారణ జరిపిన హైకోర్టు సమాధిని తవ్వి తీరాల్సిందేనని ఆదేశించింది.

గోద్రా రైలు ఘటనపై ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టులో విచారణ



న్యూఢిల్లీ: 2002లో జరిగిన గోద్రా రైలు ఘటనపై.. ఫిబ్రవరి 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్టు సుప్రీంకోర్టు తెలిపింది. గుజరాత్ ప్రభుత్వంతో పాటు అనేక మంది దాఖలు చేసిన పిటీషన్లపై విచారణ చేపట్టనున్నది. ఈ కేసు విచారణకు మరో తేదీని ఇవ్వబోమనని జస్టిస్ జేకే మహేశ్వరి, అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది.2002, ఫిబ్రవరి 27వ తేదీన సబర్మతి రైలుకు చెందిన ఎస్-6 బోగీలో చెలరేగిన మంటల్లో సుమారు 59 మంది ప్రయాణికులు మరణించారు. ఆ కేసులో 2017లో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ అనేక మంది సుప్రీంలో అప్పీల్ చేసుకున్నారు. జీవిత ఖైదు శిక్ష పడిన 11 మంది నిందితులకు మరణశిక్ష విధించాలని కోరుతూ గత ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్ సర్కారు సుప్రీంను ఆశ్రయించింది.అయితే గురువారం విచారణ సమయంలో ఓ నిందితుడి తరఫున లాయర్ హాజరయ్యారు. కానీ ఆధారాలు సమర్పించలేకపోయారు. గత ఏడాది నుంచి ఈ కేసును ఇప్పటి అయిదు సార్లు వాయిదా వేశానని, ఇక మళ్లీ వాయిదా వేయబోమని జస్టిస్ మహేశ్వరి తెలిపారు. కొందరు నిందితులకు చెందిన క్షమాభిక్ష పిటిషన్లు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్టు సుప్రీంకు లాయర్ తెలిపారు. గుజరాత్ ప్రభుత్వ అప్పీల్‌పై ముందుగా విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోరారు.

అదిరిందయ్యా వైష్ణవ్ !

అధికారి నుంచి కేంద్ర మంత్రి స్థాయికి..

ఆయన పట్టిందంతా బంగారమే

లక్ష రూపాయల పెట్టుబడితో కోట్లాది రూపాయల ఆదాయం

అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు చేయూత

'న్యూస్‌లాండ్రీ' విశ్లేషణాత్మక కథనం



న్యూఢిల్లీ : అదృష్టం కాదు అది! బీజేపీ పాప్రకంలో పెరిగిన ఒక క్రోనీ క్యాపిటలిస్టు కమ్(ఐ.ఎఎస్) అధికారి అంచెలంచెలుగా ఎదిగిన తీరది. వారు ఏం పట్టుకుంటే అది బంగారం అయింది. తొలుత ఓ అధికారిగా, ఆ తర్వాత కంపెనీ అధిపతిగా వ్యవహరించిన అశ్వినీ వైష్ణవ్... ప్రధాని నరేంద్ర మోడీ చూపు పడడంతో ఏకంగా కేంద్ర మంత్రి అయ్యారు. ఆయన ఓ కంపెనీలో కేవలం లక్ష రూపాయలు మాత్రమే పెట్టుబడి పెట్టి కోట్లాది రూపాయల ఆదాయం పొందారంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈ నేపథ్యంలో అశ్వినీ వైష్ణవ్ ప్రస్థానంపై 'న్యూస్‌లాండ్రీ' పోర్టల్ అందిస్తున్న విశ్లేషణాత్మక కథనం...

వాజ్‌పేయి ప్రయివేటు కార్యదర్శిగా

2004లో ప్రధాని పదవికి అటల్ బీహారీ వాజ్‌పేయి రాజీనామా చేశారు. దానికి ముందు పీఎంఓలో పనిచేస్తున్న డిప్యూటీ సెక్రెటరీ వాజ్‌పేయి వద్దకు వచ్చారు. తాను కాంగ్రెస్ ప్రధాని వద్ద పనిచేయలేనంటూ మొర పెట్టుకున్నారు. ఆ అధికారి 2006 వరకూ వాజ్‌పేయి ప్రయివేటు కార్యదర్శిగా పనిచేశారు. ఇప్పుడు కేంద్రమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఎవరో మీకు అర్థమైంది కదూ...ఆయనే అశ్వినీ వైష్ణవ్. ఒడిశా కేడర్‌కు చెందిన ఈయన 1994లో ఐఎఎస్ అధికారి అయ్యారు. 2021లో...అంటే ఏడు సంవత్సరాల వ్యవధిలోనే కేంద్ర మంత్రి అయ్యారు.

2019లో రాజకీయ అరంగేట్రం

వ్యాపారస్తులు రాజకీయాల్లో దిగితే ఒకలా, రాజకీయ నేతలే వ్యాపారాలు నిర్వహిస్తూ, ఇటు అధికారి పాత్రలో ట్రిబుల్ యాక్షన్ చేశాడు ఈ ప్రబుద్ధుడు. వైష్ణవ్ రాజకీయ జీవితం 2019లో ప్రారంభమైంది. అది కూడా ఆశ్చర్యకరంగానే మొదలైంది. ఒడిశాలో అధికార బీజేడీ, ప్రతిపక్ష బీజేపీ...ఈ రెండు పార్టీలూ కలిసి ఆయన్ని రాజ్యసభకు నామినేట్ చేశాయి. వైష్ణవ్‌ను తొలుత బీజేడీ తన అభ్యర్థిగా ప్రకటించింది. అయితే అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన వెంటనే కొంత 'అయోమయం' నెలకొన్నదని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. 'ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా నాతో మాట్లాడారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఆయన ప్రయివేటు కార్యదర్శిగా వైష్ణవ్ పనిచేసినందున ఆయనకు తాము మద్దతు ఇస్తామని చెప్పారు' అని అన్నారు. ఏమైతేనేం...వైష్ణవ్ నామినేషన్ అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య స్వల్పకాలిక మైత్రికి కారణమైంది.

ఇనుప ఖనిజం పరిశ్రమలో అడుగు

వైష్ణవ్ 2003లో స్వరాష్ట్రమైన ఒడిశాను వదిలి వెళ్లారు. వాజ్‌పేయితోనూ, కొన్ని ఇతర అధికారిక పనుల మీద పనిచేసిన తర్వాత కొంత విరామం ఇచ్చి 2008 నుంచి 2010 వరకూ అమెరికాలోని వార్టన్ స్కూలులో ఎంబీఏ చదివారు. అక్కడి నుంచి తిరిగి వచ్చిన తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని, కార్పొరేట్ సంస్థల కోసం పనిచేశారు. 2015లో తిరిగి ఒడిషా చేరుకున్నారు. ఆ ఏడాదే అడ్లర్ ఇండస్ట్రియల్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ పేరిట పరిశ్రమను స్థాపించి ఇనుప ఖనిజపు ఇండస్ట్రీలో అడుగు పెట్టారు. ప్రారంభంలో అడ్లర్‌కు కేవలం ఒకే ఒక క్లయింట్ ఉండేవాడు. అతనే బి. ప్రభాకరన్. త్రివేణి ఎర్త్‌మూవర్స్ అనే కంపెనీకి అధిపతి. ఒడిశాలోని బార్బిల్ పట్టణ పరిసర ప్రాంతంలో ఇనుము, మాంగనీస్ నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. వాటిపై ప్రభాకరన్ నియంత్రణ అధికంగా ఉండేది. 2004-2015 మధ్యకాలంలో త్రివేణి ఎర్త్‌మూవర్స్ అతి పెద్ద కాంట్రాక్టింగ్ కంపెనీగా ఎదిగింది.

రాష్ట్రంలో గనులు లీజుకు తీసుకున్న వారి తరఫున తవ్వకాలు జరపడం దాని పని. అయితే ప్రభాకరన్ చట్టవిరుద్ధంగా అక్రమ మైనింగ్ జరిపారని 2014లో ఎంబీ షా కమిషన్ తేల్చింది. ప్రభాకరన్ కేవలం మైనింగ్ కాంట్రాక్టర్ మాత్రమే కాదని, బినామీ పేర్లతో ఆయన కంపెనీ అనేక గనుల్ని తవ్విందని, చట్టబద్ధంగా తవ్వకాలు జరపడంతో పాటు చట్టవిరుద్ధంగానూ మైనింగ్ కార్యకలాపాలు చేపట్టి భారీగా ఆదాయం ఆర్జించిందని షా కమిషన్ తన నివేదికలో పలుమార్లు ప్రస్తావించింది.

అక్రమ మైనింగ్‌కు చేయూత

వైష్ణవ్‌తో ఉన్న సంబంధాల కారణంగానే ప్రభాకరన్ రాజకీయ లబ్ది పొందారని చెబుతూంటారు. ఎన్నికల బాండ్ల రూపంలో త్రివేణి, దాని అనుబంధ సంస్థలు రాజకీయ పార్టీలకు భారీగా విరాళాలు అందించాయి. తదనంతర కాలంలో త్రివేణి ఎర్త్‌మూవర్స్‌తో వైష్ణవ్ సంబంధాలు మరింత బలపడ్డాయి. వైష్ణవ్ అడ్లర్ భాగస్వామ్యంతో త్రివేణి పెల్లెట్స్ ప్రయివేట్ లిమిటెడ్ (టీపీపీఎల్) అనే కొత్త కంపెనీ ఆవిర్భవించింది. వైష్ణవ్ కంపెనీ దీనికి రూ.111.50 కోట్ల ఆర్థిక సాయాన్ని సైతం అందించింది. ఈ రుణ సాయం కారణంగా అదే కంపెనీ నుంచి ఇనుపు ఖనిజపు గుళికలు కొనుగోలు చేసి ఆ తర్వాతి సంవత్సరాలలో గణనీయంగా లాభాలు ఆర్జించింది.

కొత్త కంపెనీ ఏర్పడిన 2015-16లో అందులో వైష్ణవ్ సంస్థ పెట్టిన ప్రారంభ పెట్టుబడి కేవలం లక్ష రూపాయలు మాత్రమే. ఆ కొద్దిపాటి పెట్టుబడికే అడ్లర్‌కు రూ.45 లక్షల ఆదాయం లభించింది. అది ఆ తర్వాత ఇబ్బడిముబ్బడిగా పెరగడం మొదలైంది. 2016-17లో రూ.3.79 కోట్లు, 2017-18లో రూ.4.51 కోట్ల ఆదాయం పొందింది. 2019 వరకూ అడ్లర్ కంపెనీకి అయిన ఖర్చు కేవలం దాని డైరెక్టర్లు వైష్ణవ్, ఆయన భార్య సునీతకు చెల్లించిన రెమ్యునరేషన్ మాత్రమే. వీరిద్దరూ కంపెనీ డైరెక్టర్లుగా గణనీయంగా జీతాలు తీసుకునే వారు. ఉదాహరణకు 2016-17లో కంపెనీకి వచ్చిన రూ.3.79 కోట్ల ఆదాయంలో జీతాలకే రూ.2.46 కోట్లు చెల్లించారు. ఇందులో వైష్ణవ్‌కు రూ.2.26 కోట్లు, సునీతకు రూ.18 లక్షలు ఇచ్చారు. మొత్తానికి లక్ష రూపాయల పెట్టుబడి కొన్ని సంవత్సరాలకు రూ.113 కోట్ల పుస్తక విలువ కలిగిన వాటాలను సంపాదించి పెట్టింది. ఆ కంపెనీ ఆదాయం ఆరు సంవత్సరాలకే రూ.45 లక్షల నుంచి రూ.323 కోట్లకు పెరిగింది.

ధనం, అధికారం కొద్ది మంది చేతుల్లోనే

- వారితోనే దేశ ప్రజాస్వామ్యానికి, భవిష్యత్తుకు ప్రమాదం
- దేశ ప్రజలనుద్దేశించి చివరి ప్రసంగంలో హెచ్చరించిన బైడెన్

వాషింగ్టన్ : దేశంలో వేళ్ళూను కుంటున్న నయా సంపన్నులనబడే పెద్ద మనుష్యుల వల్ల ఎదురయ్యే ప్రమాదం గురించి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హెచ్చరించారు. అలాగే అమెరికన్ల హక్కులు, ప్రజాస్వామ్య భవిష్యత్తును దెబ్బ తీస్తున్న 'టెక్-ఇండస్ట్రియల్ కాంప్లెక్స్' గురించి కూడా ఆయన హెచ్చరించారు. ఓవల్ ఆఫీస్ నుండి దేశ ప్రజలనుద్దేశించి బుధవారం బైడెన్ 15నిముషాల పాటు వీడ్కోలు ప్రసంగం చేశారు. అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్‌కు ఈ నెల 20న బైడెన్ అధికారాన్ని అప్పగించాల్సి వుంది. అమెరికాలో అధికారం, సంపద అంతా కూడా కేవలం కొద్దిమంది చేతుల్లో పేరుకుపోయి వుంటోందనే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. "ఈనాడు, అమెరికాలో అత్యంత సంపద, అధికారం, ప్రాబల్యం వంటి వాటితో కూడిన సామ్రాజ్యవాదం రూపుదిద్దుకుంటోంది. ఇది మన మొత్తం ప్రజాస్వామ్యం, మన మౌలిక హక్కులు, స్వేచ్ఛలకు ముప్పు కలిగిస్తోంది. ముందుకెళ్ళడానికి ప్రతి ఒక్కరికీ గల అవకాశాలను దెబ్బ తీస్తోంది." అని బైడెన్ పేర్కొన్నారు. చాలాకొద్ది మంది నయా సంపన్నవాదుల చేతుల్లో ఇలా అధికారం కేంద్రీకృతమవడం వల్ల ఎదురయ్యే తీవ్ర పర్యవసానాల గురించి బైడెన్ ప్రజల దృష్టికి తీసుకువచ్చారు. వారి అధికార దుర్వినియోగాన్ని ఎలాంటి అడ్డూ అదుపు లేకుండా వదిలివేసినట్లైతే విపరీతమైన పరిస్థితులు, పర్యవసానాలు నెలకొంటాయని హెచ్చరించారు. 1961లో అధికారం నుంచి బయటకు వచ్చిన అధ్యక్షుడు ఐషన్‌హోవర్ ఆనాడు చేసిన మిలటరీ-ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ హెచ్చరికలను ఈ సందర్భంగా ఉదహరించారు.



ప్రజా సమస్యలపై పోరాటాలు

రాష్ట్ర మహాసభలో ఉద్యమ కార్యాచరణ : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి

నవతెలంగాణ-సూర్యాపేట

రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని, అందుకోసం ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నామని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి అన్నారు. రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై రాష్ట్ర మహాసభలో చర్చించి ఉద్యమాలకు రూపకల్పన చేస్తామని తెలిపారు. అలాగే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి పోరాటాలు తీవ్రం చేస్తామన్నారు. గతంలో రైతాంగం చేసిన పోరాట ఫలితంగా పంటలకు మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోడీ మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధర కల్పిస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రైతు నాయకుడు దల్లేవాల్ ఢిల్లీలో 50 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతుల ఉద్యమాలను, నిరవధిక నిరాహార దీక్షలను భగ్నం చేయాలని ప్రయత్నిస్తుందే తప్ప హామీలను అమలు చేయాలన్న ఆలోచన చేయకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. దేశంలో కుల, మతాల మధ్య వైషమ్యాలు సృష్టిస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. మరోవైపు భారత రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని అమలు చేయాలని కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా మహిళలపై, దళితులపై దాడులు, హత్యలు, దౌర్జన్యాలు, హింస పెరిగిందని, వాటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఉచిత బస్సు మినహా మరే పథకం కూడా సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఈ నెల 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం పారదర్శకంగా సర్వే నిర్వహించి అర్హులకు అందించాలని డిమాండ్ చేశారు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, నాయకులు మేకనబోయిన శేఖర్, ఎలుగురి గోవిందు, మద్దెల జ్యోతి, కొప్పుల రజిత పాల్గొన్నారు.

భూమికి భూమి.. లేదా ఎకరాకు కోటి పరిహారం ఇవ్వాలి

గ్రీన్ ఫీల్డ్ భూ నిర్వాసితులకు అండగా ఉంటాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ

నవతెలంగాణ-కందుకూరు

గ్రీన్‌ఫీల్డ్ భూ నిర్వాసితులకు భూమికి భూమి లేదా.. ఎకరాకు కోటి రూపాయల పరిహారం అందజేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ఆధ్వర్యంలో కందుకూరు మండల పరిధిలోని రాచులూరు, గాజుల బురుజుతండాలో రైతుల పొలాలను పరిశీలించారు. అనంతరం కందుకూరు పాషా నరహరి స్మారక కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూములను తక్కువ ధరకు, బలవంతంగా లాక్కోవాలని చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మాపురం, లేమూరు, అగర్మియాగూడ, రాచులూరు, మీరుఖాన్‌పేట్, పంజాగూడ, గుమ్మడవల్లి గ్రామాలు, ఇబ్రహీంపట్నం మండలంలోని రెండు మూడు గ్రామాల్లో 400 మందికిపైగా రైతుల భూములను తీసుకునేందుకు సర్వే చేశారని తెలిపారు.




గ్రామ సభలు నిర్వహించి రైతులకు పరిహారం ఇచ్చిన తర్వాతే భూముల సర్వేలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన ఉంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాట మార్చిందని విమర్శించారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని, గ్రామ సభలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్, దుబ్బాక రామచందర్, ఈ.నరసింహ, కవిత, చంద్రమోహన్, జగన్, మధుసూదన్‌రెడ్డి, నాయకులు బుట్టి బాలరాజు, ఏర్పుల శేఖర్, బుగ్గ రాములు, పి.అంజయ్య, రాయిచెట్టు చందు, అంకగాళ్ల కుమార్, బుడ్డీరపు శ్రీనివాస్, గౌర శ్రీశైలం, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు తదితరులు పాల్గొన్నారు.

అంబుజాను రద్దు చేయాల్సిందే



(మొదటి పేజీ తరువాయి)

సమీపాన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సేకరించిన స్థలం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ధర్మారెడ్డి కాలువ, వ్యవసాయ భూములను తమ్మినేని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రామన్నపేట, సిరిపురం, కొమ్మాయిగూడెం గ్రామాలకు చెందిన సాగు భూమి 300 ఎకరాలు కొనుగోలు చేసి.. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పెడుతున్నారని అన్నారు. ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే పంటలు, పశుపక్షాదులు, ప్రజలకు, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. గ్రామాలకు సమీపాన ఇలాంటి ఫ్యాక్టరీలు నిర్మించడం సరికాదన్నారు. ఈ ఆందోళనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్నాయన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో కమిటీ ఏర్పడిందని, ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేసినట్టు గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం ఇప్పటివరకు వెనక్కి తీసుకునే ప్రకటన చేయలేదని, సీపీఐ(ఎం) తరఫున ఫ్యాక్టరీ నిర్మాణం జరిగే ప్రదేశాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడినట్టు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మాణం చేయొద్దంటూ వారంతా ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారని అన్నారు.

వాస్తవానికి అదానీ వ్యవహారాలు, అవినీతి దేశానికి కొత్తేమీ కాదన్నారు. ఇటీవల అదానీ వ్యవహారం పార్లమెంటును కుదిపేసిందన్నారు. అమెరికాలో అదానీపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల విరాళాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వెనక్కి ఇవ్వడంపై తమ పార్టీ హర్షం వ్యక్తం చేస్తోందని అన్నారు. కానీ అదానీ కంపెనీలతో చేసుకున్న అగ్రిమెంట్ ఏం చేశారని ప్రశ్నించారు. రూ.12 వేల 400 కోట్ల అగ్రిమెంట్‌లోనే ఈ రామన్నపేట భూమి కూడా ఉందని చెప్పారు. వీటితోపాటు మరో రెండు సోలార్ ఫ్యాక్టరీలు ఉన్నాయన్నారు. అదానితో చేసుకున్న ఒప్పందాలు బయటికి రావాలని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్ రద్దు చేయాలని, రైతుల గోడును పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి మెమోరాండం ఇచ్చి వివరిస్తామని అన్నారు. అయినా పరిష్కారం కాకపోతే అన్ని రాజకీయ పక్షాలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, జెల్లెల్ల పెంటయ్య, నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్ పాల్గొన్నారు.

ఎక్కడ ప్రజా సమస్య ఉంటే అక్కడ.. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ నేనున్నానంటూ అండగా నిలిచి బాధితులకు భరోసానిస్తున్న సీపీఐ(ఎం).. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితుల విషయంలోనూ అలుపెరగని పోరాటం చేసింది. మొదటి నుంచి రైతులు, ముంపు బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వంతో కొట్లాడి.. సమస్యల పరిష్కారానికి కృషి చేసింది. గ్రామ గ్రామాన సమావేశాలు, రిలే నిరాహార దీక్షలు, పాదయాత్రలు, ధర్నాలు, సభలు పెట్టి నిర్వాసితులను చైతన్యం చేయడంతోపాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. పరిహారాలు అందేలా నిరంతరం పోరాడుతూనే ఉంది. ఈ క్రమంలో సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభ నేపథ్యంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలపై కథనం.

నిర్వాసితులకు అండగా ఎర్రజెండా





మల్లన్నసాగర్‌లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సీపీఐ(ఎం) పోరాటాలు

పరిహారాలు అందేలా కృషి

అక్రమ కేసులను ఎదుర్కొన్న సీపీఐ(ఎం) నేతలు

నేటికీ పూర్తి స్థాయిలో అందని పరిహారం

నవతెలంగాణ-తొగుట

మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలపై పోరాడేందుకు సీపీఐ(ఎం) ఉమ్మడి జిల్లా నాయకులు ఏ.మల్లేశం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జయరాజ్, దుబ్బాక డివిజన్ కార్యదర్శి భాస్కర్ తదితరులు గ్రామ గ్రామాన సమావేశాలు నిర్వహించారు. 2013 చట్టం ప్రకారం న్యాయం జరగాలని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ప్రజలను చైతన్యం చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆనాటి రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మండల కేంద్రంలో ముంపు గ్రామాల నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకార పరిహారం చెల్లిస్తేనే భూములు ఇవ్వాలని రైతులకు అవగాహన కల్పించారు. 123, 214 ప్రత్యేక జీవోతో నిర్వాసితులకు అన్యాయం జరుగుతుందని జూన్ 2వ తేదీన ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నల్ల జెండాలు పెట్టి రిలే దీక్షలు ప్రారంభించారు. అనంతరం అన్ని గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ఆర్‌డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర

రాష్ట్ర ప్రభుత్వం జూన్ రెండో తేదీన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చేసుకుంటున్న సమయంలో మల్లన్నసాగర్ గ్రామాల్లో నిర్వాసితులు రిలే నిరాహార దీక్షలు చేశారు. అధికారులు భూ సేకరణ చేసేందుకు గ్రామాల్లో తిరుగుతూ నిర్వాసితులపై ఒత్తిడి పెంచారు. భయభ్రాంతులకు గురిచేయడంతో సీపీఐ(ఎం) నేత అముదాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వాసితుల్లో మనో ధైర్యాన్ని కల్పించారు. కొండపాక మండలం ఎర్రవల్లి, సింగారం, తొగుట మండలంలోని పల్లె పహాడ్, వేములఘాట్, టి.బంజేరు పల్లి, మొగిలి చెరువు తండా, ఏటిగడ్డ కిష్టాపూర్, తిరుమలగిరి, లక్ష్మాపూర్, రాంపూర్, తొగుట, తుక్కాపూర్, బ్రాహ్మణ బంజేరు పల్లి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. ఆర్డీఓ కార్యాలయం ముందు 2వేల మందితో పెద్దఎత్తున సభ నిర్వహించారు. సీపీఐ(ఎం) ఆధ్వ ర్యంలో ఉమ్మడి జిల్లా సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ముందు ఏ.మల్లేశం, భాస్కర్, రామచంద్రం, మల్లన్నసాగర్, పల్లేపహాడ్ భూనిర్వాసితులు నాలుగు రోజులపాటు నిరాహార దీక్ష చేశారు.

పాదయాత్రలో పాల్గొన్న తమ్మినేని

2016 జులై 1న ఎర్రవల్లి గ్రామం నుంచి ప్రారంభమై నాలుగు రోజులపాటు సాగిన పాదయాత్రను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభించారు. అరుణోదయ సాంస్కృతిక కళామండలి అధ్యక్షులు విమలక్క, ఇతర వామపక్ష పార్టీల నేతలు పాల్గొన్నారు. కొండపాక, తొగుట మండలాల్లోని కొన్ని గ్రామాల మీదుగా సాగిన పాదయాత్ర నాలుగో రోజు ముగింపు సందర్భంగా ఏటిగడ్డ కిష్టాపూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సభకు హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, దుబ్బాక సమితి మాజీ అధ్యక్షులు సోలిపేట రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. మీరంతా ఒక పట్టుదలతో ఉంటే ప్రభుత్వం దిగొస్తుందని, అన్ని విధాలా మెరుగైన పరిహారం అందిస్తుందని తమ్మినేని వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇప్పటి వరకు శ్మశాన వాటిక లేదు. నిర్వాసితులు అనేక ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి. ఉపాధి పనులు కల్పించాలి. ఓపెన్ ప్లాట్లు కేటాయించాలి. గతంలో మల్లన్నసాగర్ ఉద్యమంలో నిర్వాసితులకు మద్దతు తెలిపిన ప్రస్తుత ముఖ్యమంత్రి నిర్వాసితుల సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– జి.భాస్కర్, సీపీఐ(ఎం) దుబ్బాక డివిజన్ కార్యదర్శి

సీపీఐ(ఎం) నాయకులపై అక్రమ కేసులు

ప్రాజెక్టు నిర్మాణానికి సీపీఐ(ఎం) వ్యతిరేకం కాదని, కానీ నిర్వాసితులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదంటూ నేతలు స్పష్టం చేశారు. 2016లో వేములఘాట్ నుంచి రాజీవ్ రహదారి ముట్టడికి సిద్ధమయ్యారు. ర్యాలీలో పాల్గొన్న సీపీఐ(ఎం) అప్పటి ఉమ్మడి జిల్లా నాయకత్వంపై అక్రమ కేసు బనాయించి, అరెస్టు చేసి జైలుకు పంపారు. వేములఘాట్ గ్రామంలో దాదాపు 950 రోజులకుపైగా దీక్షలు కొనసాగాయి. నిర్వాసితుల పక్షాన ప్రత్యక్ష పోరాటాలతో పాటు హైకోర్టులో కేసులు వేసి న్యాయ పోరాటంలో సైతం సీపీఐ(ఎం) అండగా నిలబడి కేసులో గెలుపొందింది. ఇంకా ప్రత్యక్షంగా పోరాడుతూనే ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించలేదు.

సంపాదకీయం

ఇంతన్నాడంతన్నాడే ట్రంప్ !

'అధికారానికి వచ్చిన 24గంటల్లోనే ఉక్రెయిన్ సమస్యను పరిష్కరిస్తా'నన్నాడు డోనాల్డ్ ట్రంప్, కావాలంటే దానికంటే ముందే కూడా చేస్తానని కూడా సెలవిచ్చాడు. ఒక్కరోజులో కాదులే గానీ కనీసం వందరోజులు పడుతుందన్నాడు ఉక్రెయిన్ రాయబారిగా ట్రంప్ ఎంచుకున్న కెయిత్ కెలోగ్. వంద రోజులా? చెప్పటానికి బాగానే ఉంటుంది గానీ, అంత తేలిగ్గా ఎలా కుదురుతుంది? కొన్ని నెలలు, అంతకంటే ఎక్కువ కాలమే పట్టవచ్చునని ట్రంప్ సలహాదారులు చెప్పినట్లు రాయిటర్స్ తాజా కథనం.ఈ తీరు చూసినపుడు 'ఇంతన్నాడంతన్నాడే గంగరాజు నన్నొగ్గెసెల్పోనాడే గంగరాజు' అన్నట్టుగా ఉక్రెయిన్ పరిస్థితి తయారైనట్లు కనిపిస్తోంది. ఎన్నికలకు ముందు ఎన్నో కబుర్లు వల్లించిన పెద్దమనిషి నోట ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచే మాటలో తేడా వచ్చింది. అప్పు రేపు అని గోడమీద రాసినట్లుగా " పరిష్కరిస్తా" అని మాత్రమే మాట్లాడుతున్నాడు. గాజాలో దాడులకు స్వస్తి పలకటం కంటే ఉక్రెయిన్ పోరు ముగించటం కష్టంగా కనిపిస్తోందని ఒక సందర్భంగా చెప్పాడు. ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరుగువాడు ట్రంప్.పైకి ఎన్ని బింకాలను ప్రదర్శించినా ఏదో విధంగా రాజీచేసి పరువు దక్కించమని పశ్చిమ దేశాలను జెలెన్‌స్కీ వేడుకుంటున్నాడన్నది స్పష్టం. ఉక్రెయిన్ మీద రష్యా ప్రారంభించిన సైనిక చర్య గురువారం నాడు 1,057వ రోజులోకి ప్రవేశించింది. బుధవారం నాడు రష్యా ప్రయోగించిన 40 క్షిపణులు, 70డ్రోన్ దాడులతో ఉక్రెయిన్ గ్యాస్ మౌలిక సదుపాయాలతో సహా విద్యుత్ సర ఫరా వ్యవస్థ చిన్నాభిన్నమైందని వార్తలు. అయితే ముందు జాగ్రత్త చర్యగా తామే అనేక ప్రాంతాల్లో కోతలు విధించినట్లు జెలెన్‌స్కీ యంత్రాంగం చెప్పుకుంది.




తమ భద్రతకు పనామా కాలువను, గ్రీన్‌లాండ్ ప్రాంతాన్ని అప్పగించాలని, కెనడాను విలీనం చేయాలని డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను రష్యా తనకు అనువుగా మలుచుకొంటోంది. రాజీ కుదిరితే స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్ ప్రాంతాలను అప్పగిస్తారా? అన్న ప్రశ్నకు అసలు దాని గురించి చర్చలకు కూడా ఆస్కారం లేదని పుతిన్ సహాయకుడు నికోలాయ్ పత్రుషెవ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. ట్రంప్ కొన్ని ప్రాంతాలు కావాలని కోరుకుంటున్నట్లే తమకూ ఉక్రెయిన్లో కొంత ప్రాంతం అవసరమే కదా అన్నట్లుగా పోలిక తెచ్చాడు. తమ దేశ భద్రతకు హామీగా నాటోలో ఉక్రెయిన్‌ను చేర్చుకో కూడదన్న వినతిని పెడచెవిన పెట్టిన తరువాతే రష్యా 2022 ఫిబ్రవరి 24 నుంచి మిలిటరీ చర్య జరుపుతున్నది. ట్రంప్ ప్రకటన తరువాత దానికి మరింత బలం చేకూరుతున్నది. అమెరికా తన అవసరాలకు అనుగుణంగా ప్రపంచ పటాన్ని తిరిగి గీస్తున్నది, అందులో భాగంగానే అనేక దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నదని పత్రుషెవ్ చెప్పాడు.ఉక్రెయిన్, ఐరోపా యూనియన్‌తో నిమిత్తం లేకుండా ముందుగా అమెరికా-రష్యాలు ఒక ఒప్పందానికి రావాలని అన్నాడు.చర్చలకు ప్రత్యేక పరిస్థితులేమీ అవసరం లేదని పుతిన్ ప్రతినిధి పెస్కోవ్ చెప్పాడు.దీని అర్థం సైనిక చర్యను తాత్కాలికంగా కూడా నిలిపివేసేది లేదని చెప్పటమే.

డోనాల్డ్ ట్రంప్ ఒక రాజకీయవేత్తగా ఓట్ల కోసం లేదా స్వభావసిద్ధంగానే వదరుబోతు కావచ్చు,కానీ అమెరికా పాలకవర్గ ప్రయోజనాలకు అనుగుణంగానే అంతిమంగా వ్యవహరిస్తాడు. 'నువ్వొకందుకు పోస్తే నేనొకందుకు తాగా' అన్నట్లుగా పుతిన్ ఉన్నాడు. ట్రంప్‌తో చర్చలకు తాము సముఖమే గానీ ఆయన సలహాదారులు ముందుకు తెచ్చిన ప్రతిపాదనలు కొన్ని కుదిరేవి కాదని రష్యా చెబుతున్నది. సంక్షోభ ముగింపు కొన్ని నెలలు పట్టవచ్చున్న సలహాదారుల వ్యాఖ్యలపై మాస్కో మౌనం పాటించింది. యుద్ధం కొనసాగిన కొద్దీ ప్రజల సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తోందనే మనో భావాలను ట్రంప్ రెచ్చగొట్టవచ్చు, దాని వలలో కొందరు పడవచ్చు గానీ సంక్షోభం ఎంత దీర్ఘకాలం కొనసాగితే అమెరికా ఆయుధ పరిశ్రమలకు లాభాలు, కొంత మందికి ఉపాధి, రష్యా ఇంధన మార్కెట్‌ను అమెరికా కంపెనీలు ఆక్రమించి లాభాలు పిండుకుంటాయి. అందుకనే ఏదో ఒకసాకు చూపి ట్రంప్ కూడా జో బైడెన్ బూట్లలో కాళ్లు దూర్చి నడిచేందుకే చూస్తాడు. ఐరోపాలోని అగ్రరాజ్యాలకు రష్యా బలహీనం కావటం అవసరం. అందుకే ఈ సంక్షోభం ఇప్పట్లో ముగిసేది కాదని భావిస్తున్నారు.నాటో కూటమి దేశాల ఉద్దేశ్యాలను గ్రహించి కావచ్చు, తొలి రోజుల మాదిరి రష్యా ఇప్పుడు దూకుడుగా ముందుకు పోవటం లేదు, నిదానంగా అడుగులు వేస్తున్నది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల చెలగాటం మనవంటి తృతీయ ప్రపంచ సమాజాలకు ప్రాణసంకటంగా మారుతోంది.

> ఐరోపాలోని అగ్రరాజ్యాలకు రష్యా బలహీనం కావటం అవసరం. అందుకే ఈ సంక్షోభం ఇప్పట్లో ముగిసేది కాదని భావిస్తున్నారు. నాటో కూటమి దేశాల ఉద్దేశ్యాలను గ్రహించి కావచ్చు, తొలి రోజుల మాదిరి రష్యా ఇప్పుడు దూకుడుగా ముందుకు పోవటం లేదు, నిదానంగా అడుగులు వేస్తున్నది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల చెలగాటం మనవంటి తృతీయ ప్రపంచ సమాజాలకు ప్రాణసంకటంగా మారుతోంది.

ధ్యేయపు దారి పట్టుకు వెళితే, గమ్యం కాదా మధుశాల



డాక్టర్ దేవరాజు మహారాజు

భావుకత ఒక ద్రాక్షలత, లాగు కల్పనల తీగజత
కవియే సాకీ యై వచ్చాడు నింపుకుని కవితా మధు పాత్ర
ఇసుమంతైనా ఖాళీ అవదు లక్షతాగినా లక్ష ఆగినా
పాఠక జనమే తాగేవారు, పుస్తకమే నా మధుశాల.

అని చెప్పుకున్నవాడు ప్రసిద్ధ హిందీకవి పద్మభూషణ్ డాక్టర్ హరివంశ్ రాయ్ బచ్చన్. ఒక లోతైన తాత్విక చింతనతో, నిగూఢమైన భావావేశంతో జలపాతంలా సాగిపోయిన హరివంశ్‌రాయ్ కావ్యం 'మధుశాల' నన్ను ఆకట్టుకుంది. దాన్ని ఎలాగైనా తెలుగు పాఠకులకు అందించాలని తహతహలాడాను. కానీ, నేనేమో భాషా పండితుణ్ణి కాదు. హిందీమూలంలో ఉన్న ఆ లయలు, హొయలు తెలుగులోకి తెచ్చేదెట్టా? అదే భావాన్ని తెలుగు వచన కవిత్వంలోకి మారిస్తే బావుండదు. తేలిపోతుంది. మరి ఎలా? ఎలా అని కూర్చుంటే లాభం లేదు. శ్రమించాల్సిందే. సాధించాల్సిందేనని కొన్ని నెలలపాటు నేను మధుశాల వెంటపడ్డాను. ఇకనేం, ఆతర్వాత అదే నా వెంటపడుతూ ఇదిగో ఇలా వచ్చింది.

కోరుకున్న మధువేదైతే ఉందో అంద లేదు నాకిప్పటికి
కోరుకున్న మధుపాత్రా అంతే, అందదు కద నాకెప్పటికి
వెర్రివాడి వలె వెంట పడితినా? అయినా అందదు ఆసాకీ
పిచ్చివాడి వలె ఎంత తిరిగినా అందదు అందని మధుశాల.

లోగడ నూటయాభై మంది భారతీయ భాషల కవుల్ని 'కవితా భారతి' ద్వారా తెలుగు సాహిత్యలోకానికి అందించిన తర్వాత, నేను ఒకటిన్నర దశాబ్ద కాలంగా కవిత్వానువాదాల వైపు దృష్టి మరల్చలేదు. ఆ సమయంలో యాదృచ్ఛికంగా 'మధుశాల' నన్నాకర్షించింది. మధువు ఇతివృత్తంగా గొప్ప కవిత్వం పండించిన హరివంశ్ రాయ్ తాగుడుకు అలవాటు పడలేదు. అంతేకాదు, ఆయనకు మధువు రుచికూడా తెలియదన్న విషయం తెలుసుకున్నాక, ఆయనపై ఒక గౌరవభావం కలిగింది. అందుకే తెలుగు అనువాదానికి పూనుకున్నాను. మూలకవితలోని భావం, లయ, ప్రవాహగుణం ఏ మాత్రం పోకుండా తెలుగు చేయగలిగాను. ఈమాట నాకు నేను చెప్పుకుంటున్నది కాదు, నా సహ రచయితలెంతో మంది పరిశీలించి చెప్పినమాట.

ఉత్తరభారత దేశమంతా హరివంశ్ రాయ్ శతజయంతి ఉత్సవాలు 2007లో ఘనంగా జరిగాయి. ఆయన్ను, ఆయన కావ్యాన్ని తెలుగు సాహితీ జగతికి పరిచయం చేయాలని చేసిన చిన్న ప్రయత్నం ఇది. మధుశాల -అంటే ఇక్కడ కేవలం మధుశాల కాదు. ఒక ధ్యేయానికి, ఒక గమ్యానికి అది సంకేతం! ధ్యేయాన్ని బట్టి ఒక్కొకరి మధుశాల ఒక్కోరకంగా మారుతూ ఉంటుంది.

నీ హృదయపు లోతెందుందో
మధుపాత్రలో లోతంతుంటుంది.
నీ మనసున మత్తెంతుందో
మధువున మత్తంతుంటుంది.
నీ భావుకత అందం ఎంతో సాకీ
అంతటి సుందరము
ఎప్పుడెంతటి రసికుడు అయితే,
అంతటి రసమయము మధుశాల.

డాక్టర్ హరివంశ్ రాయ్ బచ్చన్ 1907 - 2003 మధ్యకాలంలో 36 ఏండ్లపాటు జీవించాడు. 30 కవితా సంపుటాలు ప్రచురించాడు. మరో 50 ఇతర గ్రంథాలు రాశాడు. ఆయన ఆత్మకథ నాలుగు సంపుటాలుగా వెలువడింది. 1935లో ప్రకటించిన 'మధుశాల' ఆయనకు జగద్విఖ్యాతిని తెచ్చిపెట్టింది. ఆ తరువాత ఆయన 'మధుబాల' 'మధు కలష్' కావ్యాలు కూడా ప్రకటించాడు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుండి ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ సాధించిన మొదటి భారతీయుడీయన. నాటి భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ప్రేమ పాత్రుడయ్యాడు. అంతే - లెక్చరర్‌గా, ఆకాశవాణి ప్రోగ్రాం ప్రొడ్యూసర్ ఉన్నవాడల్లా నేరుగా భారత విదేశాంగ శాఖలో ఉన్నత పదవికి ఎంపికయ్యాడు. అక్కడి నుండి ఆయన ఉద్యోగిగా, కవిగా మళ్లీ వెనకి తిరిగి చూడలేదు. హిందీ మనరాష్ట్ర భాష కావడానికి ముఖ్యమైన భూమికను పోషించాడు. హిందీ సాహిత్యరంగంలో 'హాలా వాదాన్ని' (మధువాదాన్ని) ప్రతిపాదించి, పోషించినవాడిగా పేరు గడించాడు.


హిందూ ముస్లిం వేరైనా మధుపాత్ర ఒక్కటే తాగేది
మధువూ ఒకటే సాకీ 'ఒకటే' మధుశాల ఒకటే
వెళ్లేది
మందిరమైనా మజ్జీదైనా వెళ్లేవరకూ ఇద్దరు-ఒకటే
విడగొట్టేవే మందిర్ మజ్జిద్, మనసులు కలిపేదే
మధుశాల.

'హాలా - అంటే మధువు. మనిషి తనకు కావల్సిన దాన్ని వెతుక్కోవడంలోనే ఆనందం పొందుతూ ఉంటాడు. 'మధువు' అంటే మధువే కానక్కర్లేదన్నది ఆయన చెప్పే అంతరార్థం. ఉమర్ ఖయ్యాం, గాలిబ్, జఫర్, మీర్, కులీ,వలీ వంటి ఉరుదూ మహాకవుల అడుగు జాడల్లో, వారి బాణీలో మధువు - మధుపాత్ర - సాకీ- మధుశాల వంటి పదాలనే వాడుతూ - వారికి భిన్నంగా సమకాలీన జీవితం, తాత్వికత, దేశభక్తి, మత సామరస్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక విషయాలపై ఆయన కవితలల్లారు. ఉదాహరణకు ఈ కింది కవితా చరణాలు గమనించండి. విషయం అర్థమవుతుంది.

హిమశ్రేణులే ద్రాక్షాలతలు
హిమజలమే ప్రవహించే మధువు
నదులన్నీ సాకీ హొయలవగా
కెరటాలే మధుపాత్రలు కాగా
తాగిన మత్తులో పచ్చగ
ఊగెను పంట పొలాలు కాలం
గతిలో
ప్రపంచానికిది ఆదర్శం
వ్యవసాయ భారతం మధుశాల.
ధీరపుత్రుల హృదయ
రుధిరమే అయినది నేడు రక్తపు
మధువు
దేశభక్తుల ఆశీస్సుల
మధుపాత్ర తీసుకుని ముందుకు
నడువు
అతి ఉదారము గుణము
భారతిది, త్యాగశీలి సాకీ
బలికోరే స్వాతంత్ర్యమే కాళిక
- ఇక బలి వేదిక మధుశాల

- ఇలా విషయమేదైనా దాన్ని మధుశాల పరిధిలోకి లాగి, అత్యద్భుతమైన పద చిత్రాలతో రక్తి కట్టించడం - హరి వంశ్ రాయ్ సాధించగలిగాడు.

> హరివంశ్ రాయ్ తన యాభైయేండ్ల సాహిత్య జీవితంలో కొన్ని ముఖ్యమైన అనువాదాలు కూడా చేశారు. ఉమర్ ఖయ్యాం, వై.బి.ఈట్స్‌లను హిందీలోకి అనువదించాడు. 'నెహ్రూ-రాజనైతిక్ జీవన్‌చిత్ర్' (1961) అనేది చెప్పుకోదగ్గ రచన. సుమిత్రానందన్ పంత్‌పై రెండు పుస్తకాలు ప్రకటించాడు. 'అర్‌వీ దశక్కీ ప్రతినిధి శ్రేష్ఠ కవితాయే' (1982) శీర్షికతో ఆనాటి యువతీయువకుల కవితల్ని సంపుటీకరించాడు. తన ప్రవాస జీవిత విశేషాల్ని 'ప్రవాస్ కి డైరీ' శీర్షికతో ప్రకటించారు. హిందీ సాహిత్యరంగంలో ఆయన చేసిన కృషికి సాహిత్య అకాడెమీ అవార్డు, సోవియట్ ల్యాండ్ అవార్డు, ఆఫ్రో ఏసియన్ రచయితల సమాఖ్యవారి లోటస్ అవార్డు, సరస్వతి సమ్మాన్ వంటి అత్యున్నత పురస్కారాలు స్వీకరించిన హరివంశ్ రాయ్‌కి 1976లో భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' ప్రకటించి గౌరవించింది.



ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. 'బచ్చన్' వారి ఇంటి పేరు కాదు. వారి ఇంటి పేరు శ్రీవాత్సవ. హరివంశ్ రాయ్‌ని బాల్యంలో ముద్దుగా అందరూ 'బచ్చన్' అని పిలిచేవారు. బచ్చన్- అంటే చంటిపిల్లవాడు, పసివాడు, కుర్రాడు అని అర్థం. కేంబ్రిడ్జి నుండి తిరిగి వచ్చాక ఉద్యోగంలో హిందీలో కవిత్వం రాస్తున్నప్పుడు ఆయన సరదాగా ఆ చిన్నప్పటి ముద్దుపేరు తగిలించుకున్నాడు. హరివంశ్ రాయ్ బచ్చన్‌గా ప్రసిద్ధుడయ్యాడు. ప్రసిద్ధి పొందిన ఆ పేరును వదులుకోవడం ఇష్టంలేక, కొడుకు, మనవడు అందరూ బచ్చన్ పేరే కొనసాగిస్తున్నారు. కుటుంబమే బచ్చన్ కుటుంబం ఐ పోయింది. అసలైన ఇంటిపేరు శ్రీవాత్సవ మరుగున పడింది. విశ్వమానవ కుటుంబాన్ని ఆయన ఇలా ఒకచోట నమోదు చేశాడు.

మనమవుదాం ఇక పరస్పరం, ఒకరికి ఒకరం మధుశాల
ధ్యేయపు దారి పట్టుకు వెళితే గమ్యం కాదా మధుశాల?
కళ్లకు కనబడునది ఏదైనా, ఇక కళ్లలో ఉన్నది మధుశాల
అంతట కనబడు అన్ని వేళలా - విశ్వవ్యాప్తమిది
మధుశాల!

హరివంశ్ రాయ్ బచ్చన్ నవంబర్ 27, 1907న అలహాబాదు దగ్గర్లోని ఒక చిన్న గ్రామంలో పుట్టాడు. వారిది ఒక సాధారణ మధ్య తరగతి కుటుంబం. వారి వంశంలో కొనసాగుతూ వస్తున్న ఆచారం ప్రకారం కాయస్థ పాఠశాలలో ఉరుదూ చదువుకుని, 1925లో మెట్రిక్యులేషన్, 1929లో ప్రథమశ్రేణిలో బి.ఏ(అలహాబాదు విశ్వ విద్యాలయం) తర్వాత బి.టి, మరికొంత కాలానికి బనారస్ విశ్వావిద్యాలయం నుండి యం.ఎ. పూర్తిచేశాడు. మధ్య కాలంలో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఆ సమయంలోనే గాంధీజీ అనుచరుడిగా మారి, దేశ స్వాతంత్రోద్యమంలోకి దూకాడు. 1941-52 మధ్య కాలంలో అలహాబాదు యూనివర్సిటీలో ఇంగ్లీషు బోధించాడు. తర్వాత రెండేండ్లు కేంబ్రిడ్జిలోని సెంట్ కేథరిన్ కాలేజిలోని థామస్ రైస్ హెన్ దగ్గర చేరి, ఐరిష్ కవి వై.బి. ఈట్స్ పై పరిశోధన సాగించి, డాక్టరేట్ సాధించి, స్వదేశం తిరిగి వచ్చాడు. ఆ తర్వాత వరుసగా మధుశాల, మధుబాల, మధుకలష్ సంపుటాలు - నిషా నిమంత్రణ్, ఏకాంత సంగీత్, అకుల్ అంతర్, సారంగిని, హాలాహల్, బెంగాల్ క కావ్య్, ఖాదీ కె ఫూల్, సూత్‌కి మాలా, మిలన్ యామిని, ప్రణయ పత్రిక, ధార్ కి ఇధర్- ఉధర్, ఆర్తీ అవుర్ అంగారే, బుద్ధఅవుర్ నాచ్‌ఘర్, త్రిభంగిమీ - వంటి కవితా సంపుటాలు 1932-1961 మధ్యకాలంలో ప్రకటించాడు.

నిజానికి హరివంశ్‌రాయ్ సాహిత్యరంగ ప్రవేశం 1930లో కథారచనతో ప్రారంభమైంది. మూడు నాలు గేండ్లు కథలు రాశాడు. మొదటి కథా సంపుటి రాత ప్రతిని హిందుస్థానీ అకాడెమీ'కి పంపాడు. కానీ, వారు దాన్ని తిరుగు టపాలో తిప్పిపంపారు. ఉక్రోషంతో ఆయన రాతప్రతిని చెత్తబుట్టకు సమర్పించి, కథారచనకు స్వస్తి చెప్పాడు. తర్వాత కవితా ప్రక్రియలో కృషి ప్రారంభించి జనవరి 1932లో 'తేరా హార్' తొలి కవితా సంపుటి ప్రకటించాడు. క్యా భూలూ (క్యాయాద్ కరూ' 'నీడ్ క నిర్మాణ్ ' 'ఫిర్ బసేరేసే దూర్' 'దశ్ ద్వార్ సే సోపాన్ తక్' అనే శీర్షికలతో ఆత్మకథ నాలుగు సంపుటాలలో వెలువరించాడు. ఈ నాలుగింటి సారాంశం క్లుప్తంగా IN THE AFTER NOON OF TIME శీర్షికతో ఇంగ్లీషులో వెలువడింది. దానికే ఆయనకు సరస్వతీ సమ్మాన్ (1991) లభించింది.

హరివంశ్ రాయ్ తన యాభైయేండ్ల సాహిత్య జీవితంలో కొన్ని ముఖ్యమైన అనువాదాలు కూడా చేశారు. ఉమర్ ఖయ్యాం, వై.బి.ఈట్స్‌లను హిందీలోకి అనువదించాడు. 'నెహ్రూ-రాజనైతిక్ జీవన్‌చిత్ర్' (1961) అనేది చెప్పుకోదగ్గ రచన. సుమిత్రానందన్ పంత్‌పై రెండు పుస్తకాలు ప్రకటించాడు. 'అర్‌వీ దశక్కీ ప్రతినిధి శ్రేష్ఠ కవితాయే' (1982) శీర్షికతో ఆనాటి యువతీయువకుల కవితల్ని సంపుటీకరించాడు. తన ప్రవాస జీవిత విశేషాల్ని 'ప్రవాస్ కి డైరీ' శీర్షికతో ప్రకటించారు. హిందీ సాహిత్యరంగంలో ఆయన చేసిన కృషికి సాహిత్య అకాడెమీ అవార్డు, సోవియట్ ల్యాండ్ అవార్డు, ఆఫ్రో ఏసియన్ రచయితల సమాఖ్యవారి లోటస్ అవార్డు, సరస్వతి సమ్మాన్ వంటి అత్యున్నత పురస్కారాలు స్వీకరించిన హరివంశ్ రాయ్‌కి 1976లో భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' ప్రకటించి గౌరవించింది. 1966లో రాజ్యసభకు నామినేట్ అయ్యాడు. 2003లో భారత తపాలా శాఖ పోస్టల్ స్టాంపు విడుదల చేసింది. "నా కవిత్వం మోహంతో మొదలై, మోహ బంధంతో ముగిసింది" - అని హరివంశ్‌రాయ్ తన ఆత్మకథలో చెప్పుకున్నాడు. 19వ యేట 14 ఏండ్ల శ్యామను పెండ్లాడితే ఆమె టి.బితో బాధపడి చనిపోయింది. అందువల్ల, 14 ఏండ్ల తర్వాత 1941లో తేజి సూరి అనే సిక్కు యువతిని పెండ్లి చేసుకున్నాడు. ఇప్పుడున్న బచ్చన్‌లు ఆమె సంతానమే.

ఒకసారి హరివంశ్‌రాయ్ గాంధీజీని కలవడానికి వెళ్లాడు. "మధువు -సారాయిపై కవిత్వం రాసే కవిని తాను కలుసుకోదలుచుకోలేదని" - అన్నారాయన. మధ్యలో ఒకరు కల్పించుకుని 'ఆయన ఏ సారాయి (మధువు) గురించైతే చెపుతున్నారో అది సారాయి కాదు- ప్రేమకు, ఆధ్యాత్మికతకు, జీవనగమ్యానికి సంబంధించిన సంకేతమని' వివరించి చెప్పాడు. అది తెలుసుకుని గాంధీజీ సంతోషించి హరివంశ్‌రాయ్‌ని లోపలికి పిలిచాడు.

పూజారే మన ప్రియతమ సాకీ, పవిత్ర గంగా జలమే మధువు
తపోనిష్ఠలో తిప్పుతు ఉండే జపమాలే మధు పాత్రల మాల
ఇంకా తాగు, ఇంకా తాగు అన్నదె మంత్రోచ్చారణ కాగా
శివలింగం వలె శిలనౌతాలే మందిరమైనా, మధుశాలైనా

(18 జనవరి, హరివంశ్ రాయ్ వర్థంతి)

- కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

మార్క్సిస్టు మహానేత.. కామ్రేడ్ జ్యోతిబసు

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు ప్రధాని కాగల అవకాశం లభించినా, పార్టీ ఆదేశానికి కంకణ బద్ధుడై, పీఎం అయ్యే అవకాశాన్ని వదులుకున్న సుశిక్షిత సైనికుడు, మార్క్సిస్టు మహానేత, ఇరవై మూడేండ్లకు పైగా ముఖ్యమంత్రిగా సేవలందించి The Longest Chief Minister of West Bengalగా పేరుగాంచిన కామ్రేడ్ జ్యోతిబసు పదిహేనవ వర్ధంతి నేడు. ఈ సందర్భంగా ఆయన జీవితంలోని కొన్ని ముఖ్యమైన విషయాల్ని స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నది.

జ్యోతిబసు 1914 జులై 8న కలకత్తాలోని బెంగాలీ కుటుంబమైన నిశికాంత్ బసు, హేమలతదేవి దంపతులకు జన్మించారు. తండ్రి ప్రముఖ వైద్యుడు. తల్లి గృహిణి. వీరి పూర్వీకులు బంగ్లాదేశ్ ఢాకాలోని బర్దికి చెందినవారు. జ్యోతిబసు ప్రాథమిక విద్యాభ్యాసం కలకత్తాలోని సెయింట్ జేవియర్స్ స్కూల్‌లోనూ, కాలేజీ విద్యాభ్యాసం ప్రెడిడెన్సీలోనూ కొనసాగింది. అక్కడే పట్టభద్రుడయ్యారు. 1935లో ఇంగ్లాండ్ వెళ్లి యూనివర్సిటీ ఆఫ్ కాలేజ్ లండన్‌లో న్యాయశాస్త్రం చదివాడు. 1940లో మిడిల్‌టెంపుల్‌లో బారిస్టరయ్యాడు. లండన్‌లో చదువుకుంటున్న రోజుల్లోనే ఆయన మీద రాజకీయ సిద్ధాంతకర్త, లెక్చరర్ అయిన హెరాల్డ్ లస్కి ప్రభావం తీవ్రంగా పడింది. దాంతో ఆయనలో కమ్యూనిజం భావాలకు ఆలోచనల్లో బీజాలు పడ్డాయి. దీంతో లండన్ నుండి 1940లో ఇండియాకు తిరిగిరాగానే భారత కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్తగా చేరారు. బ్రిటీష్ వలసరాజ్యాల శకం ముగిసే సమయానికి రైల్వే కార్మికుల ఉద్యమంలో బసుది కీలకపాత్ర. తేబాగ పోరాటంలోనూ పాల్గొన్నారు. అయితే 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ చీలి సీపీఐ(ఎం)గా ఆవిర్భవించింది. ఆ పార్టీ వ్యవస్థాపకు(నవరత్నాలు)ల్లో కామ్రేడ్ జ్యోతిబసు కూడా ఒకరు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా 1964 నుండి 2008 వరకు ఉక్కు క్రమశిక్షణతో నిలబడ్డారు. ప్రజల మన్ననలు పొందిన సీపీఐ(ఎం) అభ్యర్థిగా పశ్చిమబెంగాల్ శాసనసభకు ఎన్నికవ్వడమే గాక 1967, 1969 సంవత్సరాల్లో అజయ్ ముఖోపాధ్యాయ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగానూ పనిచేశారు. ఆ తర్వాత 1977 జూన్ 21 నుండి 2000 నవంబర్ 6 వరకు 23 సంవత్సరాలకు పైగా పశ్చిమ బెంగాల్‌కు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అత్యధిక కాలం పనిచేసిన సీఎంగా దేశంలో చరిత్ర సృష్టించారు.



ముఖ్యమంత్రిగా జ్యోతిబసు రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. అందులో, పేద రైతులకు భూముల పంపకం, పల్లె ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి, గ్రామగ్రామాన నిరక్షరాస్య నిర్మూలన కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా అమలు చేశారు. ముఖ్య ంగా రాష్ట్రంలో మత సామరస్యాన్ని సాధించారు. సిద్ధాంత రీత్యా జ్యోతిబసు నాస్తికుడైనప్పటికీ ఆస్తికులను కూడా గౌరవించేవారు. సేవామూర్తి మదర్ థెరిసా అంటే ఆయనకు ఎనలేని గౌరవం. ఓ సారి "మీరు కమ్యూనిస్టు - దేవుణ్ణి నమ్మరు. మరి మదర్ థెరిసా ఒక కాథెలిక్, ఆమెకు దేవుడంటే అచంచెలమైన విశ్వాసం. అటువంటప్పుడు మీరిద్దరూ పరస్పర గౌరవాన్ని ఎలా సాధించగలిగారు?" అని మదర్‌థెరిసా గ్రంథకర్త నవీన్ బి.చావ్లా జ్యోతిబసును ప్రశ్నించారట. దీంతో ఆయన చిరునవ్వుతో 'అవును- మా ఇద్దరివి విభిన్న ధృవాలే. అయితేనేమి? నేను పేదలను ప్రేమించి, వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తాను. ఆమె కూడా పేదలను ప్రేమిస్తూ వారికోసం నిరంతరం శ్రమిస్తుంది.మా ఇద్దరిలోనున్న ఈ సారూప్యత వల్లనే మాకు పరస్పర గౌరవం ఏర్పడింది" అంటూ చెప్పారట. ఇది నిజంగా ఎంతో ఆదర్శమైన సాన్నిహిత్యం. అంతేకాదు, ఒకానొక సందర్భంలో మదర్‌థెరిసాకు ముఖ్యమంత్రి జ్యోతిబసును అత్యవసరంగా కలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఆ సమయంలో ఆయన కేబినేట్ మీటింగ్‌లో ఉన్నారు. మదర్ ఆయన కోసం వేచి చూస్తున్నదని తెలియగానే జ్యోతిబసు మీటింగ్ నుండి బయటకొచ్చి ఆమెను కలిశారు. ఇది, కమ్యూనిస్టు ప్రభుత్వాలకు, 'కార్పొరేట్' సర్కార్లకు మధ్య ఉన్న తేడా.

సుమారు ఏడు దశాబ్దాలు పేదల అభ్యున్నతికై రాజకీయ రంగస్థలం మీద నిరంతరం శ్రమించిన జ్యోతిబసు తన 96 ఏండ్ల వయ సులో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆయన్ను కలకత్తా సాల్ట్-లేక్ ప్రాంతం ఏఎంఆర్ఐ హాస్పిటల్‌లో చేర్పించగా వైద్యులు పరిశీలించి న్యుమోనియాగా నిర్ధారించారు. పదిహేడు రోజులు మృత్యువుతో పోరాడినన ఆయన 2010 జనవరి 17న తుదిశ్వాస విడిచారు. అంతకు ముందే తన కండ్లను, శరీరాన్ని కలకత్తాలోని ప్రభుత్వ వైద్యశాల ఎస్‌ఎస్‌కెఎంకు పరిశోధన నిమిత్తం దానం చేశారు. జ్యోతిబసు అంతిమయాత్ర మిలిటరీ, రాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో గౌరవంగా నిర్వహించారు. కలకత్తా సాయుధ పోలీస్ దళం 21గన్ సెల్యూట్‌తో గౌరవ వందనం చేసింది. అంతేకాదు, ఆయన అంతిమయాత్ర వేలాది మంది అశ్రునయనాల మధ్య సాగింది. పార్టీలతో నిమిత్తం లేకుండా అందరూ ఆయన భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించడం జ్యోతిబసుపై గౌరవభావాన్ని రెట్టింపు చేశాయి. జ్యోతిబసు మరణంతో సీపీఐ(ఎం) ఒక గొప్ప నాయకుడిని కోల్పోయింది. అంతేకాదు, దేశం కూడా ఒక గొప్ప దార్శనిక నేతను కోల్పోయింది. ఆ సమయంలో భారత ప్రజలతో పాటు యావత్ ప్రపంచ శ్రామికవర్గం బరువెక్కిన గుండెతో జ్యోతిబసుకు జోహార్లు అర్పించింది. పేద ప్రజలకోసం జ్యోతిబసు చేసిన కృషిని కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి.

(నేడు కామ్రేడ్ జ్యోతిబసు వర్థంతి)

- బసవరాజు నరేందర్‌రావు, 99085 16549

ఈ తెలివి మనకెందుకు లేకపోయింది?!




సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490 20 4545

జర్మనీలో ఫిబ్రవరి 23న జరగనున్న ఆకస్మిక ఎన్నికల్లో ఛాన్సలర్ అభ్యర్థిగా తీవ్ర మతవాద జర్మనీ ప్రత్యామ్నాయపార్టీ ఎ.ఎఫ్.డి. నాయకురాలు ఆలిస్ వీడల్‌ను ఎన్నుకోడానికి జర్మనీ పట్టణం రీసాలో ఈ నెల 11న ఎ.ఎఫ్.డి. కీలక సమావేశం ఏర్పాటు చేసింది. తూర్పు జర్మనీ రాష్ట్రం సాక్సనిలోని రీసా ఎ.ఎఫ్.డి.కి బలమైన కేంద్రం. నాజీలకు చావులేదని నినదిస్తూ పన్నెండు వేల నిరసనకారులు రీసా చేరారు. రీసాదారులన్నిటిని ఉదయాన్నే అడ్డగించారు. మిరియాల పొడితో ప్రదర్శనకారులను చెదర గొట్టడానికి పోలీసులకు రెండుగంటలు పట్టింది. బహిష్కరణకు, దాడికి గురికాకుండా జీవించే హక్కు కోసం నిరసిస్తున్నామని, ఫాసిజానికి రీసా శాంతి స్థలం కాదని స్పష్టం చేశామని ప్రదర్శనకారుల ప్రతినిధి మరియ ష్మిత్ అన్నారు. ఆరువందల ప్రతినిధుల ఎ.ఎఫ్.డి.సభ ఆలస్యంగా మొదలైంది.వామపక్షాన్ని ధిక్కరించినం దుకు పార్టీ సభ్యులను వీడల్ అభినందించారు. ప్రజాస్వామ్య వ్యతిరేకులుగా, తీవ్రవాదులుగా ప్రవర్తించారని మరొక నాయకులు టినొ క్రుపల్ల ప్రదర్శనకారులను నిందించారు.విదేశీ వలసదార్లను దేశం నుండి బహిష్కరించాలని రెండు రోజుల ఎ.ఎఫ్.డి. సభ తీర్మానించింది. పార్టీ యువ విభాగం 'జుంజే ప్రత్యామ్నాయం' ఉగ్రవాద సంస్థగా మారిందని పార్టీ నిఘా విభాగం ఇచ్చిన సమాచారం ఆధారంగా దాని నాయకత్వాన్ని మార్చాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. ఇది తీవ్ర వివాదానికి దారితీసింది.యూరప్ యూనియన్ కరెన్సి యూరోను వదిలేయాలని, జర్మని అణుశక్తి దేశంగా పున: ప్రవేశించాలని ముసాయిదా ప్రణాళిక పేర్కొంది.

ఎన్నికల్లో వీడల్నెగ్గే అవకాశం లేదని అమెరికా వాణిజ్య శతకోటీశ్వరుడు ఎలాన్ మస్క్ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.ఇరవై శాతం ఓట్లతో ఎ.ఎఫ్.డి. రెండో స్థానం పొందగలదని ఎన్నికల అంచనాలు తెలిపాయి. ఎ.ఎఫ్.డి.తో కలవడానికి ఇతర పార్టీలు తిరస్కరించాయి.సంప్రదాయవాద ప్రతిపక్ష కూటమి నాయకుడు ఫ్రెడరిక్ మెర్జ్ 30% ఓట్లతో ఛాన్సలర్ అవచ్చు. మధ్యేవాద-వామపక్ష కూటమి మాజీ ఛాన్సలర్ ఓలఫ్ స్కోల్జ్ విధానాలకు ప్రాథమికంగా మారుస్తానని మెర్జ్ ప్రకటించారు. ఆర్థికవ్యవస్థను పునరుద్ధరించే పద్ధతుల్లో తలెత్తిన విభేదాలతో స్కోల్జ్ ఆర్థిక మంత్రిని తొలగించారు. తర్వాత ఘటనలతో 2023 నవంబర్‌లో స్కోల్జ్ ప్రభుత్వం పడిపోయింది. ముందస్తు ఎన్నికలకు దారితీసింది. తప్పులు జరిగాయని, అయితే ఇది భవిష్యత్దర్శన సమయమని జనవరి 11న బెర్లిన్‌లో తనను ఛాన్సలర్ అభ్యర్థిగా ఎన్నుకున్న ప్రతినిధుల సభలో స్కోల్జ్ ఒప్పుకున్నారు.పోరాడుదామని నినదించారు.

12 సెప్టెంబర్ 2013న బీజేపీ సమావేశంలో మోడీని 2014 సాధారణ ఎన్నికల ప్రధాని అభ్యర్థిగా నిర్ణయించారు. సొంత స్వయం … సేవకులు, మోడీ ఉన్నతికి కారకులైన అద్వానీ, మురళిమనోహర్ జోషి వగైరాలు ఆ నిర్ణయాన్ని విభేదించారు. అందుకు వాళ్లనుపక్కకు నెట్టారు. కాని ప్రజలు, మేధావులు, పౌర సంఘాలు, ప్రత్యామ్నాయ పక్షాలు మోడీ ప్రధాని అభ్యర్థిత్వాన్ని పట్టించుకోలేదు. వీడల్ నెగ్గే అవకాశం లేకున్నా జర్మన్లు ఆమె ఛాన్సలర్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. 2014లో బీజేపీ గెలిచే అవకాశాలెక్కువ. నాటి రాజకీయ శూన్యాన్ని మోడీ సులభంగా ఆక్రమించుకునే అవకాశం ఉండింది. పదేండ్ల మన్మోహన్‌సింఘ్ పాలనలో అనేక అవినీతి కుంభకోణాలు జరిగాయి. "ప్రధాని" మన్మోహన్ ఎన్నికల ప్రచారానికి పనికి రాలేదు.2014 ఎన్నికల్లో అవకాశవాద జిత్తుల బీజేపీ గెలుస్తుందని కాంగ్రెస్, ప్రతిపక్షాలు, మేధోపౌర సంఘాలు ఊహించలేకపోయాయా? బీజేపీ అభ్యర్థి మోడీ ప్రధాని అవుతారనుకోలేదా? గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీని గమనించలేదా?



గుజరాత్ అభివృద్ధి నమూనాను నమ్మారా?

పార్టీలో విభేదాలు సృష్టిస్తున్నారని గతంలో సంఘ్ మోడీని గుజరాత్ నుంచి బహిష్కరించింది. మోడీ ఢిల్లీకి మారారు. అరుణ్ జైట్లీ ఇంట్లో మకాం పెట్టారు. జాతీయ నాయకులతో పరిచయాలు పెంచుకున్నారు.మోడీని భరించలేని జైట్లీ విశ్వ హిందూ పరిషత్ సాయంతో ఆయన్ను అమెరికా పంపారు. అక్కడి నుంచి రప్పించి మోడీ ఎత్తులకు లొంగి శాసన సభ్యుడు కాని ఆయన్ను ప్రధాని వాజ్‌పేయి గుజరాత్ ముఖ్యమంత్రిని చేశారు.తన మోద్ ఘంచి వైశ్య ఉపకులాన్ని మోడీ బీసీగా మార్పించుకున్నారు. గోద్రా మారణహోమంతో "ఇతరుల" ధన మాన ప్రాణాలను బలిపెట్టి పదవిని స్థిరపరుచుకున్నారు. మోడీకి అమిత్‌షా కలిశారు. తమ అరాచకాల సాక్షులైన అధికారులను జైళ్లకు పంపారు. తమ కేసుల్లో వాదిస్తున్న న్యాయవాదులను లోబర్చు కున్నారు. విచారిస్తున్న న్యాయమూర్తులను చంపించారు. రైతుల భూములను, ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టారు. కార్పొరేట్ల వినోద విశ్రాంత గృహాల్లో వారిని కూలీలను చేశారు. కార్పొరేట్ల లాభాల కోసం గిఫ్ట్ నగరం నిర్మించారు. ఉప్పు తయారీదారులైన ఎస్.టి. ముస్లిం అఘరియాలను హింసించి, వారిని ఓటుకు దూరం చేశారు.విద్యను ప్రయివేట్ టీకరించారు. కాషాయీ కరించారు. ఛాందసీకరించారు. అనేక ప్రత్యేక కేటాయింపులతో మద్య నిషేధాన్ని నీరుగార్చి మద్యపుటేరులు పారించారు. ముస్లింలను తరిమేశారు. ఉన్నవాళ్లను ప్రత్యేక ప్రాంతాల్లో బంధించారు. పాత్రికేయాన్ని పాతేశారు. న్యాయవ్యవస్థను జేబులో వేసుకున్నారు. గాంధీని కించపర్చారు. గాడ్సేకు గుడికట్టారు. ఏండ్లు దాటినా లోకాయత్‌ను నియమించలేదు. దాన్ని సమర్థించుకోడానికి కోర్టుల్లో కోట్ల రూపాయలు ఖర్చుచేశారు. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు లోకాయత్‌ను నియమించిన మహిళా గవర్నర్ కమల బేనివాల్‌ను మోడీ ప్రధాని అయిన తర్వాత సతాయించారు. ఇంటికి పంపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను లెక్కచేయలేదు. ఎస్సీ,ఎస్టీల పిల్లలు బడులకు పోకుండా నదులు, కాలువలపై వంతెనలు కట్టలేదు. అసౌకర్యాలను కొనసాగించారు. వారి తండ్రులు రోజుకొకరు పిల్లలను నదులు ఈది దాటించి బడులకు పంపేవారు. బాలికల కష్టాలను చూసిన తర్వాతి ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్ మాతృ హృదయం రోదించింది. భండారం బయటపడుతుందని ఆమెను ముఖ్యమంత్రి పదవి నుండి తప్పించారు. మోడీ, షాలు అబద్ధాల ప్రచారాలతో ఈ అస్తవ్యస్తతలను గుజరాత్ నమూనా ఘనతగా చాటారు.

ఇంతటి గుజరాత్ దుర్మార్గం ఢిల్లీ పీఠం ఎక్కుతూ ఉంటే పౌరులు, మేధావులు, రాజకీయులు నిశ్శబ్దంగా ఉన్నారు. అమానవీయ ఫాసిజాన్ని అనుభవించిన జర్మన్ల వారసులు తీవ్ర మతవాద ఫాసిస్టు ఎ.ఎఫ్.డి.అవకాశాన్ని నేడు నిరసించారు. 2013లోనే కాదు, నేటికీ మనకు ఈ తెలివిలేదు. అందుకే మోడీ కార్పొరేట్ ఫాసిజం కొనసాగుతోంది. భవిష్యత్తులో మనకు తెలివి వస్తుందని ఆశిద్దాం.

తెలంగాణలో లిక్కర్ స్కాం భాగస్వామిని ఓడించాం

అసలు భాగస్వామిని ఢిల్లీలో ఓడిస్తాం

మోడీ, కేజ్రీవాల్ పేర్లు వేరు.. చేతలు ఒక్కటే : సీఎం రేవంత్ రెడ్డి

ఢిల్లీ ఎన్నికలకు సంబంధించి గ్యారెంటీ పోస్టర్లను సీఎం విడుదల

ఢిల్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి, అధ్యక్షులతో కలిసి రేవంత్ మీడియా సమావేశం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో మద్యం కుంభకోణం భాగస్వామిని ఓడించామనీ, ఢిల్లీలో అసలు భాగస్వామిని ఓడించడానికి వచ్చినట్టు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవినీతిని నిర్మూలిస్తే హామీలు నెరవేర్చవచ్చని చెప్పారు. తెలంగాణలో తమ ప్రభుత్వం కేసీఆర్ అవినీతిని నిర్మూలించి.. వాగ్దానాలు అమలు చేస్తోందన్నారు. హస్తిన పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. గురువారం డీడీయూ మార్గ్‌లోని ఢిల్లీ స్టేట్ పార్టీ ఆఫీసులో ఢిల్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి నిజాముద్దీన్, పీసీసీ అధ్యక్షులు దేవేంద్ర యాదవ్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ తరఫున గ్యారెంటీల పోస్టర్లను సీఎం విడుదల చేశారు.

ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, సామాగ్రి కిట్ (5 కేజీల బియ్యం, 2 కేజీల పంచదార, 1 లీటర్ ఎడిబుల్ ఆయిల్, 6 కేజీల పప్పులు, 250 గ్రాముల టీ పొడి) ఇవ్వనున్నట్టు ప్రకటించారు. తాము ఎన్నికల కోసం రాజకీయాలు చేయడం లేదనీ, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని అన్నారు. తెలంగాణ ఇస్తామన్న హామీని అధినేత్రి సోనియాగాంధీ నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. అదే దిశలో, తెలంగాణలో ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు వాగ్దానాలు అమలు చేశామనీ, అందుకే ఇప్పుడు ఢిల్లీలో వాగ్దానాలు చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలో ఏడాదిలోనే 25 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ. 22 వేల కోట్ల రుణమాఫీ చేసినట్టు గుర్తు చేశారు.

స్వాతంత్ర్య భారత చరిత్రలో యూపీ వంటి పెద్ద రాష్ట్రాలు కూడా ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ చేయలేదన్నారు. 11 ఏండ్లలో ప్రధాని మోడీ కార్పొరేట్ కంపెనీలకు రూ.16 లక్షల కోట్ల అప్పులను మాఫీ చేశారన్నారు. ఆ డబ్బులు ఎవరివో ప్రధాని చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో అతి పెద్ద సమస్య నిరుద్యోగమనీ, ఆ సమస్యను ప్రధాని పరిష్కరించలేకపోయారని అన్నారు. కానీ, తెలంగాణలో ఏడాదిలోనే 53 వేల ఉద్యోగాలు ఇచ్చి, కాంగ్రెస్ ఆ సమస్యకు పరిష్కారం చూపిందన్నారు. అలాగే, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని చెప్పారు. దావోస్‌లో జరిగే సదస్సు నుంచి తెలంగాణకు రూ. లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు.

మోడీ, కేజ్రీవాల్ పేర్లు వేరు.. చేతలు ఒక్కటే

ఢిల్లీ సీఎంగా మూడు సార్లు గెలుపొందిన షీలా దీక్షిత్ మెట్రో రైల్, ఫ్లైఓవర్లు, అనేక అభివృద్ధి పనులు చేపట్టారని తెలంగాణ సీఎం గుర్తు చేశారు. కానీ, మూడు సార్లు ప్రధానిగా మోడీ, మూడు సార్లు ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ ఢిల్లీకి ఏం చేశారని ప్రశ్నించారు. మోడీ, కేజ్రీవాల్ పేర్లు వేరనీ, చేతలు మాత్రం ఒక్కటేనని విమర్శించారు. ఢిల్లీ వస్తే ఆరోగ్యం పాడవుతోందని తెలంగాణ నుంచి వచ్చిన వాళ్లు చెబుతున్నారని.. ఢిల్లీలో వాతావరణంతో పాటు రాజకీయ కాలుష్యం పెరిగిపోయిందన్నారు. కాంగ్రెస్ హామీలతో ఢిల్లీలో పేద ప్రజల స్థితిగతులు మెరుగవుతాయని భరోసానిచ్చారు. అందువల్ల, ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో 1.50 శాతం ఓట్లతో ప్రయాణాన్ని ప్రారంభించిన కాంగ్రెస్... 40 శాతం ఓట్లు సాధించి అధికారంలోకి వచ్చిందన్నారు. తమ పార్టీకి లోక్‌సభలో 100 మంది ఎంపీలు, రాజ్యసభలో కావాల్సిన బలం ఉందన్నారు. అవసరమైతే ఢిల్లీ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఇరు సభల్లో ఒత్తిడి తేగలదని గుర్తు చేశారు. మరి కేజ్రీవాల్ ఏం చేయగలరో ప్రజలకు చెప్పాలన్నారు.

తెలంగాణ కల సాకారంలో జైపాల్‌రెడ్డి పాత్ర చిరస్మరణీయం

సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రత్యేక తెలంగాణ కల సాకారంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి పాత్ర చిరస్మరణీయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్రపటానికి సీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. తుగ్లక్ రోడ్‌లోని సీఎం అధికారిక నివాసంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, బెల్లంపల్లి, పరిగి ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నేతలు రోహిన్ రెడ్డి, విద్యాసాగర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణలో సాధారణ పల్లె నుంచి ఢిల్లీ దాకా సాగిన జైపాల్ రెడ్డి ప్రస్థానంలో నైతిక విలువలకు కట్టుబడ్డారన్నారు. ఉమ్మడి ఏపీ శాసనసభలో, పార్లమెంట్ ఉభయ సభల్లో తెలంగాణ కోసం బలమైన గళం వినిపించారని సీఎం గుర్తు చేసుకున్నారు.

తెలంగాణ భవన్‌లో ఘనంగా జైపాల్ రెడ్డి జయంతి వేడుకలు

దేశ రాజధాని ఢిల్లీలో జైపాల్ రెడ్డి 83వ జయంతి వేడుకల్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో జైపాల్ రెడ్డి కీలక పాత్ర పోషించారని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోనూ తనదైన శైలిలో చక్రం తిప్పారని గుర్తు చేశారు. కేంద్రమంత్రిగా హైదరాబాద్ మెట్రో రైలుకు అనుమతులివ్వడం, నిధుల కేటాయింపులో ముఖ్య భూమిక పోషించారని అన్నారు.

డీసీఏ అనుమతి లేకుండా షెడ్యూల్ హెచ్, సైకియాట్రీ మందుల నిల్వ

వ్యసన నియంత్రణ కేంద్రంపై ఫిర్యాదు చేయనున్న టీజీఎంసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అనుమతి లేకుండా షెడ్యూల్ హెచ్, సైకియాట్రీ మందులను నిల్వ ఉంచుతున్న వ్యసన నియంత్రణ కేంద్రాల (డీ అడిక్షన్ సెంటర్ల)పై డ్రగ్ కంట్రోల్ అథారిటీకి ఫిర్యాదు చేస్తామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ హెచ్చరించింది. ఈ మేరకు కౌన్సిల్ పౌరసంబంధాల అధికారి డాక్టర్ నరేష్ కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. హన్మకొండలో హెల్పింగ్ హ్యాండ్స్ వ్యసన నియంత్రణ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. నకిలీ వైద్యులు పి.రాము 50 బెడ్లకు అనుమతి తీసుకుని 80 నుంచి 110 మందిని చేర్చుకున్నారనీ, వారిని కొడుతూ, స్క్రూ డ్రైవర్లతో పొడుస్తూ, సరైన ఆహారం అందించడం లేదని బాధితులు మొరపెట్టుకున్నారని చెప్పారు. బాధితుల తరపున హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఎన్జీఓపై జిల్లా కలెక్టర్, మానవ హక్కుల కమిషన్ , కేంద్ర సామజిక న్యాయం, అభివృద్ధి శాఖకి సైకియాట్రీ సొసైటీ ఫిర్యాదు చేస్తుందని చెప్పారు. డీ అడిక్షన్ థెరపీకి సంబంధించిన శిక్షణ తీసుకున్న రాము సైకియాట్రిస్ట్ సలహా లేకుండా షెడ్యూల్ హెచ్, ఇతర సైకియాట్రీ మందులను అధిక మోతాదులో ఇస్తూ, చట్ట విరుద్ధంగా వాటిని నిల్వ ఉంచి, బాధితులు వాటికి అలవాటు పడేలా చేస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులున్నాయంటూనే వాటిని చూపించకపోవడంతో సంబంధిత జిల్లా వైద్యాధికారులకు, పోలీసులకు టీజీఎంసీ ఫిర్యాదు చేసిందని తెలిపారు. నకిలీ వైద్యులు పి.రాము, హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ, డి అడిక్షన్ సెంటర్‌పై కేంద్ర సామాజిక న్యాయ, ఆదాయ పన్ను శాఖలకు బాధితుల తరపున సైకియాట్రీ సొసైటీ సభ్యులు డాక్టర్ మన్మోహన్ రాజు తెలిపారు. ఎన్ఎంసీ చట్టం 34, 54 ప్రకారం కేసు నమోదు చేయనున్నట్టు టీజీఎంసీ మెంబర్ డాక్టర్ శేషు మాధవ్ వెల్లడించారు.

కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి: టీజీజేఎల్ఏ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఇంటర్ బోర్డు ఎగ్జామినేషన్ కంట్రోలర్ జయప్రదభాయి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో టీజీజేఎల్ఏ-475 అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయప్రదభాయి మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని వార్షిక పరీక్షల చివరి వరకు పెంచాలని కోరారు. హాజరు శాతం పెరిగితేనే ఉత్తీర్ణత శాతం అధికమవుతుందని అభిప్రాయపడ్డారు. రాబోయే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలతో పాటు వార్షిక ఇంటర్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడానికి అధ్యాపకులందరూ సహకరించాలని కోరారు. రాబోవు ప్రాక్టికల్ ,వార్షిక పరీక్ష నిర్వహణలో తప్పనిసరిగా తమ వంతు సహకరిస్తామని టీజీజేఎల్ఏ-475 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, పూర్ణచందర్ ,మహిళా కార్యదర్శి సంగీత, షాహినా బేగం, రాష్ట్ర, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ ,కర్నె శ్రీనివాస్ ,ప్రవీణ్, వెంకటేశం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని ఓ రెస్టారెంట్‌లో గురువారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట సొసైటీకి చెందిన నాగం శ్రీనివాస్‌రెడ్డి కంచుకోట పేరుతో రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 3:30 గంటలకు రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు వెంటనే శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పారు. అతను అక్కడకు చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. తెల్లవారుజామున ప్రమాదం జరగడంతో ఎవరికీ ఏమీ కాలేదు. రెస్టారెంట్ ముందు పార్క్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు, ఫర్నీచర్, ఏసీలు, ఫ్రిజ్‌లు, 2 కంప్యూటర్లు, వంట సామాగ్రి కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగినట్టు ఫిర్యాదుదారుడు అనుమానిస్తున్నాడు.

అధికారులు స్వేచ్ఛగా పని చేయాలి

తప్పులు చేసి జైలు పాలు కావద్దు

ఫిబ్రవరి మొదటి వారంలో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్

గురుకులాలపై విష ప్రచారాన్ని తిప్పికొట్టండి : పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధికారులు, సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా స్వేచ్ఛగా పనిచేయాలనీ, తప్పులు చేసి జైలు పాలు కావద్దని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు శాఖకు వన్నె తెచ్చేలా పని చేసి, వాస్తవాలను నివేదించడం ద్వారా ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. మంత్రుల మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొద్దని వ్యాఖ్యానించారు. అధికారులు, అమాత్యులు వేర్వేరు కాదన్నారు. మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయొద్దని సూచించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగ్ బిల్లులు రూ. 300 కోట్లు విడుదల చేశామని చెప్పారు. ఫిబ్రవరి మొదటి వారంలో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వేసవి సన్నద్ధతలో భాగంగా గ్రామస్థాయిలో అన్ని నల్లా కనెక్షన్లను చెక్ చేయాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మల్టీపర్పస్ వర్కర్ల వేతన బకాయిలను సైతం విడుదల చేశామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి గర్భిణి, బాలింత, చిన్నారికి పోషకాహారం అందించాలని ఆదేశించారు. ఆ దిశలో జిల్లా సంక్షేమ అధికారులను సన్నద్ధం కావాలని చెప్పారు. దివ్యాంగుల పరికరాల కోసం తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.

సమీక్షలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, డైరెక్టర్ సృజన, టీజీఐఆర్డీ డైరెక్టర్ నిఖిల, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకులాలపై విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి

రాష్ట్రంలో కొంత మంది సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలపై చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఉద్యోగులకు సూచించారు. గురువారం సరూర్‌నగర్‌లోని సంక్షేమ గురుకుల లా కాలేజీలో జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కొందరు తామున్నప్పుడే గురుకులాలు గొప్పగా ఉన్నట్టు భ్రమలు కల్పిస్తున్నారనీ, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది విద్యార్థులేనని గుర్తు చేశారు. కొంత మంది ఉద్యోగులు చేసే తప్పుల వల్ల గురుకులాల్లో అక్కడక్కడా జరుగుతున్న కొన్ని సంఘటనలు మొత్తం వ్యవస్థ ఉనికినే ప్రశ్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నిబద్ధతతో పని చేసి సర్కార్ నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు.

అమానుష శ్రమ దోపిడీ

పనిగంటల పెంపు ప్రతిపాదనపై సిటూ

కార్మికుల రక్తాన్ని, స్వేదాన్ని పీల్చేస్తున్నారని మండిపాటు

తగ్గుతున్న వేతనాలు...పెరుగుతున్న కార్పొరేట్ లాభాలు

వారానికి ఐదు రోజులు, 35 గంటలే పని ఉండాలని డిమాండ్



న్యూఢిల్లీ : వారానికి 90 పనిగంటలు ఉండాలంటూ ఎల్ అండ్ టీ అధిపతి ఎస్ఎన్ సుబ్రమణ్యం చేసిన వ్యాఖ్య తీవ్ర దుమారాన్ని రేపుతోంది. ముఖ్యంగా పలు కార్మిక సంఘాలు ఆ వ్యాఖ్యలను ఖండించాయి. వారానికి 70 పనిగంటలు ఉండాలంటూ 2023లో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి చేసిన చేసిన ప్రతిపాదనకు కూడా ఇలాగే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఎల్ అండ్ టీ అధిపతి చేసిన తాజా వ్యాఖ్యపై సీఐటీయూ (సిటూ) మండిపడింది. కార్పొరేట్ శక్తులు పోటీ పడుతూ కార్మికుల రక్తాన్ని, స్వేదాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయని సిటూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్మికుల పనిగంటలను పెంచేందుకు మోడీ నేతృత్వంలోని మతతత్వ-కార్పొరేట్ ప్రభుత్వంతో బడా కార్పొరేట్ సంస్థల అధిపతులు చేయి కలిపారని సిటూ ఆరోపించింది. వారానికి ఐదు రోజుల పనిదినాలు, 35 పనిగంటలు మాత్రమే ఉండాలని డిమాండ్ చేసింది. ఇప్పటికే పెంచిన పనిగంటలు కార్మికుల ఆరోగ్యం, సామాజిక జీవనంపై ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. 'ఇంత జరుగుతున్నా అమానుషమైన పని పరిస్థితులతో ఉద్యోగాలలో కోత పెట్టేందుకు, కార్మిక ఖర్చులను తగ్గించుకునేందుకు కార్పొరేట్ వర్గం పైశాచిక కసరత్తు జరుపుతోంది. తమ లాభాల కోసం ఖర్చులు తగ్గించుకోవాలని అనుకుంటోంది. సమర్థత-ఉత్పాదకత ముసుగులో కార్మికుల శ్రమను మరింతగా దోచుకోవాలని చూస్తోంది. వీరి ప్రయత్నాల కారణంగా 2022లో 11,486 ఆత్మహత్యలు జరిగాయని క్రైమ్ బ్యూరో రికార్డులే చెబుతున్నాయి' అని తపన్ సేన్ ఆ ప్రకటనలో తెలిపారు.

చైనా, యూరప్, అమెరికా వంటి ఉత్పాదక దేశాలతో పోలిస్తే అధికారిక రంగంలో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు సైతం ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తోంది. కార్మికుల నుండి అమానవీయంగా శ్రమను దోచుకుంటున్నారు. జోడించిన నికర విలువలో (వస్తువు లేదా సేవ విలువ నుంచి దాని ఉత్పత్తి ఖర్చును తీసివేయగా వచ్చింది) వేతనాల వాటా పడిపోవడం శ్రమ దోపిడీని సూచిస్తోంది. 1990-91లో వేతనాల వాటా 27.64 శాతం ఉంటే 2022-23 నాటికి 15.94 శాతానికి తగ్గింది. అదే సమయంలో నికర లాభాల వాటా 19.06 శాతం నుండి 51.92 శాతానికి పెరిగింది' అని తపన్ సేన్ వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి విధేయత చూపుతున్న కార్పొరేట్ సంస్థలు ఒక దాని వెంట ఒకటిగా పనిగంటలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. లేబర్ కోడ్లను ఇంకా నోటిఫై చేయకపోయినా బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు కొన్ని బీజేపీ యేతర పార్టీల పాలనలోని రాష్ట్రాలు కూడా పనిగంటలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలను ప్రతిఘటించాలని తపన్ సేన్ ఆ ప్రకటనలో కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

సీఎంగా పని చేయాలని ఉంది

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించాలి : ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

సీఎంగా పని చేయాలని కసితో ఉన్నానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ అన్నారు. హన్మకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను అధికారంలోకి వస్తే నెలలో 10 రోజులు రాష్ట్రంలో ఉంటానని, 20 రోజులు ప్రపంచమంతా తిరిగి పెట్టుబడులు తీసుకొస్తానని అన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలిస్తానన్నారు. నెలకు రూ.5 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని తెలిపారు. ప్రజల్లో నమ్మకం పెంచుకోవడానికే వివిధ జిల్లాల్లో పర్యటిస్తున్నానన్నారు. హైదరాబాద్ నిర్మాణంలో తాను మొదటి వాడినన్నారు. తరువాత వీళ్లంతా హైదరాబాద్‌ను నాశనం చేశారని ఆరోపించారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ పోటీ చేస్తుందని, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించాలని అన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ పోటీ



సీఎం రేవంత్‌రెడ్డి 13 నెలల కాలంలో ఒక్క మంచి పనీ చేయలేదన్నారు. ఆయనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వుందన్నారు. పదేండ్లలో కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయి కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే.. రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు చేసిందేమీ లేదని విమర్శించారు. పదేండ్ల కాలంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌లే రాష్ట్రాన్ని నడిపారని, రూ.లక్ష కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఎవరూ ఓటు వేయొద్దని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు అంబేద్కర్ వారసులైతే ఆ రెండు పార్టీల వైపు మొగ్గు చూపొద్దన్నారు. బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ కుటుంబ పార్టీగా అభివర్ణించారు. 2007 డిసెంబర్ 7న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తాను మొదటిసారి జై తెలంగాణ అన్నానని చెప్పారు. దుబాయ్‌లో ఎలా డబ్బులు వచ్చాయి..? ఖతార్‌లో డబ్బులు ఎలా వచ్చాయో కవిత ప్రెస్‌మీట్ పెట్టి బహిర్గతం చేయాలన్నారు. రాష్ట్రానికి బీసీ నేతను ముఖ్యమంత్రిని చేసి చూపిస్తానన్నారు. కాంగ్రెస్‌ను మూడు ముక్కలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని ఆ పార్టీలోనే ఈ ప్రచారం జరుగుతోందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, అద్దంకి దయాకర్ ఎవరికి వారు గ్రూపులుగా ఉన్నారన్నారు. రాహుల్‌గాంధీ రాష్ట్రాన్ని తనకు అప్పచెబితే, తాను దేశాన్ని రాహుల్‌కు అప్పచెబుతానని చెప్పుకొచ్చారు. ఉభయ రాష్ట్రాల్లో 32 ఎంపీ సీట్లను గెలిపిస్తానన్నారు.

మంత్రి సీతక్కకు "నైటా" బోనాలకు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

న్యూయార్క్‌లో ఈ ఏడాది జూన్‌లో జరగనున్న బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (నైటా) ఆహ్వానించింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం అధ్యక్షురాలు ఏనుగు వాణి హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. అమెరికా ప్రధాన నగరమైన న్యూయార్క్‌లో తెలుగువారికి ఓ సంఘం ఏర్పాటు చేయటంతో పాటు, తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను కొనసాగించేందుకు నైటా చేస్తున్న కృషిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

కేటీఆర్‌పై అక్రమ కేసులు

- మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈ కార్ రేస్ కేసులో అక్రమంగా ఇరికించిందని మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, దేవి ప్రసాద్, తుల ఉమ విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సంయుక్తంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలపాలనీ, ప్రపంచంతో పోటీపడి ఈ కార్‌రేస్‌ను రాష్ట్రానికి తెచ్చారని గుర్తు చేశారు. ఏసీబీ, ఈడీలు వెంటవెంటనే కేసులు నమోదు చేయడం వెనక కుట్ర కోణం దాగుందని విమర్శించారు. ఈడీ విచారణ సందర్భంగా కేటీఆర్ వెంట వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేశారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని వ్యాఖ్యానించారు. ఏసీబీ, ఈడీ కేసుల్లో కేటీఆర్ నిర్దోషిగా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ కోసం జైపాల్‌రెడ్డి కృషి మరువలేనిది

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ చిన్నారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. జైపాల్‌రెడ్డి 83వ జయంతిని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ స్ఫూర్తిస్థల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ అపర మేధావిగా పేరుగాంచిన ఆయన ఏ రంగం మీదైనా అంగ్లంలో అనర్గళంగా మాట్లాడే వారని గుర్తు చేశారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా క్రియాశీల రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని కొనియాడారు.

ద.మ.రైల్వే పీసీసీఎమ్‌గా ఎన్ రమేష్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే (ద.మ.రైల్వే) ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎమ్)గా ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీఎస్)కు చెందిన ఎన్ రమేష్ బాధ్యతలు స్వీకరించారు. 1992 బ్యాచ్‌కి చెందిన ఆయన నైరుతి రైల్వేలో చీఫ్ క్లెయిమ్స్ ఆఫీసర్‌గా పనిచేసి, ఇప్పుడు ద.మ.రైల్వేలో కొత్త బాధ్యతలు చేపట్టారు. 30 ఏండ్ల సర్వీసులో ఆయన భారతీయ రైల్వేలో పలు విభాగాల్లో విధులు నిర్వర్తించారు. నూతన బాధ్యతలు స్వీకరించాక రైల్ నిలయంలోని పలువురు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంవీ యాక్ట్‌తో రవాణా రంగం కుదేలు

- లేబర్ కోడ్ల వ్యతిరేక పోరాటంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు కలిసి రావాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొచ్చిన మోటారు వాహనాల చట్టం (ఎంవీ యాక్ట్)తో రవాణా రంగం పూర్తిగా కుదేలైందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీవీఎఫ్) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను హైదరాబాద్‌లోని సీఐటీయూ నగర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధికోసం గూడ్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను నమ్ముకున్న సామాన్య ప్రజలకు ఈ చట్టం గుదిబండగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్ల కాలంలో తీసుకొచ్చిన అనేక సంస్కరణలు ప్రజల జీవితాలను కకావికలం చేశాయని విమర్శించారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన మోడీ సర్కార్ వాటిని ఫిబ్రవరిని నుంచి అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్‌కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా ఫిబ్రవరి ఐదున దేశవ్యాప్త నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వం వాటిని ఉపసంహరించుకోకుంటే సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికుల న్యాయమైన హక్కుల కోసం చేస్తున్న పోరాటంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం. వెంకటేశ్, ఏఐఆర్‌టీవీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్, నగర కార్యదర్శి కె.అజయ్‌బాబు, నాయకులు వి.కామేశ్‌బాబు, బి.లక్ష్మణ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్ వద్ద భారీ బందోబస్తు

- కేటీఆర్‌ను ఈడీ విచారిస్తున్న నేపథ్యంలో పోలీసుల మోహరింపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఫార్ములా ఈ రేస్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్‌ను ఈడీ విచారిస్తున్న నేపథ్యంలో గాంధీభవన్ వద్ద భారీ బందోబస్తు చేపట్టారు. కొంత మంది బీఆర్ఎస్ కార్యకర్తలు గాంధీభవన్‌ను ముట్టడించే అవకాశం ఉందన్న సమాచారంతో ఇక్కడ భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. గురువారం హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నాలుగు గేట్ల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఈడీ విచారణ పూర్తయ్యే వరకూ ఇక్కడ భద్రతను పటిష్టం చేయాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించినట్టు తెలిసింది. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా పోలీసులు మోహరించారు. మరోవైపు కేటీఆర్ విచారణ నేపథ్యంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది అక్కడ మోహరించారు. బాష్పవాయువు, వాటర్‌కెనాన్ల వాహనాలను పోలీసులు తెప్పించారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ జరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈడీ కార్యాలయం నుంచి వెళ్లిపోవాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు పోలీసులు సూచించారు.

ఎట్టకేలకు..

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలతో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపకుండా ఆంక్షలు విధించిన క్యూబా సంస్థల జాబితాను రద్దు చేయాలని కూడా నిర్ణయించింది. ఈ మేరకు వైట్‌హౌస్ ఈ నెల 14న ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ చర్యల వల్ల పరిమితమైన ప్రయోజనాలే వున్నప్పటికీ క్యూబా ప్రజలు, ప్రభుత్వం చేస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా సరైన దిశగా తీసుకున్న నిర్ణయంగా చూడాల్సి వుంటుంది. ఈ నిర్ణయాల వల్ల క్యూబాపై నిర్దిష్టంగా తీసుకునే బలవంతపు చర్యలకు ముగింపు పలుకుతారు. ఈ చర్యల వల్లనే క్యూబా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఇది ఆ దేశ ప్రజలపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. 2017 నుండి అమల్లో వున్న అనేక బలవంతపు చర్యల్లో కొన్ని చర్యలు, అలాగే ఆర్థిక ఆంక్షలు ఇంకా అమల్లోనే కొనసాగుతాయనేది పరిగణనలోకి తీసుకుంటే ఇది అంతర్జాతీయ మానవతా చట్టాలను, క్యూబన్ల మానవ హక్కులను ఉల్లంఘించడమే కాగలదని భావిస్తున్నారు.

నవతెలంగాణ ఉద్యోగి తల్లి బోళ్ల బాలమ్మకు సీజీఎం నివాళి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ ప్రింటింగ్ ప్రెస్ మిషన్ ఆపరేటర్ బోళ్ల శేఖర్ తల్లి పెద్ద బాలమ్మ సంతాప(దశదిన కర్మ) కార్యక్రమం గురువారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం హస్మత్‌పుర గ్రామంలో నిర్వహించారు. నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, ప్రింటింగ్ ప్రెస్ జనరల్ మేనేజర్ రఘు, మార్కెటింగ్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి హాజరై బాలమ్మకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, సుధీర్, నగేష్, నాగరాజు, దామోదర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్‌పై కేసు

నవ తెలంగాణ- అచ్చంపేట

మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. బుధవారం అచ్చంపేట పట్టణంలోని భ్రమరాంబ దేవాలయం ప్రభ ఉత్సవాలలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కుటుంబీకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కుటుంబంతో కలిసి అక్కడికి రాగా, పోలీసులు అడ్డుకున్నారు.ఈ సందర్భంలో స్థానిక ఎస్‌ఐపై గువ్వల బాలరాజు అసభ్యంగా ప్రవర్తించారు. కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దాంతో ఆయనపై ఎస్ఐ రమేష్ ఫిర్యాదు చేయడంతో గువ్వల బాలరాజుతోపాటు 16 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

కొత్త సినిమాలను అక్రమంగా ప్రదర్శిస్తే చట్టపరమైన చర్యలు

- తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ దిల్ రాజు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అనుమతి లేకుండా కొత్త సినిమాలను ప్రయివేటు, ప్రజా రవాణా వాహనాలు, లోకల్ కేబుల్ చానళ్లలో అక్రమంగా ప్రదర్శిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ దిల్ రాజు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రజా రవాణా వాహనాలు , లోకల్ చానళ్లతో పాటు ఆన్‌లైన్, సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్‌లలో ఎలాంటి అనుమతి లేకుండా చాలా సినిమాలు ప్రదర్శిస్తున్నారని తెలుగు ఫిలిం ఛాంబర్ ఎఫ్‌డీసీ దృష్టికి తీసుకొచ్చిందని తెలిపారు. దీని వల్ల పైరసీ కాపీరైట్ కింద నేరంగా పరిగణిస్తామని స్పష్టం చేసారు. సినిమాలు ప్రదర్శించడం వల్ల సినీ పరిశ్రమకు ఆర్థికంగా నష్టం వచ్చే ప్రమాదం ఉందనీ, రాష్ట్ర ప్రభుత్వ ఖజానాతోపాటు నిర్మాతలకు సైతం భారీ నష్టం వస్తదని గుర్తు చేశారు. ప్రజలకు వినోదాన్ని అందించే లక్ష్యంతో నిర్మాతలు, డైరెక్టర్లు సినిమాలను రూపొందించడానికి కోట్లాది రూపాయలను పెట్టుబడిగా పెడుతుంటారని తెలిపారు. అక్రమంగా సినిమాలను ప్రదర్శించడం వల్ల సినీ పరిశ్రమ ఆర్థికంగా నష్టపోవడంతో పాటు సృజనాత్మకత దెబ్బ తింటుందని తెలిపారు. కళామతల్లిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వేలాదిమంది కార్మికులు, కళాకారుల జీవన విధానం చిన్నాభి న్నమవుతుందని పేర్కొన్నారు. సినీ పరిశ్రమ దర్శకుల, నిర్మాతల హక్కులను కాపాడేందుకు తమ శాఖ నిరంతరం కషి చేస్తున్నదని తెలిపారు.

పాకల తీరంలో నలుగురు గల్లంతు

- మూడు మృతదేహాలు వెలికితీత..

మరొకరి కోసం గాలింపు

శింగరాయకొండ : సముద్రతీరానికి వచ్చిన పర్యాటకులను అలల రాకాసి కబళించింది. ఒక్కసారిగా వచ్చిన అలలకు నలుగురు గల్లంతయ్యారు. వీరిలో ముగ్గురి మ ృతదేహాలను వెలికి తీశారు. వీరికి కూతవేటు దూరంలోనే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గల్లంతయ్యారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం, పాకల తీరంలో జరిగింది.పొన్నలూరు మండలం, శివన్నపాలెం గ్రామానికి చెందిన నాసిన మాధవ (26), ఆయన సతీమణి నవ్య, మాధవ సోదరి నాసిన జోషిక (16), మాధవ బంధువు కొండా బత్తిన యామిని (19) కలిసి సరదాగా పాకల సముద్ర తీరానికి వచ్చారు. నలుగురూ సముద్రం ఒడ్డున ఆడుకుంటుంగా అలల తాకిడికి ఒక్కసారిగా కొట్టుకుపోయారు. వీరిలో మాధవ, జోషిక, యామిని అక్కడికక్కడే మ ృతిచెందారు. మాధవ సతీమణి నవ్యను మెరైన్ పోలీసులు, మత్స్యకారులు కాపాడారు. ముగ్గురి మ ృతదేహాలను కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పెండ్లయిన మూడు నెలలకే..

పొన్నలూరు మండలం, శివన్నపాలెం గ్రామానికి చెందిన నాసిన మాధవ (26), ఆయన సతీమణి నవ్యకు వివాహమై మూడు నెలలైంది. సంక్రాంతి సందర్భంగా మాధవ దంపతులు శివన్నపాలెం గ్రామం నుంచి అత్తగారి ఊరైన కొల్లగుంట గ్రామానికి వచ్చారు. సరదాగా సముద్ర తీరానికి వెళ్లారు.కండ్ల ముందే భర్తను కోల్పోవడంతో నవ్య కన్నీటి పర్యంతమయ్యారు.

భారీ పెట్టుబడులే లక్ష్యంగా

సింగపూర్, దావోస్‌కు సీఎం

ఆరురోజుల విదేశీ పర్యటన

- వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొననున్న రేవంత్
- క్లీన్ అండ్‌గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఫ్యూచర్ సిటీపై ఫోకస్



(ఫైల్)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బందం విదేశీ పర్యటనకు బయల్దేరింది. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి వెంట వెళ్లారు. ఢిల్లీ నుంచి గురువారం రాత్రి 10గంటలకు బయల్దేరిన సీఎం, ముందుగా సింగపూర్‌కు చేరుకుంటారు. 17, 18, 19 తేదీల్లో అక్కడ మూడు రోజులపాటు పర్యటిస్తారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు చేస్తారు. ఈ సందర్భంగా ప్రపంచంలో పేరొందిన సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఎస్ఐటీఈ)ని సందర్శిస్తారు. నైపుణ్యాభివద్ధికి ఆ యూనివర్సిటీ ఎంచుకున్న కోర్సులు, అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకారం అందించేందుకు సింగపూర్ ఐటీఈతో ఒప్పందం చేసుకుంటారు. సింగపూర్‌లో రివర్ ఫ్రంట్‌ను సందర్శిస్తారు. ప్రపంచస్థాయిలో మూసీ పునరుజ్జీవనం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న అక్కడి రివర్ ఫ్రంట్ ఏరియా అభివద్ధి చేసిన తీరుతెన్నులను పరిశీలిస్తారు.

సింగపూర్ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి బందం 20వ తేదీ ఉదయం దావోస్‌కు చేరుకుంటుంది. 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు-2025లో పాల్గొంటారు. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా భావిస్తోంది. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈ సారి అంతకు మించిన పెట్టుబడులే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ఇటీవలే అధికారులతో సమీక్షలో ప్రకటించిన సంగతి తెలిసిందే.

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న ఆయా అభివద్ధి ప్రాజెక్టుల తో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, మాన్యుఫాక్చరింగ్ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో పాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ)పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి.

హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ అభివద్ధి, వరల్డ్ క్లాస్ సిటీగా గ్రేటర్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లు, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా అందరినీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి ఏడాదిలో చేపట్టిన విదేశీ పర్యటనలన్నీ విజయవంతమయ్యాయి. గత ఏడాది దావోస్ పర్యటనతోపాటు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. దేశంలో అద్భుతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న తెలంగాణకు భారీగా పెట్టుబడులు సమీకరించే లక్ష్యంతో సీఎం నేతత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బందం ఈ విదేశీ పర్యటనకు బయల్దేరుతోంది. ఈమేరకు గురువారం సీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది.

20న ఎంపీల ఇండ్లు, కార్యాలయాల వద్ద ఆందోళన

- 26న జిల్లాలు, సబ్ డివిజన్లలో ట్రాక్టర్స్, వాహన, మోటార్ సైకిల్ మార్చ్‌లు
- రాష్ట్రాల్లో కిసాన్ మహాపంచాయత్‌లు : సంయుక్త కిసాన్ మోర్చా



నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

ఈనెల 20న ఎంపీల ఇండ్లు, కార్యాలయాల వద్ద ఆందోళనకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. అలాగే, జనవరి 26న జిల్లాలు, సబ్ డివిజన్లలో ట్రాక్టర్, వాహనం, మోటార్ సైకిల్ మార్చ్‌లు నిర్వహించాలని సూచించింది. ఈ మేరకు గురువారం ఎస్‌కేఎం ప్రకటన విడుదల చేసింది. ఎన్‌పీఎఫ్ఏఎంను తిరస్కరిస్తూ రాష్ట్రాల అసెంబ్లీల్లో తీర్మానాన్ని ఆమోదించాలనీ, రైతు సంఘాల చర్చలు జరపడానికి, దల్లేవాల్ ప్రాణాలను కాపాడటానికి ప్రధానికి లేఖ రాయాలని ముఖ్యమంత్రులను ఎస్‌కేఎం నేతలు కోరుతున్నారు.

ఖానౌరి సరిహద్దులో జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష 52 రోజులు దాటిన నేపథ్యంలో ఎంఎస్పీ, రుణమాఫీ, జగ్జిత్ సింగ్ దల్లెవాల్ ప్రాణాలను కాపాడటం, వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్లతో కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఎస్‌కేఎం పోరాడుతుందని వారు వివరించారు.

ప్రధానికి లేఖ

52 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న దల్లేవాల్ ప్రాణాలకు తీవ్ర ప్రమాదమున్నదని ఎస్‌కేఎం సమన్వయ కమిటీ ప్రధానికి లేఖ రాయాలని నిర్ణయించింది. అన్ని రాష్ట్రాల్లో కిసాన్ మహాపంచాయత్ నిర్వహించాలనీ, ఫిబ్రవరి 11న బీహార్‌లోని పాట్నాలో భారీ కిసాన్ మహాపంచాయత్ జరగనుందని తెలిపింది. రైతు, సమాఖ్య వ్యతిరేక వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదా (ఎన్‌పీఎఫ్ఏఎం) తిరస్కరించడానికి అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించాలనీ, దానిని తక్షణమే రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాలని ఎస్‌కేఎం ప్రతినిధులు సంబంధిత ముఖ్యమంత్రులను కలవనున్నారు. రైతు సంఘాలతో వెంటనే చర్చలు నిర్వహించి దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని ప్రధానికి లేఖ రాయాలని కోరనున్నారు.

కవాతులో పాల్గొనాలంటూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు

జనవరి 20న ఎంపీల నివాసాలు, కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రధానిపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీలను ఎస్‌కేఎం కోరనుంది. రైతు ర్యాలీలు, టార్చ్‌లైట్ ఊరేగింపులతో పాటు గ్రామాల్లో వారం పాటు ప్రచారాలను చేపట్టాలని ఎస్‌కేఎం రైతులకు పిలుపునిచ్చింది. రైతుల డిమాండ్లకు మద్దతుగా కార్మికులు ఈనెల 26న జరిగే ట్రాక్టర్, వాహన, మోటార్ సైకిల్ కవాతులో కూడా పాల్గొనాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి.

అఫ్జల్‌గంజ్‌లో కాల్పుల కలకలం

- బస్సు క్లీనర్‌పై కాల్పులు జరిపిన బీదర్ దొంగల ముఠా
- పరారైన దుండగులు



నవతెలంగాణ - ధూల్ పేట్

హైదరాబాద్ నగరం నడిబొడ్డున అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు కలకలం రేపాయి. బీదర్‌లో ఏటీఎం దొంగల ముఠా నగరంలో హల్ చేసి కాల్పులు జరపడంతో ఓ ప్రయివేటు ట్రావెల్స్ బస్సు క్లీనర్ గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక బీదర్‌లో గురువారం ఉదయం ఓ ఏటీఎం సెంటర్‌లో డబ్బులు పెట్టడానికి వచ్చిన వాహన సిబ్బందిపై బైకుపై వచ్చిన ఇద్దరు దొంగలు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సెక్యూరిటీగార్డు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు తెలిసింది. తర్వాత దొంగలు నగదుతో పరారై హైదరాబాద్ వచ్చారు. ఆ దొంగల ముఠాని పట్టుకోవడానికి బీదర్ పోలీసులు కూడా నగరానికి వచ్చారు. అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వారు ఉన్నట్టు సమాచారం అందుకుని స్థానిక పోలీసులతో కలిసి ట్రావెల్స్ ప్రయాణ ప్రాంతాలలో నిఘా పెట్టారు. దొంగలు వేరే ప్రాంతానికి వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్నట్టు తెలిసింది. అయితే, పోలీసులను గమనించిన దుండగులు తప్పించుకునే క్రమంలో ఓ ట్రావెల్స్ బస్సు క్లీనర్‌పై కాల్పులు జరిపి పరారయ్యారు. అతన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ట్రావెల్స్ వారి వద్ద నమోదైన దొంగల వివరాలను పోలీసులు సేకరించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

అనుమతులివ్వండి



(మొదటిపేజీ తరువాయి)

అనుమతుల విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఆయా పనులకు వెంటనేఅనుమతులు మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. కాగా తమ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ సానుకూలంగా స్పందించారని సీఎంఓ వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి.

ఈ-మోడల్‌లోకి ఆర్టీసీ బస్సులను మార్చేందుకు సహకరించండి

హైదరాబాద్ నగరంలోని వంద శాతం బస్సులను ఎలక్ట్రిక్ మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి కుమారస్వామితో గురువారం సీఎం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి ఆర్టీసీ బస్సులను ఈ -మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని కోరారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద జీసీసీ పద్ధతిలో బస్సులు కేటాయించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఆయన కేంద్ర మంత్రికి తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు ఎలక్ట్రిక్ కిట్ అమర్చి రెట్రో ఫిట్మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే 2,800 బస్సులను జీసీసీతో పాటు రిట్రో ఫిట్మెంట్ మోడల్ కింద కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. తరువాత కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను సీఎం రేవంత్ రెడ్డి ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై ఆయనతో చర్చించారు. కేంద్ర మంత్రులతో భేటీ అనంతరం ఢిల్లీ పర్యటన ముగించుకొని సింగపూర్ టూర్ కు సీఎం బయలుదేరి వెళ్లారు.

తెలంగాణ తరహాలో ఢిల్లీ ప్రజలను మోసగిస్తున్న సీఎం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రజలను మోసగించిన తరహాలోనే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ ప్రజలు మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని తెలిపారు. మహారాష్ట్ర ఎన్నికల్లో రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను అక్కడి ప్రజలను నమ్మలేదనీ, అందుకే ఆయన ప్రచారం చేసిన అన్ని స్థానాల్లో కాంగ్రెస్‌ను ఓడించారని చెప్పారు. అదే విధంగా ఢిల్లీ ప్రజలు కూడా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చానని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారో చెప్పాలని సవాల్ చేశారు.

కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులో నయా పైసా అవినీతి జరగలేదనీ, ఆయన విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారని తెలిపారు. పోలీసులు అత్యుత్సాహంతో బీఆర్‌ఎస్ నేతలను అరెస్ట్ చేశారని విమర్శించారు. అన్ని రోజులు ఒకేలా ఉండవని హెచ్చరించారు. హైదరాబాద్ ప్రతిష్ట పెంచేందుకు ఫార్ములా-ఈ రేస్ తీసుకొస్తే దాన్ని రద్దు చేసి రేవంత్ రెడ్డి నష్టం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలనీ, ఈడీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్, బీజేపీలది అజబ్ ప్రేమ్ కీ గజబ్ కహానీ


కాంగ్రెస్, బీజేపీలది అజబ్ ప్రేమ్ కీ గజబ్ కహానీ అని ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఆ రెండు పార్టీల నేతలు ఒకేలా మాట్లాడుతున్నారనీ, కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలంటూ ఏసీబీని ప్రభావితం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. వారి దారిలోనే బీజేపీ నాయకులు కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలని అంటున్నారని గుర్తుచేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీజేపీ ఎంపీలు ఈడీని ప్రభావితం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్ అయితే, రాత్రికి బీజేపీతో ఉంటున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ కార్యాలయంపై దాడి విషయంలో స్పందించిన పీసీసీ అధ్యక్షులు బీఆర్‌ఎస్ కార్యాలయాలపై దాడుల గురించి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తనది కాంగ్రెస్ పార్టీ అని అధికారికంగా ప్రకటించిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పై శాసన సభాపతి ప్రసాద్ కుమార్ అనర్హత వేటు వేయాలని కోరారు.

నిబంధనలు ఎందుకు ఉల్లంఘించారు..?

(మొదటిపేజీ తరువాయి)

విచారించారు. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ ప్రారంభంలో ఉన్న కంపెనీ మధ్యలోనే ఎందుకు వైదొలిగింది మొదలుకొని లండన్‌లోని ఎఫ్ఈఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకునే వరకు ఎలాంటి విధానాలను అనుసరించారని ఈడీ ప్రశ్నించింది. ముఖ్యంగా, యూకేలోని ఎఫ్ఈఓ కంపెనీకి రూ.45 కోట్లను బదిలీ చేసేందుకు మీరు హెచ్ఎండీఏ మాజీ కార్యదర్శి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలపై ఒత్తిడిని తీసుకొచ్చారా? అని కూడా ఈడీ కేటీఆర్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. యూకే పౌండ్ల రూపంలో డబ్బులు బదిలీ జరిగినపుడు మీకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనుమతిని తీసుకోవాలని తెలియదా? ఆ సందర్భంలో ఈ డబ్బులు బదిలీ జరిపే సమయంలో హిమాయత్‌నగర్ ఐఓబీ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారా? అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం. అలాగే, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌లో హెచ్ఎండీఏను భాగస్వామ్యం చేసేందుకు మీరు ప్రభుత్వానుమతిని తీసుకున్నారా? హెచ్ఎండీఏ నుంచి ఈ-కార్ రేసింగ్ కోసం రూ.55 కోట్ల పెట్టుబడిని పెట్టాలనేది మీ స్వంత నిర్ణయమా? అని కూడా అధికారులు ప్రశ్నించారని తెలిసింది.

అదే సమయంలో, గ్రీన్‌కో కంపెనీ నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.47 కోట్లను మీరు ఎలా తీసుకున్నారు? అని ఈడీ.. కేటీఆర్‌ను ఆరా తీసినట్టు సమాచారం. కాగా, ఈడీ వేసిన పలు ప్రశ్నలకు తాను ఏది చేసినా.. నిబంధనల మేరకే చేశాననీ, ఈ విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని కేటీఆర్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. తాను ఫార్ములా-ఈ కార్



రేసింగ్‌ను హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచటానికి నిర్వహించాలని భావించాననీ, ఇందులో ఒక్క పైసా కూడా తాను అవినీతికి పాల్పడలేదని కేటీఆర్ అన్నట్టు సమాచారం. ఈ సమయంలోనే ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలు కేటీఆర్‌కు సంబంధించి ఇచ్చిన సమాచారాన్ని కేటీఆర్ ముందుంచి ప్రశ్నించినట్టు తెలిసింది. ఆ సమయంలో ఇదంతా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ కక్షతో నడిపిస్తున్న కేసు అని, ఇందులో తాను ఎలాంటి పొరపాటూ చేయలేదని కేటీఆర్ అన్నట్టు సమాచారం. అయితే, ఆర్బీఐ ఎందుకు జరిమానా విధించిందని ఈడీ అధికారులు మరో ప్రశ్న వేసినట్టు తెలిసింది.

ఉదయం 10:45 గంటలకు విచారణ కోసం ఈడీ కార్యాలయానికి చేరుకున్న కేటీఆర్‌ను అధికారులు సాయంత్రం 5:45 వరకు, మధ్యలో ఒక గంట భోజన విరామం వదిలి ప్రశ్నించారు. అంతకుముందు, గండిపేట్‌లోని ఫామ్‌హౌజ్ నుంచి ఈడీ కార్యాలయానికి కేటీఆర్ తన న్యాయవాదులతో కలిసి చేరుకున్నారు. కాగా, విచారణలో న్యావాదులకు అనుమతి లేదని తెలిపిన ఈడీ అధికారులు.. కేవలం కేటీఆర్‌ను లోనికి తీసుకెళ్లి మాట్లాడారు. ఆ సమయంలో ఈడీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు చేరుకొని.. కేటీఆర్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు.. బీఆర్ఎస్ కార్యకర్తలను మొదట వెళ్లిపోవాలని చెప్పి, తర్వాత చెదరగొట్టారు. ఆ మార్గంలో రెండు వైపులా బారికేడ్లను వేసి సాయుధ పోలీసులు పహారా కాశారు. ఆరు గంటల తర్వాత ఈడీ కార్యాలయం నుంచి కేటీఆర్.. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు వెంట రాగా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధమా?

- సీఎంకు కేటీఆర్ సవాల్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

"రేవంత్‌రెడ్డి.. నువ్వు, నేను కలిసి లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధపడదామా? ఎవరు నిజాయితీపరులో తేలిపోతుంది" అని సీఎంకు కేటీఆర్ సవాల్ విసిరారు. ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి ఈడీ అధికారులు తనను ప్రశ్నించాక.. కార్యాలయం నుంచి సాయంత్రం వెలుపలికి వచ్చిన కేటీఆర్.. కొద్ది సేపు మీడియాతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు ఎనభై ప్రశ్నలు వేస్తే.. ఈడీ అధికారులు మరో 40 ప్రశ్నలు వేసి విచారించారని.. ఇందులో తేలింది ఏమీ లేదని కేటీఆర్ అన్నారు. ఈ కేసు విచారణ కోసం దాదాపు రూ.10 కోట్లు వ్యయమవుతున్నదని పత్రికల్లో చదివాననీ, ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసే బదులు సీఎంపై ఉన్న ఏసీబీ కేసులు, తనపై మోపబడిన ఏసీబీ కేసులను నేపథ్యంగా చేసుకొని న్యాయమూర్తుల ముందు లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధమవుదామనీ, దానితో ఎవరు నిజాయితీపరులో తేలిపోతుందని ఆయన వ్యాఖ్యానించారు.

ఆ మిగిలే డబ్బులతో ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేయొచ్చని అన్నారు. ఈ కేసులో తాను పీసమెత్తు అవినీతికి కూడా పాల్పడలేదనీ, పెట్టుబడి పెట్టిన డబ్బులు ఎఫ్ఈఓ కంపెనీ వద్ద సురక్షితంగా ఉన్నాయనీ, ఇక ఇందులో అవినీతి ఎక్కడిదని కేటీఆర్ ప్రశ్నించారు.

ఆయనపై గతంలో ఏసీబీ, ఈడీ కేసులు నమోదైన దృష్ట్యా.. నాపై కూడా ఇలాంటి కేసులు పెట్టించి రేవంత్‌రెడ్డి రాజకీయ కక్ష తీర్చుకుంటున్నాడని కేటీఆర్ ఆరోపించారు. తనను ఎన్నిమార్లు విచారణకు పిలిచినా.. ఈడీ, ఏసీబీల వద్ద హాజరవుతాననీ, తనకు భారత న్యాయవ్యవస్థ పట్ల పూర్తి నమ్మకం, విశ్వాసం ఉన్నదని ఆయన అన్నారు.

రహదారి నిర్వహణలో శ్రద్ధ పెరగాలి

- డీజీ నర్సింహారావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రహదారి భద్రతలో ముఖ్యంగా నిర్వహణపై శ్రద్ధ పెరగాల్సిన అవసరముందని పట్నం సంస్థ ప్రధాన కార్యదర్శి డీ.జీ.నర్సింహారావు సూచించారు. న్యూస్ 18 మీడియా సంస్థ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో రహదారి భద్రతపై నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ వేలాది కిలోమీటర్ల మేర రోడ్లను వేస్తున్నప్పటికీ వాటి నిర్వహణ విషయంలో సంవత్సరాల తరబడి నిర్లక్ష్యం కొనసాగుతున్నదని తెలిపారు. గత కొంత కాలంగా పట్టణీకరణ పెరిగిపోతున్నదనీ, ఆ మేరకు రోడ్ల పరిధి కూడా విస్తరిస్తున్నదని చెప్పారు. రోడ్లను వేసిన తర్వాత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, విద్యుత్, కేబుల్ తదితర పైపులైన్ల కోసమంటూ ఏదో ఒక కాంట్రాక్ట్‌కు అప్పగించి నిర్వహణ గాలికొదిలేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రోజువారీ తనకు ఎదురవుతున్న అనుభవాలను ఆయన వివరించారు. తవ్విన రోడ్లను తిరిగి వెంటనే పూడ్చడం లేదని చెప్పారు. రోడ్ల నిర్వహణ స్థిరంగా కొనసాగాలని తెలిపారు. అలా రోడ్ల నిర్వహణతో ప్రజల ఆరోగ్యం బాగుంటుందనీ, వారు అప్పులు పాలు కాకుండా ఉంటారని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో చాలా రోడ్లపై రెగ్యులర్‌గా వాహనాలను నడిపే డ్రైవర్లకు బ్యాక్ పెయిన్ సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు భద్రతపై యువతపై అవగాహన పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యావేత్త అర్చన, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నాగరాజు పాల్గొన్నారు.

ఆదివారం నుంచి గాజాలో కాల్పుల విరమణ

అంగీకరించిన ఇజ్రాయిల్, హమాస్ | ప్రకటించిన కతార్ ప్రధాని | తక్షణమే మానవతా సాయానికి చర్యలు : ప్రపంచ నేతల వినతి

గాజా, జెరూసలెం : గాజాలో ఇజ్రాయిల్ సైనిక బలగాలు గత 15మాసాలకు పైగా కొనసాగిస్తున్న భీకర దాడులకు విరామం ఇస్తూ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన దేశాల్లో ఒకటైన కతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ గురువారం ప్రకటించారు. ఈ కాల్పుల విరమణ ఆదివారం (19వ తేదీ) నుండి అమల్లోకి వస్తుందని ఆయన తెలిపారు. బందీలు, ఖైదీల విడుదల ప్రక్రియ కూడా అప్పుడే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కాల్పుల విరమణ శాశ్వతంగా అమలు కావాలన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కతార్ రాజధాని దోహాలో గత కొన్ని వారాలుగా అనేక అడ్డంకుల మధ్య కొనసాగుతూ వచ్చిన ఈ చర్చల్లో ఎట్టకేలకు ఈ ఒప్పందం కుదిరింది. హమాస్ చెరలో వున్న బందీలను దశలవారీగా విడుదల చేసేందుకు, అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్ళలో మగ్గుతున్న వందలాదిమంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు ఈ ఒప్పందం హామీ కల్పించింది. అలాగే వరుసగా కొనసాగిన దాడులతో ఇళ్ళు, వాకిళ్ళు వీడి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వేలాదిమంది పాలస్తీనియన్లను తిరిగి వారి స్వస్థలాలకు చేరేందుకు కూడా ఈ ఒప్పందం అనుమతిస్తోంది. విచక్షణారహితంగా జరిగిన దాడులతో పూర్తిగా వినాశనం చోటు చేసుకున్న గాజాకు ఎంతగానో అవసరమైన మానవతా సాయాన్ని అందించేందుకు కూడా ఈ ఒప్పందం వీలు కల్పిస్తోంది. ఒప్పందంలోని కొన్ని అంశాలపై ఇజ్రాయిల్ పాలక సంకీర్ణంలో చివరి నిముషంలో కొన్ని విభేదాలు తలెత్తినప్పటికీ చివరకు ఈ ఒప్పందానికి ఇజ్రాయిల్ కేబినెట్ కూడా అనుకూలంగా ఓటు వేసింది. తాము కూడా పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కట్టుబడి వున్నామని హమాస్ సీనియర్ అధికారి ప్రకటించారు. హమాస్ విధించిన షరతులన్నీ నెరవేరేలానే ఈ ఒప్పందం కుదిరిందని ఇజ్జాత్ అల్ రిషిక్ చెప్పారు. ఇజ్రాయిల్ బలగాలు గాజా నుండి పూర్తిగా వైదొలగాలని, నిర్వాసితులందరూ వెనక్కి తిరిగి వచ్చేందుకు అనుమతించాలని హమాస్ కోరుతూ వస్తోంది. అలాగే ఈ ఒప్పందం శాశ్వత కాల్పుల విరమణకు దారి తీయాలని వాంఛిస్తోంది. ఇప్పటివరకు గాజా దాడుల్లో 46,788మంది మరణించారు. 1,10,453మంది గాయపడ్డారు.

ప్రపంచ నేతల వినతి

ఒప్పందంలోని ప్రతి అంశానికీ కట్టుబడి వుండాల్సిందిగా, అన్నింటినీ పూర్తిగా అమలు చేయాల్సిందిగా ప్రపంచ నేతలు విజ్ఞప్తి చేశారు. గాజా పౌరులకు ఎంతగానో అవసరమైన మానవతా సాయాన్ని త్వరగా పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మానవతా సాయం అందించేందుకు ప్రస్తుతం ఎదురవుతున్న రాజకీయ అడ్డంకులను ఈ ఒప్పందం తొలగించడం అత్యవసరమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ వ్యాఖ్యానించారు. మధ్య ప్రాచ్యానికి, మొత్తంగా మానవాళికి ఈ ఒప్పందం చాలా ప్రయోజనం కలిగిస్తుందని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తైయిప్ ఎర్డోగన్ వ్యాఖ్యానించారు. గాజాలో భద్రతకు దారి తీసే ఈ ఒప్పందాన్ని రష్యా స్వాగతించింది. ఈ మేరకు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఒక ప్రకటన జారీ చేశారు. గాజా ఒప్పందాన్ని ఇజ్రాయిల్ పూర్తి స్థాయిలో అమలు చేస్తోందా లేదా అనే విషయమై పూర్తి స్థాయి పర్యవేక్షణ వుండాలని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ సూచించారు.



గాజా ఒప్పందాన్ని స్వాగతించిన భారత్ సీఐటీయూ హర్షం

న్యూఢిల్లీ : గత 15మాసాలకు పైగా గాజాలో ఉధృతంగా కొనసాగుతున్న దాడులకు విరామం పలికేలా తాజాగా గురువారం కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన జారీ చేసింది.

ఈ ఒప్పందంతో గాజా ప్రజలకు సురక్షితమైన రీతిలో, నిలకడగా మానవతా సాయం అందించేందుకు వెసులుబాటు కుదురుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొంది. బందీలందరూ విడుదల కావాలని, తిరిగి చర్చలు, దౌత్యం పంథాకు ఇరు పక్షాలు మళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆ ప్రకటన పేర్కొంది.

స్వాగతించిన సీఐటీయూ

గాజాలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం పట్ల సిఐటియు హర్షం వ్యక్తం చేసింది. ఈ ఒప్పందం ఆ ప్రాంతంలో శాశ్వత శాంతికి మార్గాన్ని సుగమం చేయాలని, ఇజ్రాయిల్ ఆక్రమణలకు స్వస్తి పలకాలని ఆకాంక్షిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. గాజాలో అత్యంత అమానుషమైన రీతిలో ఇజ్రాయిల్ సాగించిన దాడులను తీవ్రంగా ఖండించింది. ఆక్రమిత పాలస్తీనా భూభాగాల నుండి ఇజ్రాయిల్ బలగాలు తక్షణమే వైదొలగాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. గాజాపై ఆంక్షలను కూడా ఎత్తివేయాలని కోరింది. ఇజ్రాయిల్ సాగించిన యుద్ధ నేరాలపై దర్యాప్తు జరగాలని కోరింది. అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయిల్ గౌరవించేలా అంతర్జాతీయ సమాజం చూడాలని సీఐటీయూ మరోసారి విజ్ఞప్తి చేసింది. అలాగే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేసేలా చూడాలని కోరింది. పాలస్తీనా ప్రజలకు పూర్తి స్థాయిలో సంఘీభావాన్ని ప్రకటించింది. ఆక్రమణలకు వ్యతిరేకంగా ఆత్మ రక్షణ కోసం వారు సాగించే పోరాటానికి పూర్తి మద్దతును తెలిపింది. స్వేచ్ఛా పాలస్తీనా ఏర్పాడాలని, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం ప్రాతిపదికన పాలస్తీనా దేశాన్ని గుర్తించాలని కోరింది.

24గంటల్లో 81మంది మృతి



ఒప్పందం కుదరిన వార్తలు వెలువడగానే గాజా వ్యాప్తంగా వేలాదిమంది ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కాగా మరోవైపు గాజాలో ఇజ్రాయిల్ తాజా దాడులు కొనసాగుతునే వున్నాయని, గత 24 గంటల్లో 81మంది పాలస్తీనియన్లు మరణించారని పౌర రక్షణ దళాలు తెలిపాయి. ఉత్తర గాజాలోని జాబాలియా నగరంపై జరిగిన దాడుల్లో 20మంది మరణించారు. ఇంకా అనేకమంది శిధిలాల కింద చిక్కుకుపోయారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని ప్రకటించిన తర్వాతే ఈ దాడులు జరిగాయని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

కేటీఆర్ నటనకు ఆస్కార్ అవార్డు ఇవ్వాలి

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఫార్ములా ఈ రేస్ కేసు విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ ఆడుతున్న నాటకానికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజల సొమ్ముతో తన స్నేహితున్ని రక్షించారని తెలిపారు. గురువారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిధులను దారి మళ్లించి బదిలీ చేశారని ఆరోపించారు. దానికి గ్లోబల్ హైదరాబాద్‌ను కాపాడటమంటూ కేటీఆర్ గొప్పలు చెబుతున్నారని విమర్శించారు.

సభ్యత్వాన్ని బట్టి పదవులు

మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు

సభ్యత్వాన్ని బట్టి పార్టీ, ప్రభుత్వ పదవులుంటాయని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు మొగిలి సునీతారావు చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ నాయకులతో కలిసి నారీ న్యాయ్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ముందు భాగాన ఉందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు, సెక్రెటరీలకు, మండల బ్లాక్ అధ్యక్షులకు కేటాయించిన సభ్యత్వ టార్గెట్ పూర్తి చేసిన వారికి పదవులు దక్కుతాయని తెలిపారు. పార్టీ నూతన కార్యవర్గంలోనూ, నామినేటెడ్ పదవుల్లో మహిళా కాంగ్రెస్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నీలం పద్మ, నాయకులు సుగుణ నిర్మలారెడ్డి, కుమారి, కవిత, ఆర్.లక్ష్మి, ఇందిర, అనురాధ, భవాని, ఉషశ్రీ, సత్య ప్రసన్న, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డి నిజాయితీకి మారుపేరు

పలువురు ప్రముఖుల నివాళి

కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్‌రెడ్డి 83వ జయంతిని పురస్కరించుకుని స్ఫూర్తి స్థల్ వద్ద పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భార్య గీత, కుటుంబ సభ్యులు, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పార్టీ నాయకులు, జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వెంకయ్యనా యుడు మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి పరిపాలానాధ్యక్షుడన్నారు. ఆయన నుంచి తాను ఎన్నో విషయాలను నేర్చుకున్నట్టు తెలిపారు. ఆయన చేసిన మంచి పనులను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నివాళి అని అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన యువతకు ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు.

స్పేస్ వాక్ చేసిన సునీతా విలియమ్స్

కేప్ కేన్వరల్, ఫ్లోరిడా : గత ఏడు మాసాలుగా అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌లో చిక్కుకుపోయిన ఇద్దరు వ్యోమగాముల్లో ఒకరైన సునీతా విలియమ్స్ తాజాగా గురువారం స్పేస్‌వాక్ చేశారు. ఈ స్పేస్‌వాక్ ఆమెకు ఎనిమిదోసారి కాగా, తాజాగా రోదసీ స్టేషన్‌కు వచ్చిన తర్వాత మొదటిది. 2012లో ఆమె చివరిసారిగా రోదసీలో నడిచారు. ప్రస్తుతం ఆమె రోదసీ స్టేషన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. నాసా వ్యోమగామి నిక్ హేగ్‌తో కలిసి ఆమె కొన్ని మరమ్మత్తులు చేయాల్సి వచ్చింది. దాంతో ఆమె బయటకు వచ్చారు. ఆ సమయంలో తుర్క్మెనిస్తాన్ నుండి 420కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో తిరుగుతున్న రోదసీ స్టేషన్‌లోని ల్యాబ్ నుండి వారు బయటకు వచ్చారు. వచ్చే వారం ఆమె మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌తో కలిసి భూమికి తిరిగి వస్తారని భావిస్తున్నారు.

వారం రోజుల పర్యటన కోసం వీరిద్దరు గత జూన్‌లో రోదసీకి వెళ్ళారు. కానీ అనుకోని సాంకేతిక సమస్యలు ఎదురవడంతో అక్కడనే వుండిపోవాల్సి వచ్చింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ కృష్ణన్ వినోద్ చంద్రన్ ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ కృష్ణన్ వినోద్ చంద్రన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా గురువారం ఆయనతో ప్రమాణం చేయించారు. ఆయన నియామకంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 33కి చేరింది. పూర్తి బెంచ్ కోసం మరొకరిని నియమించాల్సి ఉంది. చంద్రన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని ఈ నెల 7న సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. జస్టిస్ చంద్రన్ 2011లో కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023 మార్చిలో పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

ఏపీలో పందేల మాటున ఆధిపత్య పోరు



రాజమండ్రి: గోదావరి జిల్లాల్లో మూడు రోజులపాటు యథేచ్ఛగా సాగిన కోడి పందేలు బుధవారం రాత్రి ముగిశాయి. ఈ సారి కోడి పందేల్లో ఆధిపత్య పోరు చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలంతా ఒక తాటిపైకి వచ్చి అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చేవారు. బరుల నిర్వహణను సైతం పంచుకునేవారు. ఈ సారి దానికి భిన్నంగా సాగింది. రాజకీయ ప్రత్యర్థులను తమదారికి తీసుకొచ్చేందుకు దీనిని ఒక అవకాశంగా అధికారపార్టీ నేతలు వాడుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి అంగీకరించని వారి బరుల్లో పందేలు జరగనీయకుండా అడ్డుకున్నారని చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు నియోజకవర్గంలో ఇరగవరం మండలం కొత్తపాడులో చోటుచేసుకున్న ఘటనలే దీనికి ఉదాహరణ. ఇక్కడ కొన్ని బరులపట్ల చూసీ చూడనట్లు వ్యవహరించిన పోలీసులు మరికొందరు ఏర్పాటు చేసిన బరులను అడ్డుకున్నారు. దీంతో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రంగంలోకి దిగి రోడ్డుపై బైటాయించారు.

బిజినెస్

రిలయన్స్‌కు రూ.18,540 కోట్ల లాభాలు

- క్యూ3లో 7 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అంచనాలు మించి రెవెన్యూ, నికర లాభాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 7.4 శాతం వృద్ధితో రూ.18,540 కోట్ల నికర లాభాలు సాధించింది. అదే సమయంలో కంపెనీ రెవెన్యూ 7 శాతం పెరిగి రూ.2.43 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. రిలయన్స్ రూ.18,330 కోట్ల మేర లాభాలు, రూ.2.39 లక్షల కోట్ల రెవెన్యూ సాధించొచ్చని మార్కెట్ నిపుణులు వేసిన అంచనాల కంటే మెరుగైన ఫలితాలు ప్రకటించడం విశేషం.


జియో లాభాల జోరు..

రిలయన్స్ జియో ఇన్ఫోకమ్ 2024-25 క్యూ3లో 26 శాతం వృద్ధితో రూ.6,861 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.5,447 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.27,697 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ3లో 19.4 శాతం వృద్ధితో రూ.33,074 కోట్లకు ఎగిసింది. ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన క్యూ3లో వినియోగదారుడి నుంచి సగటు రెవెన్యూ (ఎఆర్‌పియు) 12 శాతం పెరిగి రూ.203.3గా నమోదయ్యిందని తెలిపింది. 2024 డిసెంబర్ ముగింపు నాటికి జియో వినియోగదారుల సంఖ్య 48.2 కోట్లుగా ఉందని తెలిపింది.

వడ్డీ రేట్లు తగ్గితేనే ఆర్థిక వ్యవస్థకు మద్దతు : డ్యూష్ బ్యాంక్

న్యూఢిల్లీ : భారత్‌లో వడ్డీ రేట్లు తగ్గితేనే ఆర్థిక వ్యవస్థకు మద్దతు లభించనుందని డ్యూష్ బ్యాంక్ తెలిపింది. వడ్డీరేట్ల కోతల్ని ఆలస్యం చేసిన కొద్దీ దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతుందని హెచ్చరించింది. వచ్చే నెలలో జరిగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును కనీసం 25బేసిస్ పాయింట్ల వరకు తగ్గించాల్సిన అవసరం ఉందని డ్యూష్ బ్యాంక్ నిపుణులు సూచించారు. ప్రస్తుతం రెపోరేటును తగ్గించకపోతే భవిష్యత్తులో జీడీపీ వృద్ధి మరింత పడిపోనుందని హెచ్చరించారు. వచ్చే ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో ఆర్బీఐ 0.25 శాతం చొప్పున కీలక వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా రెపోరేటు 6 శాతానికి దిగిరావొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఇన్ఫోసిస్ లాభాల్లో 11.5 శాతం వృద్ధి



బెంగళూరు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో దిగ్గజ ఐటి సేవల కంపెనీ ఇన్ఫోసిస్ 11.46శాతం పెరుగుదలతో రూ.6,806 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 6,106 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 7.58 శాతం పెరిగి రూ.41,764 కోట్లకు చేరింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.38,821 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. గడిచిన క్యూ3లో కంపెనీ నిర్వహణ లాభాల్లో 21.3 శాతం వృద్ధి సాధించింది. క్లయింట్లకు దగ్గర కావడంపై దృష్టి కేంద్రీకరించామని ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ తెలిపారు. వైవిధ్యభరితమైన డిజిటల్ ఆఫరింగ్స్‌తో విజయం సాధించగలమని చెప్పడానికి తమ ఆర్థిక ఫలితాలే నిదర్శనమన్నారు. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీలో కొత్తగా 5,591 మంది ఉద్యోగులు చేరారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,23,379 మందికి చేరుకుందని ఆ కంపెనీ తెలిపింది.

స్కాలర్స్‌కు కోటక్ ఫౌండేషన్ ప్రోత్సాహం

నవతెలంగాణ- హైదరాబాద్

యువత తమ శక్తియుక్తులను సరైన విధంగా ఉపయోగిస్తే నాయకులుగా ఎదుగుతారని కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ విద్య స్కాలర్‌షిప్‌ల డైరెక్టర్ జయశ్రీ రమేష్ పేర్కొన్నారు. అందుకోసం కావాల్సిన ప్రోత్సాహాన్ని అందించేందుకు ఆసంస్థ ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాన్ని గచ్చిబౌలిలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. "ది పవర్ ఆఫ్ యు: ట్రాన్స్ ఫార్మింగ్ పొటెన్షియల్ ఇన్ లీడర్ షిప్" అనే అంశంపై కోటక్ కన్యా స్కాలర్స్, కోటక్ శిక్షా నిధి విద్యార్థులతో చర్చా కార్యక్రమం ఉత్సాహంగా జరిగిందని జయశ్రీ తెలిపారు. ప్రతిష్టాత్మక నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) సంస్థల్లో అభ్యసిస్తున్న కోటక్ శిక్షా నిధి విద్యార్థులు, కోటక్ కన్యా స్కాలర్స్‌కు పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులతో చర్చించడం ద్వారా సాధికారత దిశగా అడుగులు వేసే సదవకాశం లభించిందన్నారు. విద్యారంగంతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేలా స్కాలర్స్ విద్యార్థులు వక్తలతో తమ అభిప్రాయాలను పంచుకునే చక్కటి వేదికగా నిలిచిందన్నారు. రేపటి నాయకులుగా ఎదగడానికి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని వివరించారు.

సీనియర్ లివింగ్ హౌసింగ్‌లోకి స్టోన్‌క్రాఫ్ట్

హైదరాబాద్ : ప్రముఖ ఇంటిగ్రేటెడ్ బయోఫిలిక్ రియల్ ఎస్టేట్ డెవలపర్ అయిన స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ హైదరాబాద్‌లో తమ మొదటి లగ్జరీ, ప్రీమియం అసిస్టెడ్ లివింగ్ ప్రాజెక్ట్‌తో అసిస్టెడ్ లివింగ్ (సీనియర్ లివింగ్) విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్ నగరంలోని అతిపెద్ద, అత్యంత ప్రీమియం సీనియర్ లివింగ్ ప్రాజెక్ట్‌గా నిలువనుందని స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ వ్యవస్థాపకుడు అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి చిలుకూరి తెలిపారు. యాదగిరిగుట్టలో వ్యూహాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్ట్ సీనియర్ సిటిజన్‌లకు సకల సౌకర్యాలు అందించనుందన్నారు. గతంలో తమ సంస్థ హైదరాబాద్‌లో 10 లక్షల చదరపు గజాల ప్లాట్ డెవలప్‌మెంట్‌లతో పాటు తొలి మియావాకీ ఫారెస్ట్, వుడ్స్ శంషాద్ వంటి ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌లను అందించిందన్నారు.

బంగారం ధర భగభగ



ముంబయి : బంగారం ధర భగభగమంటోంది. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ భారీగా పతనం కావడం, ఆభరణాల వర్తకులు, రిటైలర్ల నుంచి డిమాండ్ పెరగడంతో బంగారం, వెండి ధరలు మరింత పెరిగాయి. గురువారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.500 పెరిగి రూ.81,300లకు చేరింది. ఆభరణాలను తయారు చేసేందుకు వినియోగించే 99.5శాతం స్వచ్ఛత గల బంగారంపై కూడా రూ.500 పెరిగి రూ.80,900 వద్ద నమోదయ్యింది.

కిలో వెండి ధర రూ.2,300 పెరిగి రూ.94వేలకు చేరింది. ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ పతనం కావడంతో ఎంసిఎక్స్‌లో బంగారం ధర రూ.79వేల ఎగువన ట్రేడ్ అవుతున్నదని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ అనలిస్ట్ వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రివేది తెలిపారు. ముడి చమురు ధరలు పెరిగిపోవడంతో పాటు దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు ఉపసంహరించడంతో రూపాయి విలువ పతనమైంది.

జ్యుడిషియల్ కమిషన్లు

ఏర్పాటు చేయాల్సిందే

రాజకీయ ఖైదీలను విడుదల చేయండి : ప్రభుత్వానికి సమర్పించిన డిమాండ్ల పత్రంలో పీటీఐ

ఇస్లామాబాద్: ప్రభుత్వంతో మూడో రౌండ్ చర్చల కోసం పాకిస్తాన్ తెహ్రీక్- ఎ- ఇన్సాఫ్ (పీటీఐ)డిమాండ చార్టర్‌నొకదానిని సమర్పించింది. తాము గుర్తించిన రాజకీయ ఖైదీలను విడుదలజేయాలని, మే9 నాటి హింసాత్మక ఘటనలపై రెండు జ్యుడిషియల్ కమిషన్లు వేయాలని, ఇందులో పాకిస్తాన్ చీఫ్ జస్టిస్, లేదా ముగ్గురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, పీటీఐ, ప్రభుత్వ ప్రతినిధులు ఉండేలా చూడాలని గురువారం లిఖితపూర్వకంగా సమర్పించిన మూడు పేజీల డిమాండ్ల పత్రంలో పేర్కొన్నారు. ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్‌తో రెండు రోజుల క్రితం పెషావర్‌లో సమావేశమైన పిటిఐ చైర్మన్, బారిస్టర్ గొహర్ అలీఖాన్ గురువారం అడియాలా జైలులో ఉన్న తమ పార్టీ నేత ఇమ్రాన్‌ఖాన్‌ను కలుసుకుని చర్చల వివరాలను ఆయనకు నివేదించారు. జ్యుడిషియల్ కమిషన్లను వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని, లేకుంటే చర్చలకు దూరంగా ఉంటామని పీటీఐ చైర్మన్ హెచ్చరించారు. మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను విడుదలజేయాలని కోరుతూ నవంబరులో దేశవ్యాపితంగా నిరసన ర్యాలీలు హోరెత్తడంతో రాజకీయ ఉద్రిక్తతలను తగ్గించడం కోసం ప్రభుత్వం, సైన్యం ఒక మెట్టు దిగొచ్చి పీటీఐ నేతలతో చర్చలకు సిద్ధమైంది.



అమెరికా తాజా ఆంక్షలతో

పెరిగిన ప్రపంచ చమురు ధరలు

వాషింగ్టన్ : అమెరికా ఆంక్షలు ప్రపంచ సరఫరాకు అంతరాయం కలిగించవచ్చని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) గతంలో హెచ్చరించింది. రష్యన్ చమురు రంగాన్ని లక్ష్యంగా చేసుకుని అమెరికా కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించిన తర్వాత బుధవారం ప్రపంచ చమురు ధరలు పెరిగాయి. అమెరికా ముడి చమురు నిల్వలు తగ్గడం కూడా దీనికి దారి తీసినట్టు తెలుస్తున్నది. మార్కెట్ సమాచారం ప్రకారం.. బ్రెంట్ ముడి చమురు ఫ్యూచర్స్ రెండు శాతం కంటే ఎక్కువ పెరిగి బ్యారెల్‌కు 82.10 డాలర్లకి చేరుకుంది. ఇది గతేడాది ఆగస్టు తర్వాత అత్యధికం కావటం గమనార్హం. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు (డబ్ల్యూటీఐ) మూడు శాతం కంటే ఎక్కువ పెరిగి బ్యారెల్‌కు 80డాలర్లకు అటుఇటుగా ఉన్నది.

అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ పరిపాలన ఆంక్షలను శుక్రవారం ప్రకటించిన తర్వాత బ్రెంట్ దాదాపు 5 డాలర్లు పెరిగింది. అయితే డబ్ల్యూటీఐ దాదాపు 4 డాలర్లు లాభపడిందని ఇన్వెస్టింగ్.ఇన్ నుంచి వచ్చిన డేటా తెలిపింది.

అమెరికా ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం.. గత వారం అమెరికా ముడి చమురు నిల్వలు 2022 తర్వాత అత్యల్ప స్థాయికి పడిపోయాయి. రాయిటర్స్ ప్రకారం.. హమాస్, ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా చమురు ర్యాలీ పరిమితమైంది. ఇది మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి సంకేతంగా భావించబడింది.

రష్యాపై కొత్త రౌండ్ ఆంక్షలు గాజ్‌ప్రోమ్ నెఫ్ట్ సుర్గుట్నెఫ్టెగాస్ వంటి ప్రధాన రష్యన్ చమురు కంపెనీలను, అలాగే రష్యన్ చమురు రవాణాలో పాల్గొన్న డజన్ల కొద్దీ నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ వారం ప్రారంభంలో ప్రచురించబడిన రాయిటర్స్ విశ్లేషణ ప్రకారం.. ఈ ఆంక్షలు ప్రపంచంలోని చమురు ట్యాంకర్ నౌకాదళంలో పది శాతాన్ని ప్రభావితం చేస్తాయనీ, అనేక నౌకలు ప్రధాన ఓడరేవుల్లోకి ప్రవేశించలేవని సూచించింది. మాస్కో ఈ ఆంక్షలను ఖండించింది. వాటిని చట్టవిరుద్ధమని పేర్కొన్నది. అవి ప్రపంచ ఇంధన మార్కెట్లను అస్థిరపరచవచ్చని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ హెచ్చరించారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ).. రష్యాపై అమెరికా ఆంక్షలు చమురు సరఫరా గొలుసులను గణనీయంగా దెబ్బతీస్తాయనీ, ప్రపంచ వస్తువుల మార్కెట్‌ను కఠినతరం చేయగలవని హెచ్చరించింది.

బొగ్గు కుంభకోణం కేసు...

తప్పుకున్న జస్టిస్ కేవీ విశ్వనాథన్



న్యూఢిల్లీ: బొగ్గు కుంభకోణంపై నమోదు అయిన కేసులపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ కేసుల్ని విచారిస్తున్న ధర్మాసనం నుంచి సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ కేవీ విశ్వనాథన్ తప్పుకున్నారు. ఓ కేసులో తాను లాయర్‌గా వాదించినట్టు ఆయన పేర్కొన్నారు. బొగ్గు స్కామ్‌పై కేసుల విచారణకు కొత్త ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నట్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. సుప్రీం ధర్మాసనంలో జస్టిస్ సంజయ్ కుమార్ కూడా ఉన్నారు.ఫిబ్రవరి 10వ తేదీ నుంచి జరిగే విచారణల కోసం కొత్త త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నట్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. బొగ్గు కుంభకోణాలపై హైకోర్టుల్లో విచారణ చేపట్టరాదు అని గతంలో సుప్రీం పేర్కొన్నది.

కుట్టు మిషన్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-చర్లపల్లి

చర్లపల్లి డివిజన్ పరిధిలోని పారిశ్రామిక ఏరియా లో రోటరీ క్లబ్ కంపెనీ లో ప్రముఖ పారిశ్రామిక వేత్త బబ్బురి బాలరాజు గౌడ్ ఆధ్వ ర్యంలో 20 మంది మహిళ లకు కుట్టు మిషన్ లను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ వారికి అభినందనలు తెలిపారు. ఇవి మహిళకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ లాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



నవతెలంగాణ-కీసర

రేషన్ కార్డుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా అధికారులను ఆదేశించారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డుల్లో ఆహార భద్రత కార్డుల (రేషన్ కార్డు) వెరిఫికేషన్ ఇంటింటి సర్వేను రాధికా గుప్తా పరిశీలించారు. రేషన్ కార్డుల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ యస్.భాస్కర్ రెడ్డి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగించుకోవాలి



- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అనారోగ్యంతో బాధపడుతూ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న వారు ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ బ్యాంకు కాలనీకి చెందిన బి.బాలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి ఎమ్మెల్యే ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం సాంక్షన్ అయిన రూ.23 వేల ఐదు వందల చెక్ ఎల్ఓసీ పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులు బి.బాలమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేరేడ్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జేకే సాయి గౌడ్, రాజేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం



నవతెలంగాణ-బోడుప్పల్

చెంగిచర్ల ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం(నేడు) డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ చెంగిచర్ల డిపో మేనేజర్ కే. కవిత గురువారం తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపో పరిధిలోని ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు తెలియచేసేందుకు గాను డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ రోజు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు 7893088433 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. చెంగిచర్ల డిపో పరిధిలోని వివిధ రూట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సూచనలు స్వీకరిస్తామన్నారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నవతెలంగాణ-శామీర్‌పేట



శుక్రవారం మధ్యాహ్నం 3 మూడు గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు హకీంపేట్ డిపో మేనేజర్ భావభూతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిధిలోని ప్రయాణికులందరూ తమ సందేహాలను, సమస్యలను హకీంపేట్ డిపో మేనేజర్ దృష్టికీ తీసుకురావడానికి ఈ అవకాశం కల్పిస్తున్నామని దీనిని సద్విని యోగం చేసుకోవాలని ఆయన సూచించారు. డయల్ యువర్ డీఎంకీ సంప్రదించడానికి 9959226144 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

పసుపు బోర్డుతో రైతులకు మేలు

- ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మహేందర్ యాదవ్

నవతెలంగాణ-జవహర్‌నగర్

తెలంగాణ రైతాంగానికి సంక్రాంతి కానుకగా మోడీ ప్రభుత్వం పసుపు బోర్డు ఇచ్చారని మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేందర్ యాదవ్ అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు, లక్షలాది మందికి మేలు అవుతుందని, వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు. రైతుల పక్షపాతిగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తెలంగాణ సాధనలో కీలక భూమిక పోషించిన నాయకుడు జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయనకి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేంనరేందర్ రెడ్డితో కలిసి నెక్లెస్ రోడ్డులో వారి స్మారకానికి పులు వేసి నివాళులర్పించారు. నవతెలంగాణ-కాప్రా

తెలుగు జాతికి జాతీయ స్థాయిలో పేరు తెచ్చిన గొప్ప నాయకులు జైపాల్ రెడ్డి

- డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

నవతెలంగాణ-జవహర్‌నగర్

తెలుగు జాతికి జాతీయ స్థాయిలో పేరు తెచ్చిన గొప్ప నాయకులు జైపాల్ రెడ్డి అని జవహర్‌నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన 83వ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలు పెంచి, రాజకీయానికి విలువలు నేర్పి, ఈ తరం నాయకులకే కాకుండా, నిరంతరం ఆదర్శమూర్తిగా నిలిచిన ఉత్తమ పార్లమెంటేరియన్ జైపాల్ రెడ్డి అని కొనియాడారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్‌కు సత్కారం



నవతెలంగాణ-శామీర్‌పేట

శామీర్‌పేట మండలం పొన్నాల గ్రామంలో గురువారం రేణుక ఎల్లమ్మ పండగ సందర్భంగా ఎల్లమ్మ తల్లి కల్యాణానికి మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, మాజీ సర్పంచ్ సురేందర్, మాజీ ఉపసర్పంచ్ జైపాల్ రెడ్డి విచ్చేశారు. వారిని పొన్నాల మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం రమేష్ శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీ పల్లి మండల కాంగ్రెస్ నాయకులు శశిధర్ రెడ్డి, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యోగ్యమైనదా.. కానిదా..గుర్తించాలి

- మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-కీసర

జీపీఆర్ మ్యాప్ ద్వారా పరిశీలిస్తూ క్షేత్రస్థాయి పర్యటనలు చేసి భూమి వ్యవసాయం యోగ్యమైనదా, కానిదా అని కచ్చితంగా గుర్తించాలని మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కీసర తహశీల్దార్ కార్యాలయంలో గ్రామాలలో సర్వే నంబర్ల వారిగా వ్యవసాయ, వ్యవసాయేతర భూమలను గుర్తించే క్షేత్రస్థాయి పర్యటనల వివరాలను జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీపీఆర్ మ్యాప్ ద్వారా పరిశీలిస్తూ క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి వ్యవసాయం యోగ్యమైనదా, కానిదా అని కచ్చితంగా గుర్తించాలని తెలిపారు. గ్రామాల వారీగా నిర్వహించే తనిఖీల నివేదికలను క్షుణ్ణంగా పరిశీలి ంచి సమగ్ర నివేదికను తయారు చేసి డాటా ఎంట్రీకి ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పరిశీలించాల్సిందే అని కలెక్టరు స్పష్టం చేసారు. అవసరమైన చోట సర్వేయర్ల ద్వారా సమాచారం సేకరించి లే అవుట్లు, నాలాగా మార్చిన భూము లను, ఇండస్ట్రీలకు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా సేకంచాలని కలెక్టరు సిబ్బందికి సూచిం చారు. అనంతరం కలెక్టరు మ్యాప్ ద్వారా చీర్యాల, గోధుమకుంట గ్రామాల సర్వే నంబర్ల ద్వారా పరిశీలించి అవసరమైన సలహాలను, సూచనలను వివరించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, కీసర తహశీల్దారు అశోక్ కుమార్, ఆర్ఐలు, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బొంతు శ్రీదేవి యాదవ్ గురువారం చర్లపల్లి డివిజన్ లోని వివిధ కాలనీలలో థీమ్ పార్క్‌లోని పెండింగ్ పనులు, పార్కుల అభివృద్ధి కోసం యూబీడీ అధికారులు కాప్రా సర్కిల్ మేనేజర్ లోకేష్ కుమార్, చర్లపల్లి డివిజన్ సూపర్వైజర్ నరేష్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. నవతెలంగాణ-చర్లపల్లి

బీసీ కమిషన్ చైర్మెన్‌ను కలిసిన పంజాగారి ఆంజనేయులు

నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర రజక సంఘాల జేఏసీ చైర్మెన్ పంజాగారి ఆంజనేయులు గురువారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో చాకలి, రజక అనే పదాలు ఉంచి దోబి అనే పేరును తొలగించాలని కోరినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఇతర రాష్ట్రాలకు చెందిన దోబీలు కార్పొరేట్ సంస్థల పేరుతో లాండ్రీలు, దోబీ లెట్లు పేరుతో చలామణి అవుతున్నారని తెలిపారు. దానివల్ల రాష్ట్రంలోని రజక జాతి ఉనికిని కోల్పోవాల్సి వస్తుందని వెంటనే ధోబి పదాన్ని తొలగించాలని వివరించినట్టుగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వర్గంటి విట్టల్, జిల్లా ఉపాధ్యక్షులు మలిగ యుగపతి, జంగయ్య, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గుండాల శ్రీనివాస్ రంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, పాండు, శ్రీనివాస్ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు

- ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం నుంచి రాష్ట్రంలో రైతులకు ఎకరాకు రూ.6వేల రైతు భరోసా, అర్హులకి ఇండ్ల స్థలం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం అమలుపరుస్తుందని రాష్ట్ర చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలో రూ.44కోట్ల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ప్రారంభం ప్రారంభించారు. అంతకు ముందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్ యాదవ్‌తో కలిసి కేంద్ర మాజీ మంత్రి దివంగత నేత సూదిని జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ వాహనంలోనే ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వచ్చి ఆయన వాహనంలోనే తిరుగుతూ పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడం పట్ల పలువురు బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు ఆసక్తిగా చర్చించుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసిన లంచ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ హాజరవడంపై పలువురు ఆసక్తిగా గమనించారు. ఈ సందర్భంగా రూ.38 కోట్ల అమృత్ పథకం నిధులతో 5 మంచినీటి ట్యాంకులు, రూ.6కోట్ల నిధులతో అంతర్గత సీసీ రోడ్లు, యూజీడీలు, రూ.25లక్షల నిధులతో తుమ్మ చెరువు కట్టకు కంచె పనులను తదితరాలను చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలలో ఎకరాకు రూ.6వేలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు పథకాలు అమలు చేయబోతున్నామని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఎక్కడ లేని విధంగా అమలవుతాయాన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, జిల్లా గ్రంధాల సంస్థ చైర్మెన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రం రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జగన్ గౌడ్, ఆయా పార్టీల మండల అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, వేముల శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ యాదవ్, రమణారెడ్డి, శ్రీశైలం యాదవ్, శైలజ హరినాథ్, అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు, కమిషనర్ నాగిరెడ్డి, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కార్యకర్త జమ్మిగడ్డ వాస్తవ్యులు భూపతి రెడ్డి పెద్దకర్మ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ అధ్యక్షులు కాసమైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, సీనియర్ నాయకులు బేతాళ బాలరాజు, రాజిరెడ్డి, గుమ్మడి రాజు యాకయ్య, ఎస్కే రహీం, సాంబ శివరెడ్డి, కృష్ణ, గిరి, గడ్డం శీను, ఓట్ల మొగిలయ్య, ప్రమోద్ ఆయనకు నివాళులర్పించారు.

నవతెలంగాణ-కాప్రా

పేదలకు ఒక న్యాయం... పెద్దలకు ఒక న్యాయమా ?

- కో ఆప్షన్ సభ్యురాలు శ్వేతా ముఖేష్





నవతెలంగాణ-జవహర్‌నగర్

పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు ఒక న్యాయమా.. అని కో ఆప్షన్ సభ్యురాలు శ్వేతా ముఖేష్ అన్నారు. జవహర్‌నగర్ ప్రధాన రహదారి పై అక్రమంగా నిర్మిస్తున్న కమర్షియల్ షెట్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నివాసంలో దొంతగాని శాంతి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డాకు నాయక్‌లకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలు రాత్రి రాత్రికే వెలుస్తున్నాయని అటువంటి వాటిపై ఉన్నత అధికారులకు పిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. జవహర్‌నగర్ గ్రేటర్ హైదరాబాద్‌లో కలుస్తుందని కొందరు కార్పొరేటర్లు బినామీ వ్యక్తులతో ప్రధాన రహదారిపై అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వాటిపై చర్యలు తీసుకొకపోగా పేద ప్రజలు 60 గజాలలో నిర్మిస్తున్న రేకుల నిర్మాణాలను తొలగిస్తున్నారు. పేదలకు ఒక న్యాయం పెద్దలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బడా బాబుల నిర్మాణాలను తొలగించాలన్నారు.

యువతి ఆత్మహత్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని యువతీ ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీ నగర్, శ్రీరాంనగర్ కాలనీలో ఉంటున్న రమావత్ వేణు హాసిని (17) గత కొద్ది కాలంగా హాసిని మైగ్రేన్ (తలనొప్పి)తో బాధపడుతు ఇంటి దగ్గర ఉంటుంది. గురువారం ఉదయం చదువుకుంటానని ఇంటి పైకి వెళ్లి తిరిగి కిందకు రాకపోవడంతో హాసిని తాత బాలు నాయక్ పైకి వెళ్లి చూడగా లోపలి నుండి గడియ పెట్టి ఉండడంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా వేణు హాసిని చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉన్నది. వెంటనే కిందికి దింపి దగ్గరలో గల మీనాక్షి హాస్పిటల్‌కి తీసుకెళ్లగా సీరియస్‌గా ఉందని చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం ఏఎస్‌రావు నగర్‌లో పాలోమి హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది. హాసిని తాత బాలు నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తాం



- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-కీసర

ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం నాగారం మున్సిపల్ పరిదిలోని రాంపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.43. (కోటి నలబై మూడు లక్షలు)లతో నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆయన మేడ్చల్ శాసన సభ సభ్యులు చామకూర మల్లారెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అర్బన్ హెల్త్ సెంటర్, బస్తీదవఖాన, డైయగ్నస్టిక్ సెంటర్‌లను కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందన్నారు. మున్సిపాలిటీలను, కార్పొరేషన్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి ప్రణాళికలను రచించలేదన్నారు. ఈ కార్యక్రమములో కమిషనర్ ఎస్ భాస్కర్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ బండారి మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్‌లు గోక కళావతి యాదగిరి, పంబల్ల సరితా రమేష్, బి.లక్ష్మీ వేణుగోపాల్, కౌకుంట్ల అనంత్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు క్యాసారం అశోక్ గౌడ్, నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, నాగారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఎలసాని నాగరాజు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు గండి అంజయ్య గౌడ్, వరకాల పెంటయ్య గౌడ్, గూడూరు ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు చేస్తే సహించేది లేదని కాప్రా తహశీల్దార్ సుచరిత హెచ్చరించారు. గురువారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అరుంధతి నగర్, మల్కారం 706, 434, 445 సర్వే నంబర్లలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను సుచరిత ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల్లో కొందరు భూ కబ్జాదారులు నోటరీ కాగితాలను సృష్టిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఇకపై అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయేంద్ర సాయి, రమేష్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం



నవతెలంగాణ-మేడ్చల్

ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డికి గురువారం మేడ్చల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవంలో నిరసన సెగ తగిలింది. పదేండ్లలో అధికారంలో ఉన్న మీరు మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి ఏం అభివృద్ధి చేశారంటూ బీజేపీ నేత పాతూరి సుధాకర్ రెడ్డి మల్లారెడ్డిని నిలదీయడంతో ఒక్కసారిగా పరిస్థితి వేడెక్కింది. దీంతో మల్లారెడ్డి ఆగ్రహంతో అసభ్య పదజాలం వాడుతూ ఇక్కడి నుంచి నువ్వు వెళ్లిపో అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీనిపై బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వాగ్వాదం ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలోనే జరగడం గమనర్హం. ఆ తర్వాత ఎమ్మెల్యే మల్లారెడ్డి తన వాహనంలో వెళ్లిపోగా ఎంపీ ఈటల రాజేందర్ నూతనంగా నిర్మాణం చేపడుతున్నా ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో మందుల కొరత,ఇతర సమస్యలు ఉన్నాయని పలువురు ఎంపీకి ఫిర్యాదు చేయడంతో రావడంతో వాటిని పరిష్కరించాలని డీఎంహెచ్ వో డాక్టర్ రఘునాథ స్వామికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

నగర తొలి మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు.

నవతెలంగాణ-కాప్రా



లక్ష డప్పులు, వేల గొంతుల ప్రదర్శనను విజయవంతం చేయాలి

- ప్రముఖ కవి గాయకులు దరువు అంజన్న



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఫిబ్రవరి 7న హైదరాబాదులో జరిగే లక్ష డప్పులు, వేల గొంతులు మహా ప్రదర్శనకు బీసీ కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు వేలాదిగా తరలి రావాలని ప్రముఖ కవి గాయకులు దరువు అంజన్న పిలుపునిచ్చారు. గురువారం జవహర్‌నగర్‌లో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ జెండా ఊపి లక్ష డప్పులు వేల గొంతులు మహా ప్రదర్శన రాష్ట్రయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజన్న మాట్లాడుతూ. 30 ఏండ్ల పోరాట ఫలితం ఎస్సీ వర్గీకరణ అమలు దగ్గరలోనే ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అధికారికంగా దీనిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణ అనేది ప్రజాస్వామిక మైనటువంటి హక్కుని మందకృష్ణ మాదిగ 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటం చాలా గొప్పదని కొనియాడారు. ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ మోహన్ బైరాగి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు సైతం వర్గీకరణ అమలు చేయాలని కోరిందని కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీని వెంటనే అధికారికంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఈ యాత్రను జిల్లాలలో మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రాంతి కళా బృందం రాష్ట్ర అధ్యక్షులు వెంకటాచారి, తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షులు వడ్డెర నరసింహ, తెలంగాణ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రవీణ్ యాదవ్, మహాజన వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర కో కన్వీనర్ డప్పు రామస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ప్రణయ్ మాదిగ, కార్యదర్శి వడ్డేపల్లి శివ కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి కొయ్యడ వెంకటేష్ మాదిగ, జవహర్‌నగర్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు ఏనూతుల నగేష్ మాదిగ, ఆనంద్ మాదిగ, విక్రమ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

లక్షన్నర పలికిన వెంకటేశ్వర స్వామి లడ్డు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండలం రాజబొల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘనపూర్ క్షేత్రగిరి శ్రీవెంకటేశ్వర స్వామి లడ్డు గురువారం నిర్వహించిన వేలం పాటలో రాజబొల్లారం తండాకు చెందిన గన్యా రమేష్ నాయక్ రూ.1లక్ష 50వేలకు దక్కించుకున్నారు. ప్రతి ఏటా సంక్రాంతి తర్వాత రెండవ రోజు కనుమ సందర్భంగా వెంకటేశ్వర స్వామి జాతర నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమంలో మలోత్ రవి నాయక్, వెంకట్, శ్రీను, రఘురాం రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ-నాగోల్

నాగోలు డివిజన్‌లోని బండ్లగూడ ఆర్టీసీ డిపోలో శుక్రవారం (నేడు) ప్రయాణికుల అభిప్రాయాలు, సలహాలు, సూచనల కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బండ్లగూడ టీజీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ టి. వెంకటేశం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు గంట పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో బండ్లగూడ ఆర్టీసీ డిపో బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణికులు బస్సుల వేళలు మరియు మార్పులు, చేర్పుల కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పాల్గొని 9959 224058 నెంబర్‌కు ఫోన్ ద్వారా సలహాలు, సూచనలు, ఫిర్యాదులు అందించాలని డిపో మేనేజర్ చెప్పారు. వారిచ్చిన సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని అమలుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పొక్సో కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష

బాధితురాలికి రూ.5లక్షల పరిహారం



నవతెలంగాణ-హయత్ నగర్

మైనర్‌ను కిడ్నప్ చేసి, ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తికి 20 సంవత్సరాల జైల్ శిక్ష పడింది. సరూర్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రీన్ పార్క్ కాలనీలో నివాసం ఉంటున్న ఆకుల నరేష్..ఇతని స్వస్థలం వెల్దండ మండలం, నాగర్ కర్నూలు జిల్లా. ఇతడు మెస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని వద్ద కూలి పని చేస్తున్న మైనర్ బాలికను కిడ్నప్ చేసి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన కేసులో 2017లో సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ పూర్తి ఆధారాలతో గురువారం నిందితుడికి 20 సంవత్సరాల జైల్ శిక్ష, 30వేల జరిమానాతో పాటు బాధితురాలికి రూ.5లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోర్ట్ ఆదేశించింది.



హామీల అమలు కోసం
కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం ఎంతో కృషి చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు రూ. 45కోట్ల నిధులతో చేపట్టిన



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను స్థానిక మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డితో కలిసి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి చేశారు. తర్వాత బట్టేల్ గుట్ట పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించి, కోట బురుజుపై ఉన్న అహ్లాదకరమైన వాతావరణాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, కమిషనర్ సరస్వతి, డీఈఈ జ్యోతి, నరసింహ రాజ్, ఏఈ వినీల్ గౌడ్, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, బండారు మనోహర్, రాళ్ళగూడెం సంతోషి శ్రీనివాస్ రెడ్డి, బాలు నాయక్, ఎర్ర మహేశ్వరి జైహింద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో
విద్యా రంగంలో సంస్కరణలు సాధ్యమే

డిఫెన్స్ పరిశోధన విభాగం మాజీ సెక్రటరీ డాక్టర్ సతీష్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్యాలికులేటర్లు వచ్చిన మొదట్లో ఇక మనిషి తెలివితేటలకు పనివుండదని విమర్శించిన రోజుల్లోనే కంప్యూటర్లు వచ్చాయని, వీటితో మనుషులకు ఉద్యోగాలు దొరకవని అన్నారని, ఈరోజు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ) ద్వారా ప్రపంచంలోనే అద్భుతాలు సృష్టించే రోజులు వచ్చాయని, తక్కువ అంచనా వేసుకునేదానికన్నా మనిషి ఎప్పుడూ ప్రగతివైపు ఆలోచిస్తూ ముందడుగు వేయాలని ఏరోనాటికల్ సొసైటీ అఫ్ ఇండియా ప్రెసిడెంట్, రక్షణశాఖ పరిశోధన అభివృద్ధి మాజీ సెక్రటరీ డాక్టర్ సతీష్ రెడ్డి అన్నారు. లో అండ్ మిడిల్ ఇన్ కమ్ దేశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా విద్యారంగంలో తీసుకుని రావాల్సిన సంస్కరణలపై ప్రపంచబ్యాంక్ ప్రతినిధులు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ సహకారంతో ఏర్పాటు చేసిన సమావేశం గురువారం గచ్చిబౌలి లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ సమావేశంలో ప్రపంచ బ్యాంకు అనలిటిక్స్ అండ్ రీసర్చ్ టీమ్ ఆర్థికవేత్త డాక్టర్ శారదా శ్రీనివాసన్ పాల్గొని ఏఐ ద్వారా విద్యారంగంలో తీసుకుని రావాల్సిన విషయాలను చర్చించారు. ప్రపంచంలోనే భారతదేశం యువత జనాభాలో అగ్ర భాగాన ఉందని, ఏటా సుమారు నాలుగున్నర కోట్ల మంది హై స్కూల్ వరకు చేరుకుంటున్న విద్యార్థులకు టక్నాలజీ ప్రాధాన్యాలను వివరించడం వలన విద్యారంగంలో గొప్ప ప్రగతిని సాధించవచ్చున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 1500 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏటా ఒకటిన్నర లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతున్నారని, టెక్నాలజీ రంగంలో విద్యార్థులు అవగాహన ఏర్పరుచుకున్నపుడు ప్రపంచంలోనే భారతదేశానికి ఏ దేశం పోటీ రాదన్నారు. ఏఐ ద్వారా టీచింగ్, లెర్నింగ్‌లో సమూల మార్పులు తీసుకురావచ్చన్నారు. కేవలం బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోనే సుమారు 20 వేల మంది ఏఐ రంగంలో పనిచేస్తున్న సిబ్బంది ఉన్నారని, వీరి సేవలు కూడా విద్యారంగ సంస్కరణలకు ఉపయోగించుకోవాలని అన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ పూర్వ విద్యాశాఖ మాత్యులు డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో చదివే పిల్లలకు కంప్యూటర్ అవగాహన కల్పించి తెలుగుతో పాటుగా అద్భుతమైన ఇంగ్లీష్ మాట్లాడ గలిగే విద్యార్థులుగా ఆ రాష్ట్ర విద్యార్థులను తక్కువ కాలంలో తయారు చేయగలిగామని, కృత్రిమ మేధ ద్వారా టీచర్ ట్రైనింగ్, సిలబస్ మార్పులు, బోధనా పద్ధతులు అన్నింటిలో కూడా మార్పులు సాధ్యమని నిరూపించామన్నారు.



డాక్టర్ మృత్యుంజయప్ప మాట్లాడుతూ విద్యార్థుల్లో 40 శాతం మంది సాంకేతికత వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోలేక పోతున్నారన్నారు. కృత్రిమ మీద ద్వారా ఆపరేషనల్ ఎఫిషియన్సీ అంటే, ప్రశ్నా పత్రాల రూపకల్పనలో, హైపర్ పర్సనలైజ్డ్ లర్నింగ్, బిజినెస్ మోడల్ తదితర వాటి ద్వారా మార్పులు సాధ్యమన్నారు. సమావేశంలో పాల్గొన్న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టరో డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ బోధనారంగంలో కృత్రిమ మేధను ఉపయోగించుకుని ప్రాథమిక విద్యా దశలోనే ఎన్ రోలెమెంట్ శాతాన్ని పెంచవచ్చని, క్వాలిటీ ఎడ్యుకేషన్ కూడా సాధ్యమని అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ యు. చంద్ర శేఖర్ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన మేధావి వర్గానికి చెందిన డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఓరా, డాక్టర్ మృత్యుంజయప్ప, డాక్టర్ సత్య, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ లోహిత్, శశిధర్, సునీత ఆనంద్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లిలో రేషన్ కార్డుల ఇంటింటి సర్వే



కౌన్సిలర్ బుడుమాల యాదగిరి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

కొత్త రేషన్ కార్డుల సర్వేకు ప్రజలు సహకరించాలని జల్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్ బుడుమాల యాదగిరి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన నూతన రేషన్ కార్డుల ఇంటింటి సర్వేను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ యాదగిరి మాట్లాడుతూ గత ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న 10 సంవత్సరాల కాలంలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేసి పాపాన పోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలోనే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డులు లేకపోవటం వలన ఎంతో మంది పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్త రేషన్ కార్డులను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ అధికారి శ్రీనివాస్, శానిటేషన్ సూపర్వైజర్ కుమార్, సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నవతెలంగాణ-హయత్‌నగర్

డివిజన్‌లోని సూర్యనగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌తో కలసి కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్ నగర శివారులో ఉండడం వలన డివిజన్లో మౌలిక వసతుల కొరత చాలా ఉందన్నారు. చాలా కాలనీల్లో సీసీ రోడ్ల సదుపాయం లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హయత్ నగర్ డివిజన్ అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించాలని కమిషనర్‌ను కోరినట్టు తెలిపారు. వారి వెంట డిప్యూటీ కమిషనర్ యాదయ్య, డీఈ దామోదర్, ఈఈ ఆశాలత, హేము, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను, కాలనీవాసులు ఉన్నారు.



ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి



- ప్రజా సమస్యలను పరిష్కరించండి
- ఎమ్మెల్యే బలాల

నవతెలంగాణ-మలక్‌పేట్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బలాల అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జీహెచ్ఎంసీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించి, పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా అసంపూర్తిగా నిలిచిన పనులపై శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. మురుగు డ్రైనేజీలపై మూతలు లేని చోట సిమెంట్‌తో బల్లలు వేసి మూసివేయాలని అన్నారు. నియోజకవర్గంలో పలుచోట్ల కమ్యూనిటీ భవనాలు, సిమెంటు రోడ్ల ఏర్పాటుకు అంచనాలు వేసి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. బుధవారం రాత్రి ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన నిధులు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని 56 మందికి సంబంధించిన రూ 23.96 లక్షలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కో కార్పొరేటర్ షఫీ, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి చేయూత



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

అబ్దుల్లాపూర్ మెట్ మండలం, పసుమాముల గ్రామానికి చెందిన రైతు చెట్టి లింగం గౌడ్ 14 అక్టోబర్ 2024న మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు విషయం తెలుసుకున్న బాటసింగారం రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు చేగూరి భరత్ కుమార్ వెంటనే స్పందించి.. లింగం గౌడ్ కుటుంబ సభ్యులకు గురువారం 25 వేల రూపాయల చెక్కును అందజేసి చేయూతను అందించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘం నిరంతరం రైతుల సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. అకాల మరణం చెందిన రైతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందచేస్తూ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మెన్ నార్లకొండ మల్లమ్మ జంగమయ్య, డైరెక్టర్లు గుండె బాలనర్సమ్మ, గంటా శ్రీనివాస్ రెడ్డి, యాదిరెడ్డి, మేకల రాములు, జైపాల్ రెడ్డి, నాయకులు నార్లకొండ జంగమయ్య, మేనేజర్ జక్కుల ఐకేష్, రైతు కుమారుడు కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

గాయత్రి నాట్య విలాసం మనోహరం

నవతెలంగాణ-కల్చరల్



ప్రముఖ నాట్య గురువు సుజాతా మూర్తి శిష్యురాలు గాయత్రి కాట్ర పల్లి కూచి పూడి నాట్య రంగ ప్రవేశం శ్రీ సిద్ధ కృష్ణ కూచిపూడి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడెమీ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై గురువారం జరిగింది. తొలి అంశంగా గాయత్రి తన నాట్యాన్ని ప్రఖ్యాత నాట్య గురువు డాక్టర్ శోభా నాయుడు రూపకల్పన చేసిన గణేశ స్తుతితో ఆరంభించి నారాయణ తీర్థ తరంగం అలోకలే బాల కృష్ణంను లయ బద్ధంగా నర్తించారు. సిద్దేంద్ర యోగి విరచిత భామా కలాపం లోని ప్రవేశ దరువు భామనే సత్య భామనే అంశంలో గాయత్రి పాదముద్రలు అభినయనం లోనూ పరిణత ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శివ స్తుతి భో శంభో అంశంలో ముద్రలు అభివ్యక్తి ప్రశంసనీయం. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ నాట్య గురువు సలాది మృణాళిని పాల్గొని మాట్లాడుతూ గురువు సుజాత నాట్య ప్రతిభ గాయత్రి నాట్యంలో ప్రస్ఫుటం అయినదని ఉత్తమ గురువుకు ఉత్తమ శిష్యులు వుండటం ఇరువురి అదృష్టం అని అభినందించారు. మృదంగ కళా కారుడు రఘునందన్ కూచిపూడి నాట్య కళాకారిణి ఊర్వశి సతీష్ నర్తకి గాయత్రికి అభినందనలు తెలిపారు. గాయత్రి తన కుటుంబ సభ్యులు తాత కె కె గుప్తాలతో కలిసి గురువు సుజాతను సత్కరించారు.

తెలుగు వ్యాకరణ సిద్ధాంత కర్త చిన్నయ సూరి

నవతెలంగాణ-కల్చరల్



తెలుగు భాషా వ్యాకరణంను సులభ శైలిలో అందించిన చిన్నయ సూరి వ్యాకరణ సిద్ధాంత కర్త అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ కోలేటి దామోదర్ అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా పరవస్తు చిన్నయ సూరి యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొలెటి దామోదర్ మాట్లాడుతూ తెలుగు భాషవికాసానికి సూరి రచనలు దోహదం చేశాయన్నారు. బాలల కథా రచయిత చొక్కాపు రమణ మాట్లాడుతూ చిన్నయ సూరి రచించిన నీతి చంద్రిక కథలు పిల్లలకి ఆసక్తి కలిగి వినోదంగా ఉండే రీతిలో నీతి నిజాయితీల విలువలు గురించి అవగాహన కలిగిస్తాయని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై కవి పెద్దురి వెంకట దాసు, గాయని డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

మూడో బ్యాచ్‌కు ప్రారంభమైన శిక్షణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలికి కొత్తగా కేటాయించిన జూనియర్ అసిస్టెంట్ల మూడో బ్యాచ్‌కు గురువారం శిక్షణ ప్రారంభమైంది. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణను ఈడీ మయాంక్ మిట్టల్ ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలమండలిలో ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలన్నారు. పనిలో పారదర్శకత పాటించాలని చెప్పారు. ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. బోర్డు ప్రతిష్ఠను కాపాడేలా పనిచేయాలన్నారు. రెండు సెషన్లుగా జరిగిన ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్.. వారికి బోర్డు గురించి వివరించారు. బోర్డు హైరార్కీ, విధి విధానాలు, అంతర్గత శాఖలు, సేవలు, నిబంధనలు, ఉద్యోగుల సౌకర్యాలు తదితర వాటి గురించి చెప్పారు. అనంతరం వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. శుక్రవారం కూడా ఈ శిక్షణ కొనసాగనుంది.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | జనవరి 17, 2025 | www.navatelangana.com

బౌద్ధ నగర్ డివిజన్‌లో సర్వే

- పాల్గొన్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు అనిల్ కుమార్



నవతెలంగాణ-ఓయూ
బౌద్ధ నగర్ డివిజన్‌లో న్యూ అశోక్ నగర్, అంబర్ నగర్, కౌసర్ మజీద్, ఏరియాలలో రేషన్ కార్డ్ దరఖాస్తుదారుల సర్వేలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఏ.ఈ. లావణ్య, సివిల్ సప్లై డిపార్ట్మెంట్ అధికారులు, జి.హెచ్.ఎం.సి ఎంటమాలజీ డిపార్ట్మెంట్ వారు ఉన్నారు.

రేపు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వెదురువాడ రామకృష్ణారావు సంస్మరణ సభ



నవతెలంగాణ- జూబ్లీహిల్స్
జనవరి 18 శనివారం, శ్రీకృష్ణ నగర్ లోని శ్రీకృష్ణదేవరాయ నగర్ కమ్యూనిటీ హాల్‌లో జూబ్లీహిల్స్ జోన్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వెదురువాడ రామకృష్ణారావు సంస్మరణ సభను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సభకు సూరపనేని జితిన్ అధ్యక్షత వహించనున్నారు. ఉపన్యాసకులు ముదునూరు రాదే శ్యాం, గౌరవ అధ్యక్షులుగా హైదరాబాద్ జన విజ్ఞాన వేదిక నుంచి చెన్నుపాటి చంద్రశేఖర రావు, హైదరాబాద్ జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రవీంద్రబాబు పాల్గొన్నట్టు తెలిపారు. జేవీవీ నాయకులు, సభ్యులు పాల్గొని సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరారు.

జీహెచ్‌ఎంసీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



- కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలి
- సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్
- వెంగళరావు నగర్ డివిజన్ కరెంట్ ఆఫీస్ వద్ద ధర్నా, కరపత్రాలు విడుదల

నవతెలంగాణ- జూబ్లీహిల్స్
జీహెచ్‌ఎంసీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం వెంగళరావు నగర్ డివిజన్ కరెంట్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. అలాగే ఈ నెల 22న జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు కార్మికుల సమస్యలపై జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, బయోమెట్రిక్ హాజరు పట్టికలో జరుగుతున్న అవకతవకలు, అధికారుల వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య సేవలో రామ్ కి ప్రయివేటు కంపెనీల ఒప్పందాలు రద్దు చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ సూపర్వైజర్లకు రూ.35 వేల వేతనం ఇవ్వాలని, ఆదివారాలు, పండగల సందర్భంగా అందరికీ సెలవులు ఇవ్వాలని, ముఖ్యమంత్రి హామీ ప్రకారం డబుల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇల్లు మున్సిపల్ కార్మికులకు కేటాయించాలని అన్నారు. పెరుగుతున్న పట్టణ విస్తీర్ణం అనుగుణంగా కొత్త సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ధర్నాలో జీహెచ్ ఎంసీ పారిశుధ్య కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని, కార్మికులందరం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నగేష్, అమల, కోమల, మల్లమ్మ నరసమ్మ, లక్ష్మీ ,చంద్రకళ, రమ, తదితరులు పాల్గొన్నారు.

అధునాతన సాంకేతికతలపై
అవగాహన కల్పించేందుకు పోలీస్ స్టాల్



- ఎగ్జిబిషన్ సొసైటీకి మద్దతును కొనసాగిస్తాం
- హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్
- నుమాయిష్‌లో పోలీస్ స్టాల్‌ను ప్రారంభించిన సీపీ

నవతెలంగాణ- సిటీబ్యూరో
ట్రాఫిక్ భద్రత, మహిళల భద్రత, సైబర్‌క్రైమ్‌లపై అవగాహన కల్పించేందుకు నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న నుమాయిష్‌లో హైదరాబాద్ సిటీ పోలీస్ స్టాల్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్ గురువారం ప్రారంభించారు. హైదరాబాద్ అదనపు పోలీసు ట్రాఫిక్ కమిషనర్ పి.విశ్వ ప్రసాద్, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.
హైదరాబాద్ సిటీ పోలీసులు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ , ఇతర ముఖ్యమైన సేవలకు ఉపయోగించే అధునాతన సాంకేతికతలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ స్టాల్ ఏర్పాటు చేసినట్టు సి.వి.ఆనంద్ హైదరాబాద్ తెలిపారు. ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో సందర్శకులను ఆకర్షిస్తున్న ఈ ఎగ్జిబిషన్ చారిత్రక ప్రాధాన్యతను పోలీస్ కమిషనర్ చెప్పారు. ఈ పోలీసు ఎగ్జిబిషన్‌ను ప్రజలు ముఖ్యంగా తమ పిల్లలతో సందర్శించి ట్రాఫిక్ భద్రత, ట్రాఫిక్ నియమాలను పాటించడంపై అవగాహన పెంచుకోవాలని సీపీ కోరారు. రోడ్డు భద్రతా విద్యను చిన్న వయస్సులోనే ప్రారంభించాలని ఉద్ఘాటించారు. 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ రద్దీ, సాధారణ ట్రాఫిక్‌ను నిర్వహించడంలో ట్రాఫిక్ పోలీసు అధికారుల కృషిని అభినందించారు. పోలీస్ స్టాల్ కోసం స్థలాన్ని అందించినందుకు ఎగ్జిబిషన్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. విద్యా కార్యక్రమాలను నిర్వహించడంలో వారి చొరవను ప్రశంసించారు. భవిష్యత్తులో ఎగ్జిబిషన్ సొసైటీకి మద్దతు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.
హైదరాబాద్ అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ కోటి మందికి పైగా జనాభా ఉన్న హైదరాబాద్ లో అందరికి ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెప్పలేమని.. ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ 1 డీసీపీ బి.కె. రాహుల్ హెగ్డే, ట్రాఫిక్-2 డీసీపీ ఎన్. అశోక్ కుమార్, ట్రాఫిక్-3 డీసీపీ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్స్ డీసీపీ డి. కవిత, మహిళా భద్రత వింగ్ డీసీపీ లావణ్య, అడిషనల్ రామదాస్ తేజ, ఏసీఎస్‌పీ డీసీపీ ట్రాఫిక్-2 , హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

విధుల్లో ఉండగా గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి





విజయభాస్కర్ (ఫైల్ ఫోటో)

- ఆత్మీయునికి అశ్రు నివాళ్లర్పించిన ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది

నవతెలంగాణ- జూబ్లీహిల్స్
విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన విషాద ఘటన ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. 1998 బ్యాచ్‌కు చెందిన విజయ భాస్కర్ (సర్వీస్ నెంబర్ 9311) ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం అతను విధుల్లో ఉండగా ఫిట్స్ రావడంతో గమనించిన తోటి సిబ్బంది వెంటనే అతన్ని దగ్గరలోని వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగానే రాత్రి 12:30 గంటల సమయంలో రెండోసారి గుండెపోటు వచ్చింది. ఈ క్రమంలో అతను మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని ఎస్సార్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డీఐ గోపాల్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ నుంచి రూ.50 వేలు, డిపార్ట్మెంట్ తరఫు నుంచి రూ. 30 వేలు అంత్యక్రియల కోసం అందించినట్టు సీఐ తెలిపారు. ఆయన కుటుంబానికి పోలీసు శాఖ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. అనంతరం మృతదేహాన్ని తన స్వగ్రామమైన బాపట్లకు బంధువులు తీసుకునివెళ్లారు.



రాములు గౌడ్‌కు ఎమ్మెల్యే నివాళ్లు

- మచ్చ వేణుగోపాల్ గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ- జూబ్లీహిల్స్
అమీర్ పేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్ గౌడ్ తండ్రి రాములు గౌడ్ (86) మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం అమీర్ పేట లోని కుమ్మరి బస్తీలో గల వారి నివాసానికి వెళ్లారు. రాములు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వేణు గౌడ్‌ను, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్ కుమార్, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, బలరాం, సుమిత్ సింగ్, బాబా, శ్రీనివాస్ గౌడ్, జితేందర్ శుక్ల, సాయి తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన





- వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ

నవతెలంగాణ-కంటోన్మెంట్
రోడ్డు భద్రతా మాసంలో భాగంగా నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు ట్రాఫిక్ తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ మధుబాబు శ్రీకాంత్ తమ సిబ్బందితో గురువారం తిరుమలగిరి చౌరస్తాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు ఇందులో హెల్మెట్ ధరించడం వల్లకలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్‌లు ధరించే ద్విచక్ర వాహనదారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రశంసించారు. అలాగే పలువురు వాహనదారులకు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు హెల్మెట్‌లను పంపిణీ చేశారు. హెల్మెట్ ధరించాలని వారిని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సగటున 44 శాతం మంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. కావున ప్రతి పౌరుడు విధిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, హెల్మెట్ ధరించి రక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



- ఉన్నత విద్యామండలి చైర్మెన్‌కు విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ వినతిపత్రం

నవతెలంగాణ-ఓయూ
రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్.వి. బాలకిష్టా రెడ్డిని గురువారం సాయంత్రం రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ కలిసింది. ఓయూతో పాటు రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జేఏసీ చైర్మెన్ సూర్యచందర్ , అధ్యక్షుడు కట్టా వెంకటేష్ , జనరల్ సెక్రెటరీలు అరుణ్ కుమార్, తక్కెళ్ల చేతన్ ,కో.కన్వీనర్ చేర్యాల శ్రీనివాస్, వీణా,అరవింద్, మౌళీ, సతీశ్, రాగిణి, నరేందర్ ,బాలరాజు, రాజ్యలక్ష్మి, రాము కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు.

ప్రాణం పోకుండా హెల్మెట్ కాపాడుతుంది





- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్
జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా గురువారం మైత్రి వనం జంక్షన్ వద్ద మోటార్ సైకల్ ప్రయాణికులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు,రోడ్డు ప్రమాదాల బారిన పడినప్పుడు హెల్మెట్ ఉండటం వల్ల ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడటం ఆవశ్యకతను ఎస్సార్ నగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సైదులు వివరించారు. జీవితంలో ప్రయాణాల్లో హెల్మెట్ ఎంత ముఖ్యమో ప్లకార్డులు ప్రదర్శిస్తూ, వివిధ రకాల వీడియోలు, ఫోటోలు (గతంలో హెల్మెట్ ధరించకుండా ప్రయాణాల్లో జరిగిన ప్రమాదాలు) చూపించి అవగాహన కల్పించారు. అలాగే ద్విచక్రవాహనం వెనుక కూర్చుని కూడా హెల్మెట్ ధరించిన వారిని గుర్తించి వారికి గులాబీలు, మిఠాయిలు పంచి సత్కరించారు. మోటార్ సైకిల్ నడిపే వ్యక్తులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి,హెల్మెట్ ధరించిన తర్వాతనే వాహనాలపై ప్రయాణం ప్రారంభించడంతో పాటు, వెనుక ఉన్న సహ ప్రయాణికుడు కూడా హెల్మెట్ దరించేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



జైపాల్ రెడ్డికి డిప్యూటీ మేయర్ నివాళులు

నవతెలంగాణ-ఓయూ
మాజీ కేంద్ర మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి 83వ జయంతి సందర్భంగా స్ఫూర్తి స్థల్ వద్ద ఆయన సమాధిని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి సందర్శించి పూలమాల సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ జైపాల్ రెడ్డి దేశ రాజకీయాల్లో అమూల్యమైన సేవలను అందించిన ఘనత వహించారని, నైతిక విలువలకు కట్టుబడి పనిచేసిన మహానీయుడని తెలిపారు. ఆయన చూపిన మార్గం స్ఫూర్తిగా ఉండాలని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పలువురు ప్రముఖులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

శోభారాణికి పాస్టర్లు, నాయకులు నివాళ్లు



శోభారాణి (ఫైల్‌ఫోటో)

నవతెలంగాణ- జూబ్లీహిల్స్.
జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ క్రైస్తవ కుటుంబానికి చెందిన, ఆల్బర్ట్ కురేష్ సతీమణి శోభారాణి (54) అనారోగ్య కారణాల వలన గురువారం మృతి చెందింది. ఆమెకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆల్బర్ట్ కురేష్ గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా పీజేఆర్ అడుగుజాడలలో నడిచి పార్టీకి సేవ చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు, స్థానిక రాజకీయ నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంధువులు, స్నేహితులు, క్రైస్తవ సోదరులు సోదరీమణులు భారీగా పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్లారని దోచారు.. దొరికారు..





నవతెలంగాణ - బంజారాహిల్స్
బంజారాహిల్స్‌లో సంక్రాంతికి ఊరికి వెళ్లారని ఓ ఇంట్లో చోరీచేసిన దొంగలు దొరికారు. ఉపాధ్యాయురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ నేర విభాగపు పోలీసులు సాంకేతిక పరిజ్ఞాన సహకారం ఉపయోగించి దర్యాప్తు జరిపి దొంగలను చాకచాక్యంగా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని హైటెక్ సిటీలోని ఓ ప్రయివేటు హోటల్‌లో చెఫ్‌గా, హెల్పర్‌గా పనిచేస్తున్న నిందితుడు దాసరి రక్షక్ రాజ్, జూనియర్ ఆర్టిస్ట్ వెన్నపూస తిరుమల్ రెడ్డిలు బంజారాహిల్స్‌లోని ఓ ఉపాధ్యాయురాలు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆ ఇంట్లోని వారు సంక్రాంతికి రాజమండ్రికి ఈ నెల 12 వ తేదీన వెళ్లారు. అయితే వారి నివాసంలో అద్దెకు ఉంటున్న కరుణాకర్ 14న ఉదయం మోటార్ స్విచ్ వేయడానికి వెళ్ళినప్పుడు ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించాడు. నివాసంలోకి వెళ్లి చూస్తే ఇంట్లో వస్తువులు చిందరవందరంగా పడి ఉన్నాయి. వెంటనే బాధిత కుటుంబానికి సమాచరం ఇచ్చాడు. వారు వెంటనే హైదరాబాద్ చేరుకుని విషయాన్ని బంజారాహిల్స్ పోలీసులకు తెలియజేసి ఫిర్యాదు చేశారు. బీఎన్‌ఎస్‌ఎస్ 331(4),305, సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేశారు.ఈ మేరకు నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్టు అంగీకరించారు. కొంత నగదు తో పాటు బంగారు చైన్లు,ఉంగరాలు, వెండి విగ్రహాలు, గొలుసులు చెవిపో గులతో పాటు బిస్కెట్ బంగారం కాజేసినట్లు ఒప్పుకున్నారు. వాటిని వారి నుండి కొంతమేరకు రికవరీ చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఆర్‌జీఐ విమానాశ్రయంలో'ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్-ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్'

- వర్చువల్‌గా ప్రారంభించిన ఇండియన్ హోంమంత్రి



నవతెలంగాణ-శంషాబాద్
విశ్వసనీయ ట్రావెలర్ ప్రోగ్రామ్ (టిటిపి) భారతీయ పాస్పోర్ట్ హోల్డర్లు, ఓసిఐ కార్డుదారులు సులభమైన ప్రయాణాన్ని ఆస్వాదించ డానికి ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్-ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్ ' ఉపయోగపడుతుందని శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానా శ్రయం అధికారులు తెలిపారు. గురువారం ఆ ప్రోగ్రాంను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిర్పోర్ట్ సీఈవో ప్రదీప్ పాణికర్ మాట్లాడుతూ సాధారణ వలసలు /ఇమ్మిగ్రేషన్ క్యూలను దాటవేయడానికి ఇ-గేట్లను ఉపయోగిం చుకోవడానికి అనుమతిస్తుందని తెలిపారు. భారతీయ పాస్పోర్ట్ హోల్డర్లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డుదారుల కోసం భారత ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్-ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్ (ఎఫ్టిఐ-టిటిపి) అనేది భారత ప్రభుత్వ దార్శనిక చొరవ, ఇది భారతీయ పౌరులు ఓసిఐ కార్డుదారులకు వేగవంతమైన, సులభమైన సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని అందించడానికి రూపొందించబడింది. ఈ కార్యక్ర మంలో చేరేందుకు అర్హులైన వారు ఆన్‌లైన్ లోదరఖాస్తు చేసుకో వాలి. ఎఫ్టిఐ-టిటిపి కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఒక నెల వరకు పట్టవచ్చు. దరఖాస్తు సమయంలో తమ పాస్ పోర్టుకు కనీసం ఆరు నెలల వ్యాలిడిటీ ఉండేలా చూసుకోవాలి. ఈ కార్యక్రమంలో సభ్యత్వం పాస్ పోర్ట్ వాలిడిటీతో సహ-టెర్మినస్ గా ఉంటుంది. దరఖాస్తు ప్రక్రి యలో దరఖాస్తుదారులు తమ బయోమెట్రిక్స్ (వేలిముద్రలు మరియు ముఖ చిత్రం)తో పాటు దరఖాస్తు ఫారంలో పేర్కొన్న ఇతర అవసరమైన సమాచారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైన వెరిఫికేషన్లు, అర్హత నిర్ధారణ తర్వాత ఎఫ్టీఐ-టీటీపీ కింద రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఈ సదుపాయం విమానాశ్రయాల్లో రద్దీని గణనీయంగా తగ్గించడం, వచ్చే, బయలుదేరే ముందస్తు ధృవీకరించబడిన ప్రయాణీకులకు వేగవం తమైన ఇమ్మిగ్రేషన్/ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ అందించడం లక్ష్యంగా పెట్టుకుందని ఎయిర్పోర్ట్ సీఈవో ప్రదీప్ పాణికర్ తెలిపారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు, ఉత్తమ పార్లమెంటరీయన్ జైపాల్ రెడ్డి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో
ఉత్తమ పార్లమెంటరీయన్, గొప్ప రాజనీతిజ్ఞుడు సూదిని జైపాల్ రెడ్డి రాష్ట్ర, దేశ రాజకీయ ప్రయాణంలో మహోన్నతమైన వ్యక్తిగా నిలిచారనీ, నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం నెక్లెస్ రోడ్ పీవీ మార్గ్ స్ఫూర్తి స్థల్‌లో మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్ రెడ్డి 83వ జయంతి సందర్భంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ పాల్గొని జైపాల్ రెడ్డి సమాధిపై పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, పార్లమెంట్ సభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా అత్యుత్తమ పార్లమెంటరీయన్, గొప్ప రాజనీతిజ్ఞుడుగా గుర్తింపు పొందరని తెలిపారు. నేటి యువత వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ నయిామోద్దీన్, జీహెచ్ ఎంసీ, ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రిసిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్ జోష్..!











'కొత్త రేషన్ కార్డుల వెరిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించాలి'



నవతెలంగాణ-దోమ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన 6 గ్యారంటీలో భాగంగా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న కొత్త రేషన్ కార్డుల లబ్దిదారుల వివరాలను దోమ గ్రామపంచాయతీ పరిధిలో ఇంటింటి కీ వెళ్లి పరిశీలించారని ఎంపీడీవో హెచ్. మహేష్ బాబు అన్నారు. దాఖాస్తుదారులు గ్రామపంచాయతీ సిబ్బందికి రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ శారద, కారోబార్ తిరుపతి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA

11

శుక్రవారం | జనవరి 17, 2025 | www.navatelangana.com



మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో రైతు భరోసాలో భాగంగా గురువారం తహసీల్దార్ పురుషోత్తం, ఏవో ప్రభాకర్‌రావు, ఆర్ఐ సుదర్శన్ తదితరులు సర్వే నిర్వ హిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సాగుకు యోగ్యం కానీ వ్యవసాయేతర భూములను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారన్నారు. కార్యక్ర మంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దోమ

మా సమస్యలు పరిష్కరించండి



- ఎంపీ, ఎమ్మెల్యేకు ఆశాల విజ్ఞప్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

తమ సమస్యలను అసెంబ్లీ, పార్లమెంట్‌లో మాట్లాడి పరిష్కరామయ్యేలా చూడాలని ఆశాలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు తెలంగాణ ఆశా వర్కర్స్ యూని యన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షురాలు ఆర్.రాధ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధాని నరేంద్ర మోడీకి అందజేయాలని కోరారు. ఆశాల సమస్యలపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి చేయాలని, అసెంబ్లీ, కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో ఫిక్సిడ్ వేతనం రూ.18 వేలు ప్రకటనతో పాటు ఇతర సమస్యలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లకు ఫిక్స్ డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు రాష్ట్ర వ్యా ప్తంగా 16 రోజులు ఆశా వర్కర్లు రాష్ట్రంలో నిరవధిక సమ్మె చేశారని తెలిపారు. ఈ సమ్మె సందర్భంగా హైదరాబాద్, కోఠి కమీషనర్ ఆఫీస్ ముందు వేలాది మంది ఆశా వర్కర్లతో ధర్నా నిర్వహించామని ధర్నా సందర్భంగా ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపారు. కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని వేసిన కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. డైరెక్టర్ హామీ ప్రకారం అక్టోబర్ 9న ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెను విర మించారు. వీటితో పాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తా మని హామీనిచ్చింది. ప్రభుత్వం స్పందిం చకపోవడంతో తీవ్రమైన ఆందోళనకు ఆశాలు గురవుతున్నారు. ఈ కార్యక్రమంలో కీసర పీహెచ్‌సీ ఆశాలు శంకరమ్మ, జయప్రద, మంగా, యాదమ్మ వాణి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-నాగోల్

నేను చచ్చిపోతున్నానని తన భార్యకు వీడియోను పంపి ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్సై శివ నాగ ప్రసాద్ తెలిపిన సమాచారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగోల్ డివిజన్ పరిధిలోని 5 నగర్ కాలనీలో నివాసముంటున్న తూర్పాటి రాకేష్ అనే వ్యక్తి ర్యాపిడో డ్రైవర్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడని, ఈనెల 16న మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో వాట్సాప్ ద్వారా తన భార్యకు తాను చచ్చిపోతున్నాను పిల్లలు జాగ్రత్త అని వాట్సాప్ ద్వారా వీడియో పంపాడు. దీంతో తండ్రి తూర్పాటి నారాయణ వెంటనే రాకేష్‌కు ఫోన్ చేయాగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆచూకీ కొరకు సమీప ప్రాంతంలో బంధుమిత్రుల వద్ద వెతికిన లాభం చేకూర్చలేదని చట్టపరమైన చర్యలు చేపట్టి తమ కొడుకు ఆచూకీ కనుగొని తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివ నాగ ప్రసాద్ తెలిపారు.

CHANGE OF NAME

I,Jagatha Suryakanthamani W/O Rajanala Satish Kumar,D/o Jagatha Hanumantha Rao Aged about 45 years and resident of Flat No: 204 & 205, Venkateshwara Residency, Rockview apartments, Chandragiri Colony, Neredmet, Medchal-Malkajgiri District, Telangana, have changed my name to **RAJANALA SANDHYA** for all purposes

ఘనంగా రామకృష్ణ ముదిరాజ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు, సంఘసేవకులు రామకృష్ణ ముదిరాజ్ జన్మదిన వేడుకలు చింతల్లోని బాల్ రెడ్డి నగర్ శంకరయ్య ముదిరాజ్ నివాసంలో సంఘ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శంకరయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షులు జింకల వెంకటేశం ముదిరాజ్‌తో పాటు సంఘం సభ్యులు రామకృష్ణ ముదిరాజ్ చేత కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు యాదగిరి ముదిరాజ్, మానయ్య ముదిరాజ్, బిక్షపతి ముదిరాజ్, బాలరాజ్ ముదిరాజ్, సాయి ముదిరాజ్, హరిబాబు ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులున్నారు.

ఘనంగా చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ కార్పొరేట్ కార్యాలయం వద్ద బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి వరకు వేడు కలు ఘనంగా సాగాయి. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీల కు అతీతంగా రాజకీయ ప్రముఖులు, నాయకులు, కాలనీల సంక్షేమ సంఘం నాయకులు, అభిమానులు, శ్రేయోభిలా షులు, మిత్రులు, బీజేపీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో వేడుకల్లో హజరయ్యారు. భరత సింహారెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు తీసుకొచ్చిన కేక్‌లను కట్ చేయించి ఆయనకు తినిపించారు. శాలువాలు కప్పి, బొకేలు, జ్ఞాపిక లను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రోగులు, వృద్ధులు , దివ్యాంగులకు పండ్ల పంపిణీ..

చెరుకుపల్లి భరత సింహారెడ్డి జన్మదిన వేడుకలలో భాగంగా నియోజకవర్గంలోని పలుచోట్ల రోగులు, వృద్ధులు ,దివ్యాంగులకు ప్రజాప్రతినిధులు, బీజేపీ కార్యకర్తలు, అభి మానులు.. పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

శబరిమల యాత్రకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో ని అయ్యప్పస్వామి దివ్యక్షేత్రంలో శబరిమలై యాత్రకు బయ లు దేరేందుకు అయ్యప్ప భక్తులు ఇరుముడి కార్యక్రమం నిర్వ హించారు. ఈ నేపథ్యంలో ఎలిజాల యాదగిరి గురుస్వామి 39వ సారి మాలధారణ చేసి 65 రోజులు దీక్ష పూర్తి చేసుకుని శబరిమలై యాత్రకు ఇరుముడి కట్టుకుని ఎలిజాల యాదగిరి గురు స్వామి ఆధ్వరంలో పలువురు అయ్యప్ప స్వాములు బయలు దేరారు. ఈ సందర్భంగా ఇరుముడి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలానగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి. నరసింహ రాజు ఇరుముడిలో ముద్రం టెంకాయ, ఆవు నెయ్యి వంటివి వస్తువులు ఇరుముడిలో ఏర్పాటు చేసుకుని స్వాములు, భక్తు లు పాల్గొన్నారు. అదేవిధంగా మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ జవహార్ నగర్ కాలనీలోని శీతలాదేవి, కాళికాదేవి, దుర్గాదేవి ఆలయంలో ప్రధాన ఆలయ అర్చకులు దోర్బల కాశీ నాథ్ శర్మ అయ్యప్ప స్వామితో పాటు మరికొందరు అయ్యప్ప స్వామి మండల దీక్ష పూర్తైన సందర్భంలో దేవస్థానంలో ఇరు ముడి కట్టుకుని భక్తిశ్రద్ధలతో శబరి యాత్ర ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రవెల్లి శ్రీహరి చారి, శ్రీనివాస్ చారి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE DISTRICT CONSUMER REDRESSAL COMMISSION- II AT: HYDERABAD CC.NO.148 OF 2024

Between:
Mrs.Bollineni Padma ...Complainant
And
GSR Infra Pvt Ltd & others ...Opposite Parties

To,
1) M/s.GSR Infra Group Pvt Ltd, Rep. by Managing Director, Sri. Guntupalli Srinivas Rao, S/o. Sri. Poorna Chandra Rao, C/o. 490/A, Nirmalam, Jubilee Hills, Road No. 10, Hyderabad, Telangana 500033.
2)Sri.Guntupalli Srinivas Rao, S/o. Sri. Poorna Chandra Rao.
3) Sri.G.Padmaja, W/o Sri. Guntupalli Srinivas Rao, Occ: Director of GSR Infra Group Pvt Ltd, 2 & 3 are R/o. Plot No. 62, Jyothi Hill Ridge, 69, Nandagiri Hills Rear Rd, HUDA Enclave, Jubilee Hills, Hyderabad, Telangana 500033.
4)Sri.Vemavarapu Satya Silpa W/o.Chander Shekar Vemavarapu Occ: Marketing Director GSR Infra Group Pvt Ltd, R/o. Villa No.1A, 2 nd Phase, Vasudevas Bloomfields, Lanco Hills Main Road, Khajaguda, 500089.

Whereas the above-named complainant has instituted the above CC. No.147 of 2024 against you. You are hereby summoned to appear before the Hon'ble Court on 12.2.2025 at 10.30 am in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the above CC.No. 147 of 2024 default of your appearance the above matter will heard and determined in your absence.

(By Order of Hon'ble Court)
Sucharitha Law Chambers
MACHERLA SANTHOSH
ADVOCATE

IN THE COURT OF THE HON'BLE DISTRICT CONSUMER REDRESSAL COMMISSION- II AT: HYDERABAD CC. NO. 146 OF 2024

Between:
Mrs.Kankalapati Udaya Lakshmi ...Complainant
And
GSR Infra Pvt Ltd & others ...Opposite Parties

To,
1)M/s.GSR Infra Group Pvt Ltd, Rep.by Managing Director, Sri. Guntupalli Srinivas Rao, S/o. Sri. Poorna Chandra Rao, C/o. 490/A, Nirmalam, Jubilee Hills, Road No. 10, Hyderabad, Telangana 500033.
2)Sri.Guntupalli Srinivas Rao, S/o.Sri. Poorna Chandra Rao.
3)Sri.G. Padmaja, W/o Sri. Guntupalli Srinivas Rao, Occ: Director of GSR Infra Group Pvt Ltd, 2 & 3 are R/o.Plot No. 62, Jyothi Hill Ridge, 69, Nanda giri Hills Rear Rd, HUDA Enclave, Jubilee Hills, Hyderabad, Telangana 500033.
4)Sri.Vemavarapu Satya Silpa W/o.Chander Shekar Vemavarapu Occ: Marketing Director GSR Infra Group Pvt Ltd, R/o.Villa No.1A, 2 nd Phase, Vasudevas Bloomfields, Lanco Hills Main Road, Khajaguda, 500089.

Whereas the above-named complainant has instituted the above CC.No.147 of 2024 against you. You are hereby summoned to appear before the Hon'ble Court on 12.2.2025 at 10.30 am in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the above CC.No. 147 of 2024 default of your appearance the above matter will heard and determined in your absence.

(By Order of Hon'ble Court)
Sucharitha Law Chambers
MACHERLA SANTHOSH
ADVOCATE

IN THE COURT OF THE HON'BLE DISTRICT CONSUMER REDRESSAL COMMISSION- II, AT: HYDERABAD CC.NO.147 OF 2024

Between:
Mrs.Madala Vineela ...Complainant
And
GSR Infra Pvt Ltd & others ...Opposite Parties

To,
1)M/s.GSR Infra Group Pvt Ltd, Rep. by Managing Director, Sri.Guntupalli Srinivas Rao, S/o.Sri.Poorna Chandra Rao, C/o.490/A, Nirmalam,Jubilee Hills, Road No. 10, Hyderabad, Telangana 500033.
2)Sri.Guntupalli Srinivas Rao, S/o.Sri.Poorna Chandra Rao.
3)Sri.G.Padmaja, W/o Sri. Guntupalli Srinivas Rao, Occ: Director of GSR Infra Group Pvt Ltd, 2 & 3 are R/o. Plot No. 62, Jyothi Hill Ridge, 69, Nandagiri Hills Rear Rd, HUDA Enclave, Jubilee Hills, Hyderabad, Telangana 500033.
4)Sri.Vemavarapu Satya Silpa W/o.Chander Shekar Vemavarapu, Occ: Marketing Director GSR Infra Group Pvt Ltd, R/o. Villa No.1A, 2 nd Phase, Vasudevas Bloomfields, Lanco Hills Main Road, Khajaguda, 500089.

Whereas the above-named complainant has instituted the above CC.No.147 of 2024 against you. You are hereby summoned to appear before the Hon'ble Court on 12.2.2025 at 10.30 am in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the above CC.No. 147 of 2024 default of your appearance the above matter will heard and determined in your absence.

(By Order of Hon'ble Court)
Sucharitha Law Chambers
MACHERLA SANTHOSH
ADVOCATE

IN THE COURT OF THE HON'BLE XXVII ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD M.V.O.P.No.718 /2024

BETWEEN:
CH.RAVI ...PETITIONER
AND
SINI MEENA CARGO REPRESENTED BY FRAVEEN CHART & OTHERS ...RESPONDANTS

NOTICE TO THE RESPONDANT No.2:
CHITARI DASHARATHA, S/O RAMA SWAMY, AGED 26 YRS, OCC: DRIVER, R/o.H.No.4-18/1, POODUR VILLAGE, MEDCHAL.

THE PETITIONER FILED A CLAIM PETITION FOR RS.4,00, 000/- FOR THE INJURIES SUSTAINED IN A MOTOR ACCIDENT ON 15-1-2024 DUE TO RASH AND NEGLIGENT DRIVING OF THE DCM VEHICLE BEARING No.TS OSUF 2690 AND THE CASE IS POSTED ON 5-2-2025 FOR YOUR APPEARENCE EITHER IN PERSON OR THROUGH AN ADVOCATE AT 10-30 A.M. IN THE ABOVE COURT, FAILING WHICH YOU WILL BE SET EXPARTE AND FURTHER STEPS WILL BE ORDERED IN YOUR ABSENCE.

//BY THE ORDER OF THE COURT//
S.ANURADHA NAIDU
ADVOCATE
H.No.11-2-453, NAMALAGUNDU, SECUNDERABAD -61
9849696119

IN THE COURT OF PRINCIPAL DIST.& SESSIONS JUDGE-CUM FAMILY COURT MEDCHAL - MALKAJGIRI DISTRICT: AT MALKAJGIRI: E.P.No.1032 OF 2011 IN O.S.No.57 OF 2023.

Between:-
V.GOPAL S/o.Late.V.NARAYANA , S/o.Late.V.NARAYANA, AGE: 60yrs, Occ: Business, R/o.12-10-587/82/1, Medibhavi, Seethaphal mandi, SECUNDERABAD. ...Decree Holder/Plaintiff.
AND
Smt.HEPHZIBAH RUTH.D/o.Sri. K.VICTOR, W/o. RAJU, ...Judgment Debtor/Defendant.

To.
Smt.HEPHZIBAH RUTH.D/o.Sri. K.VICTOR, W/o.RAJU, R/o.Shop Nos.1 to 5, Ground floor, of 'SOMAIAH TOWERS', Plot No.26, in Survey No.461, Survey No. 461, Dr. A.S.Rao Nagar, Kapra Municipality, Keesera Mandal, Medchal - Malkajgiri Dist.

Take Notice that Decree Holder / Plaintiff filed above Execution Petition No.1032 of 2023 against you (Judgment Debtor/ Defendant) for execution of Final Decree Dt. 11-03-2022, Passed in I.A.No. 27 of 2018, in O.S.No.57 of 2011, in pursuance of Preliminary Decree passed on 29-11-2016 by this Hon'ble Court The above E.P. No. 1032 of 2023 stands Posted to 11-02-2025, for your Appearance before Hon'ble Principal Dist. & Sessions Judge cum Family Court at Medchal-Malkajgiri District: At MALKAJGIRI, at 10.30 A.M. If you fail to appear either in Persons or through Advocate before this Hon'ble Court, on the said date of hearing i.e. 11-02-2025, at 10.30 A.M., the matter will be heard in your absence & exparte orders will be passed against you.

(BY ORDER OF THE COURT)
M.SHIVA SHEKAR,
ADVOCATE.
H.No.11-3-664/191, Parsigutta, SECUNDERABAD-500 061.
Ph. No. 9246521602

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: CHEVELLA RANGA REDDY DISTRICT: AT: CHEVEL O.S.NO.32 OF 2024

Between:
Machagari Karunakar Reddy and Others ...Plaintiffs
AND
K.V.V.Nageswar Rao and Others ...Defendants

To
1.K.V.V.Nageshwar Rao, S/o Krishnaiah, Aged about 57 years, Occ: Business, R/o H.NO.3-2-7, Chaitanya Enclave, Manikonda, Rajendranagar mandal, Ranga Reddy Dist.
2.Pandem Sharmila W/o Paul Sudershan Bathula, Aged about 42 years, Occ: Private Service, R/o H.No.3-75, Old Alwal, Near Govt Hospital, Secundrabad-500010
3.D.Shankaraiah S/o.Late Ramaiah, Aged about 68 years, Occ: Employee, R/o H.No.2-11-111/9, Mylargadda, Secunderadad
4.Shivalenka Srikar S/o Shivalenka Purna Chander Rao. Aged about 50 years, Occ: Business, R/o Plot No.128, Near Shiva Temple, Road No.10, Krishi Nagar, Bandlaguda, Nagole, Ranga Reddy Dist.
5.Sreekanth Kasukutthi S/o Kasukurthi Surendra Babu, Aged about 50 years, Occ: Business, R/o H.No.11-13-1301/201, Road No.5. Margadarshi Colony, Saroornagar, Ranga Reddy Dist.
6.Madiki Indira Rani W/o Madiki Bhanu Prasad, Aged about 37 years, Occ: Business, R/o H.No.8-2-310/2/8, Nandi Nagar, Road No. 14, Banjara Hills, Hyd
7.Nerella Venkata Ramana Mohan Rao S/o Ramulu, Aged about 60 years, Occ; Business, R/o H.No.17-74, Near Railway Station, Akividu, Akividu Mandal, West Godavari Dist.

NOTICE

The above plaintiffs filed the suit for perpetual injunction with O.S.No.32/2024 on the file of the Hon'ble Senior Civil Judge, Chevella, Ranga Reddy Dist at Chevella against you with regard to the suit schedule property. The Hon'ble Court had ordered to publish the notice for your appearance so as to receive your objections and the matter is been posted to 29.01.2025 at 10:30 A.M., therefore you are requested to appear before the above said court either in person or through your authorized counsel, otherwise the matter will be adjudicated in due process of law.

[BY ORDER OF THE COURT)
PATLOLLA UPENDER REDDY

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: CHEVELLA RANGA REDDY DISTRICT: AT: CHEVELLA I.A.NO.411 OF 2024 IN O.S.NO.32 AND OF 2024

Between:
Machugari Karunakar Reddy and Others ...Petitioners/Plaintiffs
AND
K.V.V.Nageswar Rao and Others ...Respondents/Defendants

To
1.K.V.V.Nageshwar Rao, S/o Krishnaiah, Aged about 57 years, Oce: Business, R/o H.NO.3-2-7, Chaitanya Enclave, Manikonda, Rajendranagar mandal, Ranga Reddy Dist.
2.Pandem Sharmila W/o Paul Sudershan Bathula, Aged about 42 years, Occ: Private Service, Rio H.No.3-75, Old Alwal, Near Govt Hospital, Secundrabad-500010.
3.D.Shankaraiah S/o Late Ramaiah, Aged about 68 years, Occ: Employee, R/o H.No.2-11-11 1/9, Mylargadda, Secunderadad
4.Shivalenka Srikar S/o Shivalenka Purna Chander Rao, Aged about 50 years, Occ: Business, R/o Plot No.128, Near Shiva Temple, Road No.10, Krishi Nagar, Bandlaguda, Nagole, Ranga Reddy Dist.
5.Sreekanth Kasokutthi S/o Kasukurthi Surendra Babu, Aged about 50 years, Occ: Business, R/o H.No.11-13-1301/201, Road No.5, Margadarshi Colony, Saroornagar, Ranga Reddy Dist.
6.Madiki Indira Rani W/o Madiki Bhanu Prasad, Aged about 37 yrs Occ: Business, R/o.H.No.8-2-310 /2/8, Nandi Nagar, Road No.14, Banjara Hills, Hyd
7.Nerella Venkata Ramana Mohan Rao S/o Ramulu, Aged about 60 years, Occ; Business, Rio H.No. 17-74, Near Railway Station, Akividu, Akividu Mandal, West Godavari Dist.

NOTICE

The above plaintiffs filed the suit for perpetual injunction with O.S.No.32/2024 on the file of the Hon'ble Senior Civil Judge, Chevella, Ranga Reddy Dist at Chevella against you with regard to the suit schedule property, along with the said suit they filed an interlocutory application with IA.No.411/2024 for grant of ad-interim injunction orders restraining you and your agents, representatives, any person or persons claiming through you from interfering with their peaceful possession and enjoyment of suit schedule property. The Hon'ble Court had ordered to publish the notice for your appearance so as to receive your objections and the matter is been posted to 29.01.2025 at 10:30 A.M., therefore you are requested to appear before the above said court either in person or through your authorized counsel, otherwise the matter will be adjudicated in due process of law.

(BY ORDER OF THE COURT)
PATLOLLA UPENDER REDDY

IN THE COURT OF THE PRL.DIST. JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT, AT: KUSHAIGUDA E.P.No.159 of 2024

Between:-
B.Gopal Reddy ...Decree Holder
And
K.Vinod Sagar ...Judgment Debtor

To
K.Vinod Sagar, S/o.K.Ram Prasad Aged about 37yrs, Occ: Business, R/o.H.No.3-4-109, Lane No.1, Sai Chitra Nagar, Ramanthapur, Amberpet, Hyderabad ...Judgment Debtor

Take notice that the above named Decree Holder filed the above E.P against you for Execution of Sale Deed and the said E.P is posted to 14-02-2025 for your appearance. Hence you are hereby directed to appear either in person or through an Advocate on the said date i.e. 14-02-2025 at 10.30 a.m. before the above Court, failing which the matter will be decided basing on the documents available on record

(BY ORDER OF COURT)
Sd/-
K.RAJA REDDY
A.V.SUJITH KUMAR
Advocates
Counsel for the Plaintiff
401, Gayatri Towers, Near Paradise Hotel,Kothapet, Hyderabad-500102.
Ph.No.9848065161

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE, MEDCHAL- MALKAJGIRI DISTRICT AT: KUSHAIGUDA I.A.No.964 of 2024 in O.S.No.371 of 2016

Between:
Y.Padmavathi ...Petitioner/Plaintiff
AND
A.Bharatamma and others ...Respondents/Defendants

To
1.Y.Bhagya Laxmi, W/o. Y.Vijaya Reddy, aged 62 years,Housewife,
2.Y.Chandrasekhar Reddy, S/o. Y.Vijaya Reddy, aged 37 years, Both are residing at 5-3-120, Near Bus Stop, Bapuji Nagar, Yapral, Malkajgiri, Hyderabad - 500 087

Please take notice that the Petitioner/Plaintiff filed Petition in I.A.No. 964/2024 to bring you both on record of the suit as Legal representatives of late Y.Vijaya Reddy. As notices sent to you are returned, Hon'ble Court has ordered substitute service of notice by paper publication and posted the case on 23-Z1-2025. If you do not appear on the said date either personally or through counsel, matter will be heard in your absence.

//By order of Honourable Court //
SMT.A.ANASUYA
202, Sai Sudha Residency, 1-1-336/39/A/3, Chikkadpally, Hyderabad-500 020
9246106664

NOTICE OF THE DAY FIXED FOR SETTLING A SALE PROCLAMATION (From No.28, Order 21 Rule 66)

IN THE COURT OF THE HON'BLE IV ADDL. DISTRICT JUDGE R.R.DISTRICT COURT AT: NTR NAGAR E.P.No.2613 Of 2019 IN O.S.No.419 Of 2010

Between:
M/s.Margadarsi Chit Fund Pvt Ltd ...Decree Holder
And
Mrs.P.Aruna Jyothi & Others ...Judgement Debtors.
Mrs.P.Aruna Jyothi. W/o. P.Satyanarayana, Occ:Proprietor M/s.Sri Venkateswara Kirana & Gen. Merchants, R/o.Flat No.502 /B & 503/E, Adarsh Residency, Champapet. Saroor Nagar, R.R.Dist ...Jdr.No.1

Please take notice that the above EP is filed against you for recovery of Rs.26,44.527/- (Rupees Twenty Six Lakh Forty Four Thousand Five Hundred and Twenty Seven Only) by way of sale of E.P., Schedule property and the same is posted to 22.01.2025 for your appearance/sale notice in the court at 10.30 A.M. if you fail to attend the court and receive the sale notice on that day the matter will be heard and decided expate.

SCHEDULE "A" PROPERTY BELONGING TO JDR No.1 Mr.P.ARUNA JYOTHI, REGISTERED VIDE SALE DEED No.23482/2006, DT.10.11.2006. All that Piece and parcel of Flat bearing No.503/E, in First Floor, having super built-up area 680 Sq. Feet including Common Area of House bearing No.4-26 (Old) and House bearing No.9-4-87 (New) in ADARSH RESIDENCY undivided share of land admeasuring 17 Sq. Yards, equivalent to 14.21 Sq. Mtrs., situated at CHAMPAPET OLD Village, Saroor Nagar Revenue Mandal, R.R.District under L.B.Nagar Municipality, Registration Sub-District, CHAMPAPET bounded as follows:- **LAND BOUNDARIES** North: Public Road, South: Open Lane East : Public Road,West: Existing House Ghanta Company

FLAT BOUNDARIES North: 6-6" Wide Corridor, South: Open to Sky, East: Flat No.502/B,West: Open to Sky

SCHEDULE "B" PROPERTY BELONGING TO JDR No.1 Mr.P.ARUNA JYOTHI REGISTERED VIDE SALE DEED No.23321/2006, DT.08.11.2006. All that the Piece and parcel of Flat No.502/B, in Fifth Floor, having super built-up area 661.5 Sq. Feet including Common Area of House bearing No.4-26 (Old) and House bearing No.9-4-87 (New) in ADARSH RESIDENCY undivided share of land admeasuring 15.99 Sq.Yards, equivalent to 13.36 Sq. Mtrs.. situated at Champapet Old Village. Saroor Nagar Revenue Mandal, R.R.District under L.B. Nagar Municipality. Registration Sub-District. Champapet bounded as follows:- **LAND BOUNDARIES** North:Public Road, South:Open Lane, East: Public Road, West : Existing House Ghanta Company

FLAT BOUNDARIES
North: Corridor,South: Open to Sky, East: Flat No.501/A,West: Flat No.503/E

(BY ORDER OF THE COURT)
T.KAMALAKAR.
ADVOCATE FOR DECREE HOLDER
Plot Nos. 107 & 203, V2, TNR Shakkuntala Apts. L.B.Nagar, Hyd

---

IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM VII ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS RANGAREDDY DISTRICT, AT: HAYATHNAGAR O.S.No.868 of 2024

Between:-
1.Dusa Vanaja Raju, W/o.Late D P Raju @ Dusa Pentaiah Raju, Aged about 55 years, Occ. Private Employee,
2.Dusa Varsha Dutta, D/o.Late D P Raju @ Dusa Pentaiah Raju Aged about 34 years, Occ. Private Employee
3.Dusa Ramvikas Netha, S/o. Late D P Raju @ Dusa Pentaiah Raju Aged about 34 years, Occ. Private Employee, (All are residents of H.No.11-2-385/1, Mylargadda, Seethafal Mandi, Hyd- 500061) ...Plaintiff No 1 to 3
AND
1.The Thasildhar-cum- Mandal Revenue Office, Abdullapurmet Mandal, Ranga Reddy District.
2.All concerned. ...Defendants

COURT NOTICE

Please take noticed that, the above plaintiffs have filed above suit for declaration to declare them as Legal Heirs and successors of Sri. One Late D P Raju @ Dusa Pentaiah Raju was died on 27-09-2024 who acquired the property open house plot bearing no.1554, admeasuring 202 Sq, yds, or 168.87 Sq. Mtrs., which falls exclusive/jointly in part of land Survey No.193, out of the commonly developed venture Adi Lakshmi Nagar" Lay-out Plan with land Sy No.s 137/3, 176 to 185, 187, to 198, 234, 242, 246, 374, to 376, Situated Pasmamla village and Grampanchayat, Hayathnagar Revenue Mandal, R.R. District., Telangana and within the registering authority Limits of the SRO, Pedda Amberpet, R.R. District and the said suit is posted on 31-01-2025 for the objections from all concerned. Who are having any objections, therefore it is to inform to the general public that. If any body having any objection may be appear before this Hon'ble court on 31-01-2025 at 10.30 AM, either in person are through on advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

SCHEDULE OF PROPERTY

All that the open house plot bearing no.1554, admeasuring 202 Sq, yards, or 168.87 Sq.Mtrs., which falls exclusive/jointly in part of land Survey No.193, out of the commonly developed venture ADI LAKSHMI NAGAR" Lay-out Plan with land Sy No.s 137/3, 176 to 185, 187, to 198, 234, 242, 246, 374, to 376, Situated Pasmamla village and Gram panchayat, Hayathnagar Revenue Mandal, R.R. District., Telangana and within the registering authority Limits of the SRO, Pedda Amberpet, R.R. District, and bounded by:

BOUNDARIES FOR LAND
NORTH : Plot No. 1555
SOUTH : Plot No. 1553
EAST : Plot No. 1574
WEST : 33 Wide Road
Hence this Notice.

//By Order of the Hon'ble court //
Sd/-
SAGGALA SRIVANI
POTHAMSHETTI
MANOJ KUMAR, Advocates
Office H.No.11-14-435,436 Siri Nagar ,Lb Nagar R.R.Dist. 500074, Cell.8919014828

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL FAMILY COURT JUDGE: RANGA REDDY DISTRICT: AT:L.B.NAGAR F.C.OP.No.1318 OF 2024

Between:
Smt. Shilpa Kuragayalu .... Petitioner
And
Chandrashekar ...Respondent

To
Chandrashekar, S/o. Bikshapathi, Aged about 38 yrs, Occ: Software Employee, R/o.Plot No.326, Rock Town Colony, Road No.4 &6B, Mansoorabad, L.B.Nagar, Ranga Reddy District.

Take notice that the petitioner has filed the above F.C.OP.No. 1318/ 2024 against you for Divorce. The Hon'ble Court was pleased to order publication against you and the said case is posted to 06-02-2025 for your appearance. Hence, you are hereby directed to appear in person or through Advocate before the Court on 06-02-2025 by 10-30 A.M., without fail, failing which the matter will be decided against you as per law.

//BY ORDER OF THE COURT//
VENKATESH GURRAPU
Advocate,
Hyderabad.

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE: R.R.DISTRICT AT: HAYATHNAGAR. O.S.NO.976 of 2024

Between:
Buyya Sreekanth Babu and another ...PLAINTIFFS
A N D
1.The Tahsildar, Abdullapurmet Mandal, R.R. District. At: Abdullapurmet (Village & Mandal). ...DEFENDANT No.1
2. All Concerned ...DEFENDANT No.2

To
ALL CONCERNED

Please take notice that the Plaintiffs herein filed the above suit against Tahsildar Abdullapurmet Mandal and All concerned for Declaration to declare the Plaintiffs as the legal heir of Late Buyya Narsimha and Buyya Indira. The above case is posted to 31-01-2025 for your appearance.

Therefore the general public hereby informed that if any body having objections you may appear before the Hon'ble I Addl.Junior Civil Judge Court, At: Hayathnagar on 31-01-2025 at 10.30 A.M either in person or through an Advocate, otherwise, the matter will be decided in your absence as exparte.

(BY ORDER OF THE COURT)
J.INDRAVARDHAN GOUD,
Advocate
Office: Venkat Sai Enclave, Jilllaguda Vilalge, Balapur Mandal, R. R. Dist.
Phone: 9848050744
Counsel for the Plaintiffs.

కింగ్ కోఠి క్లస్టర్ పరిధిలో ఎన్‌సీడీ సెంట్రల్ టీం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కింగ్ కోఠి క్లస్టర్ పరిధిలోని పట్టణ ప్రాథమిక దవాఖానాలు, బస్తీ దవాఖానాలో ఎన్‌సీడీ (బీపీ,షుగర్ ఇతర వ్యాధులు) ను సందర్శించిన జాతీ య సెంట్రల్ టీమ్ గురువారం సందర్శించారు. సెంట్రల్ టీమ్ ఎన్‌హెచ్‌ఎస్ ఆర్‌సీఈడీ డాక్టర్ అతుల్ కొత్వాల్, ఒడిస్సా ఎస్‌ఎన్‌ఓ డాక్టర్ సుశాంత్, ఉత్తరాఖండ్ ఎన్‌హెచ్‌ఎం స్వాతి, డాక్టర్ ఆసియా, ఎన్‌సీడీ డీజీఎం డాక్టర్ నీతు శుక్ల, ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ సాయిబాబా, పీహెచ్‌ఎస్ భాగ్యలక్ష్మిలతో కలిసి పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

ఘనంగా మహేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్‌ఎస్ అంబర్‌పేట డివిజన్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు నాయకుల కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రంగు ఉదయ్ కిరణ్ గౌడ్, నల్లికంత్, అనిల్ వేముల, చేగురి దినేష్, అజ్జు, శివ, సద్దాం హుస్సేన్, ప్రసాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు కీహోల్ సర్జరీ

ప్రాణాలను కాపాడిన లిటిల్ స్టార్ అండ్ షీ ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్



నవతెలంగాన-సిటీబ్యూరో

సౌదీ అరేబియాలో ఉంటున్న ఒక జంటకు పుట్టిన శిశువుకు పుట్టుకతోనే డయాఫ్రం ఏర్పడలేదు. దానివల్ల కడుపు, కాలేయం, మూత్రపిండాలు అన్నీ గుండె భాగంలోకి వచ్చే శాయి. ఇంత సంక్లిష్టమైన కేసును కేవలం కీహోల్ సర్జరీ మాత్రమే చేసి.. శిశువు ప్రాణాలను బంజారాహిల్స్ లోని లిటిల్ స్టార్ అండ్ షి ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ ఆస్పత్రి వైద్యులు కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రికి చెందిన ప్రముఖ సీనియర్ నియోనటాలజిస్ట్ డాక్టర్ సతీష్ గంట విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. "సౌదీ అరేబియాలో ఉంటున్న జంట డెలివరీ కోసం భారత దేశానికి వచ్చారు. మొదట నగరంలోని వేరే హాస్పిటల్ లో వివిధ పరీక్షలు చేసిన తర్వాత శిశువుకు ఈ సమస్య ఉందని వైద్యులు గుర్తించారు. చివరకు లిటిల్ స్టార్ అండ్ షి ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడ అన్ని రకాల పరీక్షలు చేసి, ముందుగా ప్రసవం చేసిన తర్వాత... శిశువు పుట్టిన నాలుగో రోజున శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించాం. మామూలుగా అయితే ఇలా కడుపు కూడా గుండె భాగంలోకి వెళ్లిపోతే చాలా వరకు శిశువులు చని పోతారు. ఊపిరితిత్తులు ఉండాల్సిన చోట ఉండకుండా పక్కకు జరగడంతో తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. పై గా.. ఇలాంటి శస్త్రచికిత్సలను సాధారణంగా ఓపెన్ పద్ధతిలో.. అంటే కోసి చేస్తారు. కానీ, శిశువు వయసు దృష్ట్యా, అత్యంత సంక్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను కూడా మేం కీహో ల్ పద్ధతిలోనే చేశాం. దాని ద్వారా ముందుగా వేర్వేరు ప్రదేశాలలో ఉన్న కీలక అవయవాలైన మూత్రపిండాలు, కాలేయం, కడుపు లాంటివాటిని వాటి వాటి స్థానాల్లోకి ప్రవేశపెట్టాం. తర్వాత అవి మళ్లీ పైకి రాకుండా కృత్రిమ డయాఫ్రంను ఏర్పాటు చేశాం. తద్వారా.. శిశువు ప్రాణా లకు ఎలాంటి ముప్పు లేకుండా కాపాడగలిగాం. ఇలాంటి పరిస్థితుల్లో శిశువును దాదాపు మూడు లేదా నాలుగు నెలల పాటు హాస్పిటల్స్ ఉంచాల్సిన పరిస్థితి ఉండేది కానీ... అన్ని విధాలా శిశువును బాగు చేసి మూడున్నర వారాల్లోనే డిశ్చార్జి చేసి పంపుతున్నాం" అని డాక్టర్ సతీష్ గంట తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి.. వైద్యులకు శిశువు తల్లి దండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల గొంతుకగా నవతెలంగాణ



నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా సమస్యల్ని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో నవ తెలంగాణ తెలుగు దినప్రతిక చిత్తశుద్ధితో పనిచేస్తుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం నవ తెలంగాణ నూతన క్యాలెండర్, డైరీని ఆయన తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవ తెలంగాణ దినపత్రిక ప్రజల దృష్టితోనే వార్తా విశ్లేషణలు, వ్యాఖ్యానా లు, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలకు కట్టుబడే వార్తా కథనాలు రాస్తుందనీ, ఆర్థికంగా, అట్టడుగున్నున్న ప్రజల గొంతుకగా నిలుస్తున్న పత్రిక నవ తెలంగాణ అని కలెక్టర్ ప్రశంసించారు. ప్రజాసమస్యలను వెలికితీసి ప్రజలకు న్యాయం జరిగే వరకు నవతెలంగాణ దినపత్రిక నిరంతరం పనిచేయడం అభినందనీయ మని, ప్రజల మన్ననలు పొందుతూ మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ పీఏ వెంకట్ రామ్ రెడ్డి పాల్గొన్నారు.

'19న ఓపెన్ వాటర్ స్విమ్మింగ్'

- అంతర్జాతీయ స్విమ్మర్ గంధం క్వీనీ విక్టోరియా



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తల్లి తలచుకుంటే బిడ్డలను లక్ష్య సాధనలో ఎంత వరకైనా తీసుకెళ్తుందనే నినాదానికి ఇది మంచి ఉదాహరణ అని, ఇంగ్లీష్ ఛానెల్ ఈదీ రెండు తెలుగు రాష్ట్రాల్లో రికార్డు నెలకొల్పిన నగరానికి చెందిన అంతర్జాతీయ స్విమ్మర్ గంధం క్వీనీ విక్టోరియా మరో రికార్డు నెలకొల్పడానికి సిద్ధ మైంది. అరేబియా మహా సముద్రం ముంబాయి సమీపంలోని మండ్వాజెట్ నుంచి గేట్ వే ఆఫ్ ఇండియా వరకు తన కుమారుడితో కలిసి ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ నిర్వహిస్తున్నట్లు గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వెల్లడిం చారు. స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మహారాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ అనుమతితో ఈ నెల 19న డిగ్రీ చదువుతున్న తన కుమారుడు స్టీఫెన్ కుమార్ (20)తో కలిసి ఈ స్విమ్మింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండ్వా జెట్ నుంచి గేట్ వే ఆఫ్ ఇండియా వరకు 18 కిలోమీటర్లు ఉంటుందని, అరేబియా మహా సముద్రంలో ఈ ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లి, కుమారుడితో కలిసి ఈ ఓపెన్ స్విమ్మింగ్ చేయడం దేశం లోనే తొలిసారి అని ఇంత వరకు ఎవరు ఇలాంటి సాహసం చేయలేదని చెప్పారు. ఈ నెల 19న ఉదయం 6:30 గంటలకు మండ్వాజెట్ వద్ద ఈ స్విమ్మింగ్ ను ప్రారంభించి అదే రోజు సాయంత్రం వరకు గేట్ వే ఆఫ్ ఇండియా చేరుకుంటామని, ఈ నెల 18న ముంబాయి బయలుదేరి వెళ్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ పిన్ స్విమ్మింగ్ లో ఇప్పటికే తాను గోల్డ్, సిల్వర్, కాంస్య పతకం సాధించానని తెలిపారు.స్విమ్మింగ్ కు వయస్సుతో సంబంధం లేదని, భవిష్యత్ తరాలకు తెలియజేయడం కోసమే తాను స్విమ్మింగ్ చేస్తున్నానని, విద్యార్థిని, విద్యార్థులు విహార యాత్రలకు వెళ్లినప్పుడు సెల్ఫీ ఫోటోల కోసం చెరువులు, రిజర్వాయర్లు, కెనాల్స్ లోకి దిగి మృత్యువాత పడుతున్నారని, అందుకు ప్రతి ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా స్విమ్మింగ్ నేర్చుకోవాలని ఆమె సూచించారు.

చెడిపోయిన బోరు.. ఎవరు పట్టించుకోరు..

- ఆరు నెలలైనా మరమ్మతులకు నోచుకోని వైనం..
- ఉమాదేవినగర్ వాసుల పాట్లు..



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యం గాజుల రామారం డివిజన్ ఉమాదేవినగర్ ప్రాంత వాసుల పాలిట శాపంగా మారింది. దీంతో గత ఆరు నెలలుగా క్రితం బోరు మోటారు చెడిపోవడంతో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.సమ్మయ్య యాదవ్ గురువారం నవ తెలంగాణతో వాపోయారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా మమూలుగా మరమ్మతులు చేసి వెళ్లిపోయారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజా సమస్యలు లేకుండా చేస్తామ ని చెప్పిన ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకున్న పాపన పోవడం లేదని బస్తీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఈ సమస్య ఉంటే ఇలాగే నిర్లక్ష్యం చేస్తారా అని స్థానిక మహిళలు ప్రశ్నించారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బోరు మోటర్ మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిది ద్దడమే నా ప్రథమ లక్ష్యమని హైదర్నగర్ డివిజన్ కార్పొ రేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు హెూలిస్టిక్ ఆస్పత్రి వద్ద చేపడుతున్న వరద కాలువ పనులు నిమిత్తం జరుగుతున్న పనులను, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ అన్ని డిపార్ట్మెంట్లు, ప్రజల సహకారంతో పనులు వేగంగా జరు గుతున్నాయన్నారు. పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చి న వినతి మేరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో డివిజన్‌లో అత్యవ సరం ఉన్న చోట, నిత్యం సమస్యలతో ఉన్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామన్నారు. శాశ్వత పరిష్కారం దిశగా పనులు జరుగుతున్నందున ప్రజలు సంయమనం పాటించి ట్రాఫిక్ మళ్లింపుల దగ్గర క్రమ శిక్షణతో అధికారులకు సహకరించాలన్నారు. ఏ చిన్న సమ స్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్క రిస్తామన్నారు. కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలతో చేపట్టాల న్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల న్నారు. హైదర్ నగర్ డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్గా తీర్చిదితామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్ , డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

24న మంచిర్యాలలో జరిగే ఐక్యతా సభను జయప్రదం చేయాలి



- పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.అనసూయ, అందే మంగ

నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) 24న మంచిర్యాలలో జరిగే ఐక్యతా సభను జయప్రదం చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు జి.అనసూయ, అందే మంగ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీఓడబ్ల్యూ ఐక్యత సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు అనసూయ, అందే మంగలు మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం లక్ష్యంగా అభ్యుదయ మహిళా సంఘాన్ని పీఓడబ్ల్యూను 1974 లో స్థాపించారన్నారు. ఆనాటి నుండి మహిళలపై హింసకు, వేధింపులకు, అశ్లీల, అసభ్య సంస్కృతికి సాహిత్యానికి, వరకట్న వేధింపులు, హత్యలకు, లైంగిక అత్యాచారాలకు వ్యతిరేకంగా తన కార్యక్రమాలను ప్రారంభించిందని తెలిపారు. కార్మిక హక్కులను కాలరాసే కోడ్‌లను బీజేపీ ప్రభుత్వం చేసింది. తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాడడానికి సంఘాలు పెట్టే హక్కుని, సమ్మెలు చేసే హక్కుని రద్దు చేసిందన్నారు. మహిళలు సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలని, పని స్థలాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం కమిటీలను వేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న రెండు ప్రగతిశీల మహిళా సంఘాల ఐక్యతా సభను జయప్రదం చేయాలని, మహిళా ఉద్యమ నిర్మాణంలో ప్రధాన భూమికను పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి .సంధ్య, జి ఝాన్సీ, గీత, పద్మ భారతీ,ప్రేమలత, తదితరులున్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి..



- హైదరాబాద్ నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వ ప్రసాద్..
- అబిడ్స్ జీపీఓ వద్ద రోడ్డు భద్రత వారోత్సవాలు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ద్విచక్ర వాహనదారులు తలకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హైదరాబాద్ నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వ ప్రసాద్ అన్నారు. గురువారం అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జీపీఓ చౌరస్తా వద్ద ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ఎల్.రవికుమార్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనే ముఖ్యఅతిథిగా పాల్గొని హెల్మెట్ ధరించిన టు వీలర్ వాహనదారులకు గులాబీ పూలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టూ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. మృత్యువాత కూడా పడుతున్నారన్నారు. ట్రిపుల్ రైడింగ్, మొబైల్ డ్రైవింగ్, అపోజిట్ డ్రైవింగ్, స్పీడ్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ చేసి వాహనాలు రోడ్డుపైకి వస్తే చాలాన్ తో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జీబ్రా క్రాసింగ్ లైన్స్, ట్రాఫిక్ సిగ్నల్స్ ను పాదాచారులు పాటించాలన్నారు. వాహనదారుల రక్షణ కోసమే ఈ అవగాహన అని తెలిపారు. ఈ సందర్భంగా ఆఘా ఖాన్ సొసైటీ సభ్యులతో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారికి డ్రామా రూపకంగా ప్రదర్శించి వారిలో చైతన్యాన్ని తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ ఎస్.అశోక్ కుమార్, అడిషనల్ డీసీపీ రామదాసు తేజ, సైదాబాద్ డివిజన్ ఏసీపీ ఏర్నా , అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రవికుమార్, ఎస్‌ఐలు ఆర్ పాండురాజు, మహేష్ నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భూములను కబ్జా చేసిన వారిని అరెస్టు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ వెస్ట్ మియాపూర్ సిటీ తెల్లాపూర్ మొక్కిలలో గిరిజన భూములను కబ్జా చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన అంటే మార్పు.. మార్పు అంటే గిరిజనుల భూములను కబ్జా చేయడమేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల భూములు లాక్కోవడం ఎంతవరకు సమాజసం అని ప్రశ్నించారు. మోకిలా తెల్లాపూర్‌లో లంబాడి బిడ్డాల భూములను కబ్జా చేస్తున్నారని ఖబర్దార్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లంబాడి బిడ్డల భూములను జోలికొస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రైతులుపై కేసులు ఎత్తివేయాలని లేదంటే పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని నరసింహ నాయక్ హెచ్చరించారు.

ఇంగ్లీష్ ఛానల్ ఈదిన విక్టోరియాకు వాకర్స్ క్లబ్ ఘన సత్కారం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇంగ్లీష్ ఛానల్ ఈదిన తొలి తెలుగు మహిళా గంధం క్వీన్ విక్టోరియాను వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ సుందరయ్య పార్క్ ప్రెసిడెంట్ అండ్ టీం గురువారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కులో నిర్వహించిన అభినందన సభలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్, పార్క్ ప్రెసిడెంట్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తొలి తెలుగు మహిళగా ఇంగ్లీష్ ఛానల్‌లో స్విమ్మింగ్ చేసి తెలంగాణతో పాటు దేశం యొక్క ఖ్యాతిని నిలబెట్టినందుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సుమారు 17 గంటలు 77 కిలోమీటర్ల పాటు ఇంగ్లీష్ ఛానల్‌లో ఆమె పిన్ స్విమ్మర్‌గా చేశారని ఇది స్విమ్మింగ్ ఎవరెస్టు అని కొనియాడారు. ఆమె సుందరయ్య పార్కు వాకర్‌గా కావడం గర్వకారణమన్నారు. మరో ఏడు చానల్లో స్విమ్మింగ్‌కు ఆమె సిద్ధమవుతున్న నేపథ్యంలో అందరూ పూర్తిగా అండగా నిలబడాల్సిందన్నారు. ప్రభుత్వంతో పాటు ఆమెను అనేకమంది ప్రోత్సహించాలని కోరారు. పీవీ నిరంజన్ రెడ్డి ప్రెసిడెంట్‌గా తను రూ. 5వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ హైదరాబాద్ సెంట్రల్ సుందరయ్య పార్క్ కార్యదర్శి సైకం మనోహర్ రెడ్డి, కోశాధికారి మద్దెల దశరథ్ ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ వి.నాగభూషణం, ఇంటర్నేషనల్ మాజీ రీజనల్ కౌన్సిలర్ మురళీకృష్ణ మాజీ ప్రెసిడెంట్ సలిపెల రమేష్ రెడ్డి, అంబటి శ్రీనివాస్ రెడ్డి, శైలజా మోహన్, వాకర్స్ క్లబ్ సభ్యులు నిమ్మల రాజశేఖర్, టీ స్కైలాబ్ బాబు, పద్మ గౌడ్, వెంకట స్వామి గౌడ్, సత్య నారాయణ, మాస్టర్ కృష్ణ, రఘురాంరెడ్డి, జీవన్ ఆదిత్య, వీరయ్య మానిక్ రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బలమైన కార్మికోద్యమ నిర్మాణానికి ఐఎఫ్‌టీయుల విలీన సభ

- రేపు కొత్తగూడెంలో జరిగే సభను విజయవంతం చేయండి
- ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాస్ ఆర్.జనార్ధన్..



నవతెలంగాణ-ముషీరాబాద్

బలమైన కార్మికోద్యమ నిర్మాణం, కార్మిక వర్గ విశాల ప్రయోజనాలకు జనవరి 18న కొత్తగూడెంలో ఐఎఫ్‌టీయుల విలీన సభను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఆర్.జనార్ధన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్ లో వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఆర్.జనార్ధన్‌లు మాట్లాడుతూ బావ సరూప్యత కలిగిన విప్లవ కార్మిక సంఘాలైన రెండు ఐఎఫ్‌టీయులు ఐక్యం కావాలనే నిర్ణయానికి వచ్చి జనవరి 18న భద్రాది కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో జి.అనురాధ, కృష్ణల అధ్యక్షతన ఐక్యత సభ జరుగుతుందని ఈ సభకు ముఖ్య అతిథిగా ఐఎఫ్‌టీయు అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభలో వివిధ అంశాలపై మాట్లాడడానికి ఐఎన్‌టీయు జాతీయ నాయకులు బి.ప్రదీప్, సాధినేని వెంకటేశ్వర రావు, పి.ప్రసాద్, టి.శ్రీనివాస్ రాష్ట్ర కార్యదర్శులు ఎం. శ్రీనివాస్ ఆర్.జనార్ధన్‌లు పాల్గొంటారని తెలిపారు. దేశంలోని విశాల కార్మిక క్షేత్రంలో ఒక ప్రత్యామ్నాయ విధానాలతో ఏర్పడిన ఐఎన్‌టీయు గత నాలుగున్నర దశాబ్దాలుగా బలమైన నిర్మాణాత్మక కార్మికోద్యమాన్ని నిర్మించింది. రాజకీయ బావసారుభ్యత కలిగిన ఈ రెండు సంస్థలు కార్మిక వర్గ విషయాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఐక్యం కావాలని నిర్ణయించుకున్నాయని ఈ ఐక్యత మరింత బలమైన విప్లవ కార్మికు ఉద్యమ నిర్మాణం విస్తరణకు దోహదపడుతుంది కనుక ఈ ఐక్యత సభను విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉర్దూ సాహిత్యంపై సదస్సు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలోని దర్బార్ హాల్లో ఉర్దూ భాష, సాహిత్య ప్రోత్సహించడంలో ముస్లిం హేతర కవులు రచయితల పాత్ర భారతదేశ సమకాలిక నాగరికతపై మూడు రోజుల సదస్సును ప్రొఫెసర్ ఎస్. నసీమ్ నేతృత్వంలోని యూనివర్సిటీ ఉర్దూ విభాగం నిర్వహించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ సూర్య ధనంజయ్ అధ్యక్షతన ముఖ్య అతిథిగా అసఫ్ జాహీ రాజవంశం 9వ నిజాం రౌనక్ యార్ ఖాన్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉర్దూను సంస్కృతి సామరస్య భాషగా ప్రచారం చేయడంలో వివిధ రచయితలు, కవులు కృషి చేయాలన్నారు. మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు మాట్లాడుతూ "ఆసఫ్ జాహీ రాజవంశం యొక్క వారసత్వం దాని రాజుల మూలాల గురించి మాత్రమే కాదు, సంస్కృతి, భాష, సాహిత్యాన్ని కాపాడాలన్నారు. అనంతరం వారిని జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అకడమిక్ అఫైర్స్ డైరెక్టర్ డాక్టర్ లోక పావని, మిస్టర్ అథర్ అలీ అసద్, ఢిల్లీ యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్ అకీల్ అహ్మద్, జెఎన్‌యు ప్రొఫెసర్ ఖ్వాజా మహ్మద్ ఎక్రముద్దీన్‌తో సహా ప్రముఖ వ్యక్తులు ప్రత్యేక ప్రసంగాలు చేశారు. సమావేశంలోది సియాసత్ డైలీలో సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ రియాజ్ అహ్మద్, కవులు రచయితలు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం



నవతెలంగాణ జగద్గిరిగుట్ట

వృద్ధుడు అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట, రింగు బస్తీలో దామెర రామ చందర్, శశికళ దంపతులు నివసిస్తున్నారు. రామచందర్ (65) పెయింటర్‌గా పనిచేస్తుండేవారు. ఇదిలా ఉండగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుండి స్వెటర్ షార్ట్ వేసుకుని వెళ్లాడని వృద్ధుడికి మతిస్థిమితం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి వరకు రాకపోవడంతో చుట్టుప్రక్కల వెతికిన బంధువులను వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో గురువారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో భార్య శశికళ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సిం గ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శివరాజ్ కుటుంబాన్ని పరామర్శించిన కార్పొరేటర్ వై. అమృత



నవతెలంగాణ-అంబర్‌పేట

ఇటీవల చైనా మంజ తలిగి ఆస్పత్రిలో చికిత్స పొం ది డిశ్చార్జ్ అయిన తర్వాత ఇంట్లో రెస్ట్ తీసుకుంటున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ శివరాజ్‌ని నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరగా కోలుకొని మళ్లీ వీధుల్లోకి చేరాలని కోరారు. ఈ కారక్రమంలో స్థానిక నాయకులు గోపి, అర్జున్ తదితరులున్నారు.

నేడు కాచిగూడలో బీసీ మేధావుల సదస్సు

- జాతీయ బీసీ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం



నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సమగ్ర కులగణన సర్వేను 100 శాతం పూర్తి చేసిన తర్వాతనే రిజర్వేషన్లు అమలు చేయాలని అనే అంశంపై బీసీ మేధావుల సదస్సును కాచిగూడ అభినందన్ హెూటల్ లో నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, బీసీ మేధావులు హాజరవుతున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తెలిపారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు విద్యుత్ ఫీడర్ నిర్వహణ మరమ్మతు పనుల కారణంగా మల్లంపేట ఫీడర్ పరిధిలో ఉదయం 11:00 గం.ల నుండి మధ్యాహ్నం 12:00 గం.ల వరకు మల్లంపేట్ హై-రైజ్ విల్లాస్, ఏపి ఆర్ విల్లాస్, జీబీసీ విల్లాస్, డ్రీమ్ వ్యాలీ కాలనీ, గ్రీన్ పార్క్ కాలనీ, ఆకాష్ లేఅవుట్, మారుతీ నగర్ మొదలైన ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట విద్యుత్ శాఖ ఏ ఈ బి.సాయికిరణ్ తెలిపారు.



నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానిస్తున్న షాలోమ్ ఆఫ్ హెూప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అశోక్ కాంగ్రెస్ నాయకులు ఆర్‌ఎం వినోద్ కుమార్ తదితరులు నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నవతెలంగాణ మానవి
శుక్రవారం 17 జనవరి 2025
www.navatelangana.com
హైదరాబాద్

ఈ చిట్కాలు పాటిస్తే..

వాషింగ్ మెషిన్‌లో బట్టలు వేసినప్పుడు మురికి సరిగ్గా వదలడంలేదని చాలా మంది చెబుతుంటారు. చేతుల దగ్గర, కాలర్ దగ్గర మురికి అలానే ఉండిపోతుందని, ఎంత డిటర్జెంట్ వాడినా ఫలితం ఉండడం లేదని చెబుతుంటారు. అయితే ఈ టిప్స్ పాటించడం వల్ల నల్లటి మరకలు కూడా మెషిన్‌లోనే ఉతికేయొచ్చు. తెలుసుకుందాం..

నిండుగా బట్టలు వేయకూడదు

బట్టలు సరిగ్గా ఉతకాలంటే వాషింగ్ మెషిన్ నిండుగా బట్టలు వేయకూడదు. ఇలా వేయడం వల్ల బట్టలు శుభ్రం కావు. మురికి కూడా సరిగ్గా వదలదు. బట్టలు సరిగ్గా ఉతకాలంటే మిషన్‌లో ఎప్పుడూ కొంత స్థలాన్ని వదిలేయాలి. 10 కేజీల సామర్థ్యం ఉన్న మెషిన్ ఉన్నప్పటికీ కేవలం 7 నుంచి 8 కేజీల వరకు మాత్రమే అందులో వేయాలి. అలాగే బట్టలు సగం ఉతికిన తరువాత మళ్లీ కొద్దిగా లిక్విడ్ లేదా పౌడర్ వేయాలి. ఈ విధంగా బట్టలు సులభంగా శుభ్రం చేయవచ్చు.

చొక్కా కాలర్ ఎలా శుభ్రం చేయాలి?

షర్ట్స్ మిషిన్‌లో వేస్తే.. వాటిని తిప్పి వేయాలి. ముందుగా షర్ట్‌ను ఒక అరగంట బకెట్‌లో సర్ఫ్ లేదా లిక్విడ్ వేసి నానిన తర్వాత మెషిన్‌లో వేస్తే మురికి బాగా పోతుంది.

మెషిన్ టబ్, ఫిల్టర్ శుభ్రంగా ఉంచుకోవాలి

వాషింగ్ మెషిన్ టబ్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి. యంత్రం పూర్తిగా ఆరిపోయిన తర్వాత, తడి గుడ్డతో తుడవాలి. 15 రోజుల కొకసారి ఫిల్టర్‌ని తీసి శుభ్రంచేస్తూ వుండాలి. ■



విషాదం నుండి ఆశవైపుగా...

జె జెస్సిలా ఏంజెలిన్... తన కుటుంబ సభ్యుల పుట్టిన రోజు వేడుకను జరుపుకునేందుకు ఓ అనాథా శ్రమానికి వెళ్ళారు. అక్కడి ఓ నెలల బాబు విషాద జీవితం ఆమెకు ఓ లక్ష్యాన్ని నిర్దేశించింది. క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారికి మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలను కున్నారు. అంతేకాదు తమ ప్రియమైన వారిని పోగొట్టుకున్న అనాథలకు, కుటుంబం భారంగా భావించి వదిలేసిన వృద్ధులకు అండగా నిలబడ్డారు. దీనికోసమే 'వీ విటమిన్ గ్లోబల్' అనే సంస్థను స్థాపించారు. దీని ఆధ్వర్యంలో విస్తృతమైన సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

గత ఏడాది సెప్టెంబర్ 27న కూడా మంసాపురం గ్రామంలో రోజూ మాదిరిగానే సూర్యుడు ఉదయించాడు. రాబోయే తుఫాను గురించి తెలియని ఆ గ్రామంపై తన బంగారు కాంతిని ప్రసరింపజేశాడు. గ్రామానికి చెందిన 35 మందికి పైగా ఎక్కిన మినీబస్సుకు జరిగిన ప్రమాదంలో తమ ప్రియమైన వారిని పోగొట్టుకున్న ఆరోజు అది సాధారణ దినచర్యగా లేదు. సూర్యుని వెచ్చదనంతో పాటు కన్నీటితో వారి హృదయం బరువెక్కిన ఉదయంగా మారింది. కొన్ని గంటల్లోనే ఉద్రేకపూరితమైన ఫోన్ కాల్స్ వారి ప్రశాంతతను బద్దలు కొట్టాయి. ప్రమాదం గురించి భయంకరమైన వార్తను అందించాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని ఓ ఇరుకైన రహదారి నుండి ప్రయాణిస్తున్న మినీబస్సు అదుపుతప్పి ఒక గొయ్యిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు సహా నలుగురు మరణించారు. 27 మంది తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబాలు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో అక్కడి వాతావరణమంతా దు:ఖ సంద్రంలా మారిపోయింది.

ఓ ఆశా దీపంగా

ప్రమాదం జరిగి పరిస్థితి అల్లకల్లోలంగా ఉన్న సమయంలో జె జెస్సిలా ఏంజెలిన్ ఓ ఆశా దీపంగా ఉద్భవించింది. 35 ఏండ్ల వయసు గల ఆమె శ్రీవిల్లిపుత్తూరుకు చెందిన 'వీ విటమిన్ గ్లోబల్' అనే ఓ ఎన్జీఓకు సీఈఓ. ఆమె అక్కడకు చేరుకోకముందే ఆమె బృందం అక్కడ ఉంది. ప్రమాదానికి గురైన వారికి సహాయ చర్యలు అందిస్తూనే బంధువులను ఓదార్చుతున్నారు. తీవ్రంగా గాయపడిన 19 ఏండ్ల పువిరాజ్‌ను గుర్తించిన జెస్సిలా వెంటనే వైద్యులతో సమన్వయం చేసుకుని, మధురైలో అత్యవసర వైద్య సంరక్షణను ఏర్పాటు చేసింది. ప్రమాదం జరిగిన నెలల తర్వాత కూడా ఆమె పువిరాజ్ కుటుంబానికి మద్దతుగా నిలిచింది. 'జెస్సిలా ఉనికి ఒక అద్భుతం. ఆమె నా మేనల్లుడి ప్రాణాన్ని కాపాడింది' అని పువిరాజ్ మామ ఎస్ రామసామి ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌తో పంచుకున్నారు.



వాస్తవ కథలు ఎన్నో

ఆ బాబును కాపాడం జెస్సిలా చేసిన మొదటి సాహసం కాదు. ఏడాది కిందట ఓ ప్రమాదంలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక కళాశాల విద్యార్థిని రక్షించడానికి ఆమె ముందుకు వచ్చింది. విద్యార్థి తల్లిదండ్రులు మైళ్ల దూరంలో ఉండటంతో జెస్సిలా అతనికి వైద్య సహాయం అందేలా చూసుకుంది. అంతేకాదు అతని కుటుంబం వచ్చే వరకు అతని పక్కనే ఉంది. కరుణ, సామాజిక స్పృహ కలిగిన ఆమె జీవితంలో ఇటువంటి వాస్తవ కథలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి కథలు ఓ దశాబ్దానికి పైగా లెక్కలేనన్ని పుట్టుకొచ్చి వారి జీవితాలను తాకుతుంది. జెస్సిలా ఒడిస్సీ పదేండ్ల కిందట ఓ అనాథాశ్రమాన్ని సందర్శించడంతో ఆమె పని ప్రారంభమైంది. కుటుంబ సభ్యుని పుట్టినరోజును ఆనందంగా జరుపుకోవాలని అక్కడకు వచ్చిన ఆమె జీవితాన్ని మార్చే క్షణంగా ఆ రోజు మారింది. తల్లిదండ్రుల ఆత్మహత్య చేసుకోవడంతో అనాథగా మారిన ఓ ఎనిమిది నెలల శిశువు కథను ఆమె అక్కడ విన్నది. 'అంత నిరాశకు గురై ఎవరూ ఇలా తమ జీవితాలను అర్థాంతరంగా ముగించకూడదని నాకు అప్పుడు తెలిసింది. అప్పుడే మానసిక ఆరోగ్య అవగాహన నా లక్ష్యం అయింది' అని జెస్సిలా గుర్తుచేసుకున్నారు.

వీ విటమిన్ గ్లోబల్ స్థాపన

మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కొంతకాలం ఓ ఎన్‌జీఓలో స్వచ్ఛందంగా పనిచేసిన తర్వాత జెస్సిలా తన భర్తతో కలిసి 2019లో 'వీ విటమిన్ గ్లోబల్'ను స్థాపించారు. మొదట కళాశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌లతో వారి ప్రయాణం ప్రారంభమైంది. ఆ తర్వాత ఆకలి నుండి పర్యావరణ పరిరక్షణ వరకు విస్తృత సామాజిక సవాళ్లను పరిష్కరించడానికి క్రమంగా అభివృద్ధి చెందింది. ఉదాసీన ప్రపంచంలో నిర్లక్ష్యానికి గురైన వారికి ఆమె సేవా కార్యక్రమాలు ఓ ధైర్యాన్ని ఇస్తున్నాయి. ఆమె శాశ్వత కార్యక్రమాలలో ఒకటి నిరాశ్రయులకు, వదిలివేయబడిన వారికి రోజువారీ భోజనాలు అందించడం. 'కోవిడ్-19 లాక్‌డౌన్ సమయంలో ప్రజలు ఆకలితో అలమటించడం చూశాను. కానీ వారందరికీ సహాయం అందించేందుకు నేను తిరగలేకపోయాను' అని ఆమె పంచుకున్నారు. గత నాలుగేండ్లుగా ఆమె బృందం ప్రతిరోజూ సగటున 40 మందికి భోజనాలు వడ్డిస్తోంది.

అవధులు లేని సేవ

జెస్సిలా కార్యక్రమాల్లో పర్యావరణ పరిరక్షణ మరొక ముఖ్యమైన భాగం. ఆమె బృందం రెండు నెలలకోసారి అడవిని శుభ్రపరచడం, చెట్ల పెంపకంతో పాటు ఉద్యానవన విద్యార్థుల కోసం ఇంటర్న్‌షిప్‌లను చేపట్టి యువతలో ప్రకృతి ప్రేమను పెంపొందిస్తుంది. అలాగే పండుగులకు పేదలకు దుస్తులను పంపిణీ చేయడం నుండి అనాథ మృతదేహాలను దహనం చేయడం వరకు జెస్సిలా సేవా కార్యక్రమాలకు అవధులు లేకుండాపోయాయి. ఆమె ప్రయత్నాలు కేవలం తక్షణ ఉపశమనం గురించి మాత్రమే కాదు, మానవత్వం, సంస్కృతిని పెంపొందించడం కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు. శ్రీవిల్లిపుత్తూరు బస్ స్టాప్‌లో వదిలివేయబడిన వృద్ధ మహిళను ఉదాహరణగా తీసుకోండి. స్థానిక పోలీసులతో కలిసి జెస్సిలా బృందం ఆమెను తన కుటుంబంతో తిరిగి కలిపిం ది. కానీ కొద్ది రోజులకే ఆ కుటుంబం మళ్లీ ఆమెను వదిలివేసింది. ఆ సంఘటనను గుర్తు చేసుకుంటూ 'మనం మానవత్వాన్ని దాని ప్రధాన భాగంలో పునర్నిర్మించాలి' అని జెస్సిలా అంటున్నారు. ఆ మాట చెబుతున్నపుడు ఆమె స్వరం దృఢ సంకల్పంతో దు:ఖంతో నిండిపోయింది.



కరుణ అనేది ఓ అంటువ్యాధి

జెస్సిలా సేవా కార్యక్రమాలు చాలా మందిలో ఆశ, క్రియాశీలత విత్తనాలను నాటింది. ఆమె అంకితభావాన్ని చూసి ప్రేరణ పొందిన అనేక మంది యువకులు, పెద్దలు 'వీ విటమిన్ గ్లోబల్'లో వాలంటీర్లుగా చేరారు. ఒకప్పుడు ఆమె నుండి సహాయం పొందిన వారు కొందరు ఇప్పుడు ఆమె మిషన్‌కు అండగా నిలబడ్డారు. ఈ విధంగా కరుణ అనేది ఓ అంటువ్యాధి అని నిరూపిస్తున్నారు. భవిష్యత్తులో జెస్సిలా అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలను నిర్మించాలని కలలు కంటున్నారు. 'చేయాల్సింది ఇంకా చాలా ఉంది' అని ఆమె నిశ్శబ్ద సంకల్పంతో ప్రకటిస్తున్నారు. వృత్తిరీత్యా ఈవెంట్ ప్లానర్ అయినప్పటికీ జీవితాలను మార్చడంలో, విరిగిన ఆత్మలను బాగుచేయడంలోనే ఆమెకు నిజమైన తృప్తి ఉందని చెబుతున్నారు. ఒకప్పుడు దు:ఖంలో మునిగిపోయిన గ్రామంలో జెస్సిలా స్థితిస్థాపకత, ఆశకు చిహ్నంగా మారింది. విషాదం ఎదురైనప్పుడు కూడా మనిషిలోని కరుణ ఇతరులకు మార్గాన్ని వెలిగించగలదని ఆమె ప్రయాణం మనకు గుర్తు చేస్తుంది. ఇలా తన ఆశా రెక్కలను విప్పుతూ ఆమె మనందరినీ కలలు కనడానికి, కష్టంలో ఉన్న వారిని ఆదుకోడానికి, మానవత్వ శక్తిని విశ్వసించడానికి ఆహ్వానిస్తున్నారు. ■

ఓఎంఆర్ పద్ధతిలో నీట్ యూజీ-2025 పరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ యూజీ-2025 పరీక్షను పెన్-పేపర్ (ఓఎంఆర్) పద్ధతిలోనే నిర్వహించనున్నారు. దేశమంతా ఒకే రోజు ఒకే షిఫ్టులో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్టు కేంద్ర విద్య, ఆరోగ్యశాఖల మధ్య సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం నిర్ణయించినట్టు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) వెల్లడించింది. 2024లో 24లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. పరీక్షను నిర్వహించే విధానంపై ఇస్రో మాజీ చైర్మెన్ కస్తూరి రంగన్ చైర్మెన్‌గా నియమించిన నిపుణుల కమిటీ సైతం ఆన్‌లైన్ విధానం (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-సీబీటీ)లో నీట్ నిర్వహించాలని సిఫారసు చేసింది. అయితే, తాజాగా కేంద్ర విద్య, ఆరోగ్య శాఖలు జరిపిన చర్చల్లో ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించేందుకు నిర్ణయించారు.

హిండెన్‌బర్గ్ క్లోజ్

(మొదటిపేజీ తరువాయి)

సంపన్నుల జాబితాలో అదానీ స్థానం కూడా పడిపోయింది. ఇటు, భారత రాజకీయాలనూ హిండెన్‌బర్గ్ నివేదిక షేక్ చేసింది. ముఖ్యంగా, కేంద్రంలోని మోడీ సర్కారుపై ప్రతిపక్షాల విమర్శలతో ఎన్డీఏ ప్రభుత్వం ఇరుకున పడింది. పార్లమెంటులో అదానీ అంశం పైనే ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టిన విషయమూ తెలిసిందే. అయితే, అదానీ గ్రూపు హిండెన్‌బర్గ్ ఆరోపణలను తోసిపుచ్చింది. గతేడాది ఆగస్టులోనూ హిండెన్‌బర్గ్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) చైర్‌పర్సన్ మాధవి బచ్, ఆమె భర్త దావల్ బచ్‌ల పైనా ఆరోపణలు చేయటం, అది కూడా రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీయటం సంచలనంగా మారిన విషయం విదితమే.

ఆరాధనా స్థలాల చట్ట పరిరక్షణకు జోక్యం చేసుకోవాలి

సుప్రీంను ఆశ్రయించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఆరాధనా స్థలాల చట్టం, 1991కి ఎదురవుతున్న సవాళ్ల విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాల్సిందిగా కోరుతూ కాంగ్రెస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. జాతీయవాదం, స్వాతంత్య్రోద్యమంలో భాగంగానే భారతదేశంలో లౌకికవాదం అభివృద్ధి చెందిందని ఈ సందర్భంగా పార్టీ వ్యాఖ్యానించింది. భారత ప్రజల ఆదేశాన్ని ఈ చట్టం ప్రతిబింబిస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ అన్నారు. భారత్‌కు స్వాతంత్య్రం లభించినపుడు 1947 ఆగస్టు 15నాటికి నెలకొని వున్న ఆరాధనా స్థలాల స్వభావాన్ని ఈ చట్టం పరిరక్షిస్తోంది. 10వ లోక్‌సభలో ఈ చట్టాన్ని ఆమోదించారు. దేశంలో లౌకికవాదాన్ని పరిరక్షించేందుకు ఈ చట్టం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్ళను చూస్తుంటే ఇప్పటికే వేళ్లూనుకుపోయిన లౌకికవాద సిద్ధాంతాలను దెబ్బతీసేలా దురుద్దేశపూరితమైన ప్రయత్నాలు జరుగుతున్నట్లు కనిపిస్తోందని పార్టీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ చట్టం యొక్క రాజ్యాంగబద్ధమైన, సామాజికపరమైన ప్రాధాన్యతను నొక్కి చెప్పడానికిగానూ ఈ విషయంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని పార్టీ కోరుతోందని వేణుగోపాల్ పేర్కొన్నారు.

సీపీఐ(ఎం) 24వ మహాసభల లోగో ఆవిష్కరణ

మదురై: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ అఖిల భారత మహాసభలు 2025, ఏప్రిల్ 2 నుంచి 6వ తేదీ వరకు తమిళనాడులోని మదురైలో జరగనున్నాయి. ఈ సందర్భంగా మధురైలోని తిక్కతిర్ హాలులో గురువారం అఖిల భారత మహాసభల లోగోని కేంద్ర కమిటీ సభ్యురాలు యు.వాసుకి ఆవిష్కరించారు. ఈ సమావేశానికి తమిళనాడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం అధ్యక్షత వహించారు. ఆహ్వాన సంఘం కార్యదర్శి, ఎంపీ సు.వెంకటేశన్ స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం కేంద్ర కమిటీ సభ్యుడు, ఆహ్వాన కమిటీ చైర్మెన్ కె.బాలకృష్ణన్ ఆహ్వాన కమిటీ కార్యాలయాన్ని ప్రారంభించి, ప్రసంగించారు. ఈ మేరకు తమిళ, ఆంగ్ల భాషల్లో వేర్వేరుగా లోగోలను రూపొందించారు.

ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం జనవరి, 2016లో అమలులోకి తీసుకువచ్చిన 7వ వేతన సంఘం సిఫారసులు ఈ ఏడాది డిసెంబర్ 31తో ముగియనున్నాయి. ఎనిమిదో వేతన సంఘం వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి అమలులోకి రానుంది. వేతన సంఘం సిఫారసుల మేరకు ఉద్యోగులకు వేతనాలు పెరగనున్నాయి.వేతనం సంఘం ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిన నేపథ్యంలో త్వరలోనే కమిషన్ చైర్మెన్‌తో పాటు ఇద్దరు సభ్యులను నియామకం జరగనున్నది. ఉద్యోగులు, పెన్షనర్లు, ట్రేడ్ యూనియన్లు కేంద్ర ప్రభుత్వం ఎనిమిదో వేతన సంఘంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వచ్చే నెలలో కేంద్రం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్ర క్యాబినెట్ సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.3,985 కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించింది. ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ గురువారం సమావేశమైంది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మంత్రి వర్గ నిర్ణయాలను వెల్లడించారు. ప్రధానంగా భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. దాదాపు రూ.3,985 కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రోదసిలోకి మానవుడిని పంపే ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఎన్‌జీఎల్వీ రాకెట్లు భారీ శాటిలైట్లను కక్ష్యలోకి మోసుకెళ్లగలవని ఆయన తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర మంత్రివర్గంలో చర్చ..!

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర మంత్రివర్గంలో చర్చ జరిగినట్టు తెలిసింది. స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ కోసం ఆర్థిక మద్దతు ఇచ్చే విషయంపై చర్చ జరిగిందనీ, అయితే అది అప్పు రూపంలోనే ఇస్తారని తెలిసింది. అయితే మంత్రివర్గం సమావేశంలో చర్చపై కేంద్రం అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు. మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్, స్టీల్‌ప్లాంట్ అంశం గురించి ఎటువంటి ప్రకటనా చేయలేదు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి విలేకరుల సమావేశం పెడతారని చర్చ జరిగింది. అయితే దాన్ని మళ్లీ రద్దు చేశారు. నేడు (శుక్రవారం) విలేకరుల సమావేశం నిర్వహిస్తారని తెలుస్తోంది.

పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్లు దాఖలు చేసింది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌పై స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్పీ), మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై రిట్ పిటిషన్ దాఖలు చేసింది. బీఆర్ఎస్ పార్టీ తరపున న్యాయవాది మోహిత్ రావు ఈ పిటిషన్లను దాఖలు చేశారు. ముగ్గురు ఎమ్మెల్యేలపై దాదాపు 250పైగా పేజీలతో ఎస్ఎల్పీ నమోదు చేశారు. ఇందులో హైకోర్టు ఆదేశాలు, ఫిరాయింపులపై స్పీకర్‌కు అందజేసిన ఫిర్యాదులు, ఇతర అంశాలను జత చేశారు. అలాగే మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలపై సుమారు 500 పైగా పేజీలతో రిట్ పిటిషన్ వేశారు. పార్టీ మారిన ఈ 10 మందిపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా.. 9 నెలలుగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని పిటిషన్లలో ప్రస్తావించారు. తమ పిటిషన్లపై హైకోర్టు ఆర్డర్ వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా.. కనీసం స్పీకర్ కార్యాలయం ఎలాంటి నిర్ణయాలూ తీసుకోలేదని పేర్కొన్నారు. కనీసం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు కూడా ఇవ్వలేదని కోర్టుకు నివేదించారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి గతంలో కేశం మేఘాచంద్ర కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని బీఆర్ఎస్ కోరింది. ఈ తీర్పు ప్రకారం.. పార్టీ ఫిరాయింపులు, ఫిర్యాదులపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పిటిషన్‌లో పొందుపర్చింది. ఈ తీర్పును పరిగణనలోకి తీసుకొని పార్టీ మారిన 10 మందిపై నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అనర్హతపై స్పీకర్ లేదా అసెంబ్లీ సెక్రెటరీలకు సూచించాలని కోరింది.

ఢిల్లీకి హరీశ్‌రావు

పార్టీ ఫిరాయింపులపై కేసీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లాలని పార్టీ లీగల్ టీంకు ఆదేశాలు జారీ చేశారు. ఈ బాధ్యతలను మాజీ మంత్రి హరీశ్‌రావుకు అప్పగించారు. దీంతో బుధవారం మధ్యాహ్నం హుటాహుటిన హరీశ్‌రావు ఢిల్లీకి పయనమయ్యారు. ఢిల్లీ చేరిన వెంటనే అడ్వొకేట్ మోహిత్ రావు, ఇతర లీగల్ టీంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలు చేయాల్సిన ఎస్ఎల్పీ, రిట్ పిటిషన్లపై చర్చించారు. అనంతరం హరీశ్‌రావు పర్యవేక్షణలో ఈ వ్యాజ్యాలను మోహిత్ రావు సుప్రీంకోర్టులో ఫైల్ చేశారు. అయితే హరీశ్ రావు ఢిల్లీ పర్యటనను మాత్రం బీఆర్ఎస్ పార్టీ రహస్యంగానే ఉంచింది.

పునర్విభజన చట్టం ప్రకారమే

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ వ్యవహారంలో ట్రిబ్యునల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం సమర్పించిన 'అదనపు టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్'పై మొదట విచారణ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. పునర్ విభజన చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ అంశంపై మొదట వాదనలు వింటామని స్పష్టం చేసింది. 811 టీఎంసీల్లో రెండు రాష్ట్రాల వాటా తేల్చడం ముఖ్యమని ట్రిబ్యునల్ పేర్కొంది. సెక్షన్ 3 ప్రకారం రెండు రాష్ట్రాలకు కేటాయింపులపై ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వాదనలు వింటామని తెలియజేసింది. ఆ తర్వాతే సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టుల వారీగా కేటాయింపులలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. గురువారం ఢిల్లీలో జరిగిన కృష్ణా ట్రిబ్యునల్‌లో తెలంగాణ ప్రభుత్వం తన వాదనలను బలంగా వినిపించింది. గత పదేండ్లుగా రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకం 66:34 నిష్పత్తిలో కొనసాగుతున్నది. శాశ్వతంగా పరిష్కరించే దిశగా మధ్యంతర దరఖాస్తు ద్వారా కేడబ్ల్యూడీటీ-2 ఎదుట ప్రస్తావించడం ద్వారా బలంగా సవరించాలని కోరింది. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, సెక్షన్ 89 కింద రూపొందించిన అంశాలు, తదుపరి సెక్షన్ 89 కింద రూపొందించిన అంశాలు, తదుపరి రెఫరెన్స్ కింద రూపొందించిన అంశాలు, కొన్ని అదనపు అంశాలు మినహాయించి అన్నీ సమానంగానే ఉన్నాయని వాదించారు. ఈనేపథ్యంలో ట్రిబ్యునల్ తొలుత సెక్షన్ మూడు అంశాలు విచారణ పరిధిలోకి తీసుకోవాలని కోరారు. తెలంగాణకు న్యాయంగా బేసిన్ ప్రమాణాల ప్రకారం 70 శాతం నీటి కేటాయింపులు జరగాలని విజ్ఞప్తి చేశారు. కానీ, నాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 30 శాతం నీటిని మాత్రమే తెలంగాణ వినియోగానికి కేటాయించింది. వాటిని కొనసాగించడానికి ఆంధ్రప్రదేశ్ కావాలనే కాలయాపన చేస్తున్నదన్నారు. కేఆర్ఎంబీ వద్ద తాత్కాలికంగా పదేండ్ల కింద కేవలం ఒక సంవత్సరం కోసం ఒప్పుకున్న 66:34(ఏపీ:టీజీ) నీటి వినియోగాన్ని ఈ ఏడాదితోపాటు తరువాత కూడా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఆశిస్తున్నదని గుర్తు చేశారు. తెలంగాణ తనకు రావాల్సిన 70:30(టీజీ:ఏపీ) నీటి వాటాను ట్రిబ్యునల్ కేటాయింపుల ద్వారా పొందాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపించారు. తదుపరి విధివిధానాలపై సుప్రీంకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉందన్నారు. ఈనేపథ్యంలో సెక్షన్ 89ను మొదట విచారించాలని కోరారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేశారు. ఇదిలావుండగా తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సలహాదారు ఆధిత్యనాథ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై లైంగికదాడి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ఇంజినీరింగ్ విద్యార్థినిపై అమానుష ఘటన చోటుచేసుకుంది. హాస్టల్ నిర్వాహకుడు, డ్రైవర్ కలిసి లైంగికదాడికి ఒడిగట్టారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళపల్లిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మంగళపల్లిలోని ఓ ప్రయివేటు హాస్టల్‌లో ఉంటోంది. సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లిన ఆమె సెమిస్టర్ పరీక్షకు హాజరయ్యేందుకు ఈ నెల 15న మధ్యాహ్నం హాస్టల్‌కు వచ్చింది. గదిలో ఒంటరిగా నిద్రిస్తున్న విషయాన్ని గమనించిన ఆ హాస్టల్ నిర్వాహకుడు, డ్రైవర్ పక్కనబోయిన అజిత్‌తో కలిసి రాత్రి 11 గంటల సమయంలో గదిలోకి ప్రవేశించి ఆ విద్యార్థినిపై లైంగికదాడి చేశారు. విషయాన్ని బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పింది. కుటుంబసభ్యులు విద్యార్థినితో కలిసి ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఆ విద్యార్థినిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్టు ఇబ్రహీంపట్నం ఏసీపీ కెపీవీ రాజు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి

(మొదటిపేజీ తరువాయి)



గురించి తెలుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. దుండగుడిని పట్టుకునేందుకు ఏడు బృందాలను ఏర్పాటు చేసినట్టు నగర పోలీసులు తెలిపారు. ముంబయి పోలీసులతో పాటు క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తును సాగిస్తున్నాయి. దుండగుడిని అడ్డుకునే క్రమంలో సైఫ్‌కు గాయాలయ్యాయా? లేదా దుండగుడే కావాలని దాడి చేశాడా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉన్నది.

రెండు చోట్ల లోతుగా గాయాలు

సైఫ్ శరీరంపై కత్తితో జరిగిన ఆరు గాయాలను వైద్యులు గుర్తించారు. రెండు చోట్ల లోతుగా గాయమైందని చెప్పారు. దాడిలో నటుడి వీపుపై వెన్నెముక వద్ద తీవ్ర గాయమైందనీ, ప్రస్తుతం ఆయన ప్రమాదం నుంచి బయటపడినట్టు ఆయనకు చికిత్స అందిస్తున్న లీలావతి ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. శస్త్ర చికిత్స చేసి 2.5 అంగుళాల కత్తి ముక్కను అక్కడి నుంచి తొలగించారు.

రూ.కోటి డిమాండ్ చేసిన దుండగుడు?

బాలీవుడ్ నటుడిపై దాడి కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు ఇంట్లోకి చొరబడి, దాడి చేసే ముందు.. సైఫ్‌ను రూ.కోటి డిమాండ్ చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీనికి ఒప్పుకోకపోవటంతోనే ఆగంతకుడు దాడి చేసినట్టు ప్రాథమికంగా గుర్తించారు. అయితే, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నది.

నిందితుడి ఫోటో బయటకు

నటుడిపై దాడి చేసిన వ్యక్తి ఫోటో ఒకటి బయటకు వచ్చింది. ప్రధాన స్రవంతి మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో ఇది వైరల్‌గా మారింది. దాడి అనంతరం మెట్లు దిగి పారిపోతుండగా.. అక్కడి సీసీటీవీ కెమెరాలో దుండగుడి కదలికలు రికార్డయ్యాయి. ఈ సీసీ ఫుటేజీని పోలీసులు విడుదల చేశారు. బయటకు వచ్చిన ఫోటో కూడా అదేనని ప్రచారం జరుగుతున్నది.

మహాయుతిపై ప్రతిపక్షాల దాడి

సైఫ్‌పై దాడి రాజకీయంగానూ తీవ్ర చర్చకు దారి తీసింది. మహారాష్ట్రలోని రాజకీయ పార్టీలతో పాటు ఆప్, టీఎంసీలు సైతం స్పందించాయి. రాష్ట్రంలోని మహాయుతి పాలనలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని శివసేన (యూబీటీ) ఆరోపించింది. సైఫ్ అలీఖాన్ వంటి సెలబ్రిటీలకే రక్షణ లేకపోతే.. ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ ప్రియాంక చతుర్వేది ఆరోపించారు. దాడి గురించి విని తాను షాక్‌కు గురయ్యాననీ, నిందితులపై కఠిన చర్యలు అవసరమని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. శాంతి భద్రతల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ స్పందించారు. సెలబ్రిటీలకే ప్రభుత్వం భద్రత కల్పించలేకపోతే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు.



ప్రపంచం మెచ్చిన నేత పుచ్చలపల్లి సుందరయ్య

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

శోభనాద్రిపురంలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహావిష్కరణ

పార్టీ శాఖ నూతన కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

పుచ్చలపల్లి సుందరయ్య ప్రపంచం మెచ్చిన జన హృదయ నేత అని, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భువనగిరి యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం శోభనాద్రిపురంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములుతో కలిసి ఆవిష్కరించారు. కామ్రేడ్ కొండకింది శ్రీనివాస్ రెడ్డి స్మారక నూతన భవనాన్ని ప్రారంభించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి హాల్‌ను చెరుపల్లి సీతారాములు, కామ్రేడ్ మల్లు స్వరాజ్యం హాల్‌ను జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ ప్రారంభించారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శి లింగస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని ప్రసంగించారు. శోభనాద్రిపురం గ్రామంలో 1972లో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో సుందరయ్య పాల్గొని గ్రామ ప్రజలను ఉత్తేజితులను చేశారని గుర్తు చేశారు. గ్రామంలో సీపీఐ(ఎం) బీజాలు నాటారన్నారు. అప్పటి నుంచి సీపీఐ(ఎం)కు అండగా నిలవడంతోపాటు ఆయన సేవలను మర్చిపోకుండా నిత్యం స్మరిస్తూ ఉండే విధంగా విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల రాష్ట్ర కమిటీ తరఫున అభినందనలు తెలిపారు. కామ్రేడ్ కొండకింది శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రతి ఒక్కరూ తన కష్టార్జితం నుంచి సుందరయ్య విగ్రహం కోసం వెచ్చించడం అభినందనీయమన్నారు. తమ నాయకుడు తమ ఎదురుగా నవ్వుతూ కనపడితే ఉత్తేజంగా ఉంటుందని శ్రమజీవులు ఈ ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. ఆయన సూచనలు, ఆచరించిన విధానాలతో దేశ వ్యాప్తంగా చాలామంది నాయకులుగా, కమ్యూనిస్టులుగా ఎదిగారని చెప్పారు. సుందరయ్య జీవితం తెరిచిన పుస్తకమన్నారు. వ్యక్తిగత జీవితంలోనే కాక సిద్ధాంతపరంగా మమేకమైన నాయకుడు అన్నారు. సిద్ధాంత పోరాటం, నిర్మాణంలో, కార్యకర్తలను తయారు చేయడంలో.. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవడంలో సుందరయ్య స్ఫూర్తి గొప్పదన్నారు. కమ్యూనిస్టులు అంటే బతుకు పాఠాన్ని నేర్పేవారని అన్నారు. కమ్యూనిస్టు పాలనలోని రాష్ట్రాలు, దేశాల్లో విద్య, వైద్యం, ఉపాధి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కమ్యూనిస్టు పార్టీ బతికే విధానాన్ని నేర్పిస్తుందని చెప్పారు. దున్నేవాడిదే భూమి అన్న నినాదం కమ్యూనిస్టు పార్టీదన్నారు. వ్యక్తి అభివృద్ధి చెందాలంటే ఉత్పత్తి అనేది అతని చేతిలో ఉండాలన్నారు. మనిషి సంపూర్ణంగా బతకాలంటే విద్య, ఆరోగ్యం, ఉద్యోగం, దున్నడానికి భూమి, ఉద్యోగికి సరిపోయే జీతం ఉండాలని, జీతం, ఉద్యోగం లేని వారికి ఉపాధి చేసుకుని బతికే అవకాశాలు ఉండాలని అన్నారు. నేడు విద్య బడుగు బలహీన వర్గాలకు భారంగా మారిందని, సంపన్నులకు మాత్రమే అందుబాటులో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి అమలు చేయడం లేదన్నారు. 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి మహిళలను బస్సు ఎక్కించడం తప్ప మరేదీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని వివరించారు. పాలకుల విధానాల పట్ల ప్రజలు విసిగి వేసారి తిరగబడ్డప్పుడు ఎర్రజెండా పాలన వస్తుందని, అందుకు నిదర్శనం ఇటీవల శ్రీలంకలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడటమేనని చెప్పారు. రానున్న కాలం ఎర్రజెండాదే అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, కొండమడుగు నరసింహ, బొడ్డుపల్లి అనురాధ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, జెల్లెల్ల పెంటయ్య, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొడిగె బసవపున్నయ్య, నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, రషీద్, బోయిని ఆనంద్, జంపాల అండాలు, కల్లూరి నగేష్, హనుమంతు, పబ్బతి లింగయ్య, పాల్గొన్నారు.

ఐర్లాండ్ మహిళా జట్టుకు మ్యాచ్ ఫీజులో కోత



దుబాయ్: భారత మహిళలతో జరిగిన వన్డే సిరీస్‌ను కోల్పోయిన ఐర్లాండ్ మహిళలకు మరో ఎదురుదెబ్బ తగిలింది. రాజ్‌కోట్ వేదికగా బుధవారం జరిగిన మూడో, చివరి వన్డేలో స్లో-ఓవర్ రేట్‌కు గాను 10 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజాగా వెల్లడించింది. నిర్ణీత సమయం కంటే రెండు ఓవర్లు ఆలస్యంగా వేసినట్లు ఐసిసి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఐసిసి ప్యానెల్ ఆఫ్ మ్యాచ్ రిఫరీలు జీఎస్ లక్ష్మి ఈ విషయాన్ని ఐసిసికి విన్నవించగా.. ఐసిసి తాజా ప్రకటనలో ఆర్టికల్ 2.22 ప్రకారం ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 10శాతం కోత విధిస్తున్నట్లు తెలిపింది. ఒక్కో ఓవర్‌కు 5శాతం చొప్పున మొత్తం 2ఓవర్లకు 10శాతం ఫీజులో కోత విధించినట్లు పేర్కొంది. ఈ విషయాన్ని ఐర్లాండ్ కెప్టెన్ గాబీ లూయిస్‌కు తెలియజేయగా ఆమె అందుకు అంగీకారం తెలిపినట్లు ఐసిసి తెలిపింది. మూడో వన్డేకు ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా కిమ్ కాటన్, అక్షర్ టోట్రే, మూడో అంపైర్‌గా వీరేంద్ర శర్మ, నాల్గో అంపైర్‌గా బృందా రాఠీచార్జి వ్యవహరించారు.

ధృవ్ షోరే, యశ్ రాథోడ్ సెంచరీలు

- విజయ్ హజారే టోర్నీ ఫైనల్‌కు విదర్భ
- సెమీస్‌లో మహారాష్ట్రపై ఘన విజయం



వడోధర: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్ ఫైనల్లోకి విదర్భ జట్టు దూసుకెళ్లింది. కోటాంబి స్టేడియంలో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో విదర్భ జట్టు మహారాష్ట్రను చిత్తుచేసింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన విదర్భ జట్టు 50ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 380పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఓపెనర్లు ధృవ్ షోరే(114), యశ్ రాథోడ్(116) సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 224పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత కెప్టెన్ కరణ్ నాయర్(88నాటౌట్; 44బంతుల్లో 9ఫోర్లు, 5సిక్సర్లు), జితేశ్ శర్మ(51; 33బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సర్లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. దీంతో ఆ జట్టు భారీస్కోర్‌ను నమోదు చేసింది. మహారాష్ట్ర బౌలర్లలో ముఖేశ్ చౌదరికి రెండు, బఛావ్‌కు ఒక వికెట్ దక్కాయి. బుధవారం జరిగిన తొలి సెమీస్‌లో కర్ణాటక జట్టు 5వికెట్ల తేడాతో హర్యానాను ఓడించి ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. శనివారం జరిగే టైటిల్ పోరులో కర్ణాటకతో విదర్భ జట్టు తలపడనుంది.



క్వార్టర్స్‌కు కిరణ్ జార్జి

ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

న్యూఢిల్లీ : ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి కిరణ్ జార్జి ప్రవేశించాడు. గురువారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో కిరణ్ జార్జి 22-20, 21-13తో అలెక్స్(ఫ్రాన్స్)ను వరుససెట్లలో చిత్తుచేశాడు. మరో పోటీలో 6వ సీడ్ నరోకా(జపాన్) 17-21, 15-21తో అనూహ్యంగా అన్‌సీడెడ్, సింగపూర్‌కు చెందిన యో-లెహ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. మరో ప్రి క్వార్టర్‌ఫైనల్లో 3వ సీడ్, డెన్మార్క్‌కు చెందిన విక్టర్ అక్సెల్సన్ 21-11, 21-14తో జాన్సెన్(సింగపూర్)ను ఓడించాడు. ఇక పురుషుల డబుల్స్‌లో 7వ సీడ్ సాత్విక్-చిరాగ్ జంట 20-22, 21-14, 21-16తో జపాన్ జంటను ఓడించి క్వార్టర్స్‌కు చేరారు.



సింధు ముందుకు..

మహిళల సింగిల్స్‌లో పివి సింధు క్వార్టర్స్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రి క్వార్టర్స్‌లో సింధు 21-15, 21-13తో మనామీ సుజు(జపాన్)ను ఓడించింది.

క్వార్టర్‌ఫైనల్స్(సింగిల్స్)...

పురుషులు..	మహిళలు..
కిరణ్ జార్జి × హంగ్‌యాన్(చైనా)	సే-యంగ్-అన్(కొరియా) × జియా-మిన్-యో(కజకిస్తాన్)
చౌ టిన్ చెన్(తైపీ) × ఛో-యు-లీ(హాంకాంగ్)	పివి సింధు × మరిస్కా(ఇండోనేషియా)
కెన్-యు-హో(సింగపూర్) × అక్సెల్సన్(డెన్మార్క్)	యు-హన్(చైనా) × ఫంగ్-జియా(చైనా)
చున్-హి-లిన్(తైపీ) × జొనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా)	మియాజాకి(జపాన్) × జి-హి-వాంగ్(చైనా)

బ్యాటింగ్ కోచ్‌గా సీతాన్షు కోటక్



ఇంగ్లండ్‌తో తలపడే భారతజట్టుకు బ్యాటింగ్‌కు కోచ్‌గా సీతాన్షు కోటక్ ఎంపికయ్యాడు. భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) గురువారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు టి20ల సిరీస్ జనవరి 22నుంచి ప్రారంభం కానుంది. ఇరుజట్ల మధ్య జరిగే తొలి టి20 ఈడెన్ గార్డెన్స్‌లో వచ్చే బుధవారం జరగనుంది. పురుషుల సీనియర్ జట్టులో అభిషేక్ నాయర్, ర్యాన్-టెన్-డోస్చేట్ అసిస్టెంట్ కోచ్‌లుగా ఉన్నారు. కానీ బ్యాటింగ్ కోచ్‌లు ఎవరు లేరు. మోర్నీ మోర్కెల్, దిలీప్ బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లు అలాగే కొనసాగుతున్నారు. ఇక గౌతం గంభీర్ ప్రధాన కోచ్‌గా, నాయర్ బ్యాటింగ్ కోచ్‌కు సహాయకులుగా కొనసాగనున్నారు. సౌరాష్ట్రకు చెందిన కోటక్ లిస్ట్-ఎ 130 మ్యాచుల్లో 8వేల పరుగులు చేశాడు. అందులో 15సెంచరీలు ఉన్నాయి.

మూడోరౌండ్‌కు సిన్నర్

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్ హవా కొనసాగుతుంది. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో సిన్నర్ ఆస్ట్రేలియాకు చెందిన షూల్కేట్‌ను 4-6, 6-4, 6-1, 6-3తో చిత్తుచేశాడు. ఇక ఐదుసెట్ల హోరాహోరీ పోరులో 17వ సీడ్, అమెరికాకు చెందిన టఫీ అనూహ్యంగా రెండోరౌండ్‌లోనే ఓటమిపాలయ్యాడు. అన్‌సీడెడ్ మరోజస్మన్(హంగేరీ) 7-6(7-3), 4-6, 6-3, 4-6, 6-1తో టఫీని ఓడించాడు. ఇతర పోటీల్లో 4వ సీడ్, ఫ్రిట్జ్(అమెరికా) 6-2, 6-1, 6-0తో గారిన్(చిలీ)పై, 8వ సీడ్, డి మినర్(ఆస్ట్రేలియా) 6-2, 6-4, 6-3తో బోయర్(అమెరికా)ను చిత్తుచేసి ముందుకు దూసుకెళ్లారు. ఇక 16వ సీడ్ మసెట్టి(ఇటలీ) 7-6(7-3), 7-6(8-6), 6-2తో కెనడాకు చెందిన షపొవలోవ్‌ను, 21వ సీడ్ షెల్టన్(అమెరికా) 6-3, 6-3, 6-7(4-7), 6-4తో కారెనో(స్పెయిన్)ను చిత్తుచేసి మూడోరౌండ్‌కు చేరారు.

మహిళల సింగిల్స్‌లో సీడెడ్ల ముందంజ..

మహిళల సింగిల్స్‌లో సీడెడ్ క్రీడాకారిణులు మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీల్లో 4వ సీడ్, పోలిని(ఇటలీ), అమెరికాకు చెందిన 10వ సీడ్ కోలిన్స్, 19వ సీడ్ కీస్‌తోపాటు 28వ సీడ్ స్విటోలినా(ఉక్రెయిన్) మూడోరౌండ్‌కు చేరారు. పోలిని 6-2, 6-3తో జరాజు(మెక్సికో)ను, కోలిన్స్ 7-6(7-4), 4-6, 6-2తో ఐవా(ఆస్ట్రేలియా)ను ఓడించారు. ఇక కీస్ 7-6(7-1), 2-6, 7-5తో రూసే(జర్మనీ)ను ఓడించారు. ఏకపక్షపోరులో స్విటోలినా 6-1, 6-4తో డొలెహైడే(అమెరికా)ను ఓడించింది.

పురుషుల డబుల్స్‌లో భారత నిరాశ.. :

పురుషుల డబుల్స్‌లో ముగ్గురు భారత జోడీలు ఓటమిపాలయ్యారు. ప్రశాంత్-నెడుంచేజియన్ 2-6, 6-2తో బ్రెజిల్-ఫ్రాన్స్ జంట చేతిలో, బల్లిపల్లి(భారత్)-సెగ్మన్(అమెరికా) జంట 6-7(5-7), 1-6తో 6వ సీడ్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక చంద్రశేఖర్(భారత్), డ్రెవ్‌జెస్కీ(పోలండ్) జంట 6-7(1-7), 6-2, 6-7(6-10)తో సిట్సిపాస్(గ్రీక్)-జుంహార్(బోస్నియా) చేతిలో పోరాడి ఓడారు. ఇక బాలాజీ-రైయాస్(మెక్సికో) జంట 6-4, 6-3తో కజకిస్తాన్-ఫ్రాన్స్ జంటను చిత్తుచేసి రెండోరౌండ్‌కు చేరారు.





నాగార్జున

ఎంతో మందికి ఏఎన్నార్ స్ఫూర్తి : నాగార్జున

'రోడ్లే లేని రోజుల్లో నాన్న (ఏఎన్నార్) హైదరాబాద్‌కి వచ్చి ఇంతపెద్ద అన్నపూర్ణ స్టూడియోస్ ఎలా స్థాపించారో నాకు ఇప్పటికీ అర్థం కాదు. కానీ ఒక్కటి మాత్రం తెలుసు. అన్నపూర్ణ స్టూడియోస్ ఎంతో మంది టెక్నీషియన్లు, కొత్త ఆర్టిస్టులను, కొత్త డైరెక్టర్స్‌కు ఉపాధి కల్పించింది. ఎంతో మందికి ఏయన్నార్ స్ఫూర్తి' అని నాగార్జున అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు అయిన సందర్భంగా నాగార్జున ప్రత్యేక వీడియో విడుదల చేశారు. ఈ వీడియోలో నాగార్జున మాట్లాడుతూ, 'అన్నపూర్ణ స్టూడియోస్‌కి 50వ ఏడు మొదలైంది. ప్రతి సక్సెస్‌ఫుల్ మ్యాన్ వెనుక ఒక విమెన్ ఉంటుందని నాన్న నమ్మేవారు. ఆయన సక్సెస్ వెనుక మా అమ్మ ఉన్నారని ఆయన నమ్మకం. అందుకే ఈ స్టూడియోకి అన్నపూర్ణ స్టూడియోస్ అని పేరు పెట్టారు. స్టూడియోస్‌కి వచ్చినప్పుడల్లా అమ్మ, నాన్న ఇక్కడే ఉన్నారనిపిస్తుంది. స్టాఫ్‌ని మేము ఫ్యామిలీగా భావిస్తాం. ఇవాళ స్టూడియో కళకళలాడుతుందంటే అది అన్నపూర్ణ ఫ్యామిలీ మూలంగానే. వాళ్ళు అన్నపూర్ణ వారియర్స్. 50 ఏళ్ల క్రితం సంక్రాంతి పండక్కి అన్నపూర్ణ స్టూడియోస్ ఓపెన్ అయ్యింది. ఆ తర్వాత ప్రతి సంక్రాంతికి అమ్మ, నాన్న అన్నపూర్ణ ఫ్యామిలీతో కలసి బ్రేక్ ఫాస్ట్ చేసేవారు. ఆ ట్రెడిషన్ ఇప్పటికీ అలానే కంటిన్యూ అవుతోంది. లైఫ్‌లో నాకు, మా పిల్లలకు నాన్న పెద్ద ఇన్స్పిరేషన్. మా ఫ్యామిలీ ఒక్కరికే కాదు బయట చాలా మంది కూడా ఆయన వాళ్ళకి పెద్ద ఇన్స్పిరేషన్ అని చెబుతుంటారు' అని తెలిపారు.

'మధువరమే'..



ప్రదీప్ రంగనాథన్, కయాదు లోహర్

ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన 'లవ్ టుడే'తో దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ హీరోగా పరిచయం అయిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి ఈ హిట్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రమే 'రైజ్ ఆఫ్ ది డ్రాగన్'.

ఈ చిత్రానికి కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్.గణేష్, కల్పాతి ఎస్.సురేష్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న ఈ మూవీని 'ఓరి దేవుడా' ఫేమ్ అశ్వత్ మారిముత్తు డైరెక్ట్ చేస్తున్నారు.


ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో 26వ సినిమాగా ఇది తెరకెక్కుతోంది.

ఇంతకు ముందు రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సినిమా అనౌన్స్‌మెంట్‌కు సంబంధించిన వీడియో, రీసెంట్‌గా రిలీజ్ చేసిన రైజ్ ఆఫ్ డ్రాగన్ అనే ఎనర్జిటిక్ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి 'మధువరమే..' అంటూ సాగే ఓ మెలోడీ గీతాన్ని విడుదల చేశారు. లియోన్ జేమ్స్ అందించిన బాణీ, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం, శరత్ సంతోష్, శ్రినిష జయసీలన్ గాత్రం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పాటను యూరోప్‌లో షూట్ చేసినట్టుగా లిరికల్ వీడియోని చూస్తే అర్థం అవుతోంది. ఇక ఈ పాట వినడానికే కాకుండా చూడటానికి కూడా ఎంతో ప్లెజెంట్‌గా కనిపిస్తోంది. ప్రదీప్‌రంగనాథన్ సినిమా అంటే ప్రేక్షకుల్లో ఓ మంచి ఆసక్తి ఉంటుంది. అలాగే అంచనాలూ ఉంటాయి. వాటికి మించి ఈసినిమా ఉంటుందని కచ్చితంగా చెప్పగలం. అలాగే ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే తెలియజేస్తాం అని మేకర్స్ తెలిపారు.

ఈ ఎమోషనల్ మూవీకి అర్చనా కల్పాతి క్రియేట్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తుంటే, ఐశ్వర్యా కల్పాతి అసోసియేట్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. లియోన్ జేమ్స్ సంగీతాన్ని అందిస్తున్నారు. నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ప్రదీప్ ఇ.రాఘవ్ ఎడిటర్‌గా, ఎస్.ఎం.వెంకట్ మాణిక్యం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కె.ఎస్.రవికుమార్, మిస్కిన్, వి.జె.సిద్ధు, హర్షత్ ఖాన్, అనుపమ పరమేశ్వరన్, కయాదు లోహర్, మరియం జార్జ్, ఇందుమతి మణికందన్, తేనప్పన్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో మెప్పించనున్నారు.

నవచిత్రం

తెలుగులో 'పట్టుదల'గా..



అజిత్ కుమార్

హీరో అజిత్‌కుమార్, లైకా ప్రొడక్షన్స్ కలయికలో మగిళ్ తిరుమేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'విడాముయర్చి'. 'పట్టుదల'గా తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ అవుతోంది. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమా కోసం అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, సాంగ్స్, ప్రమోషనల్ కంటెంట్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది.

మూవీ రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఈ ఎక్స్‌పెక్టేషన్స్‌ను నెక్స్ట్ రేంజ్‌కు తీసుకెళ్లే క్రమంలో మేకర్స్ 'పట్టుదల' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు.

అజిత్ స్టైలిష్‌గా సాల్ట్ అండ్ పేపర్ లుక్‌తో నెవర్ బిఫోర్ అవతార్‌లో మెప్పించబోతున్నారని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. అలాగే తన వాళ్ల కోసం అజిత్ విలన్స్‌తో చేస్తున్న పోరాటాలు, అజిత్, త్రిష మధ్య కుదిరిన క్యూట్ కెమిస్ట్రీతో పాటు అజర్ బైజాన్‌లో చిత్రీకరించిన యాక్షన్ సీక్వెన్స్‌లు అబ్బుర పరుస్తున్నాయి. మరో వైపు అర్జున్ జైలులో ఖైదీగా, మరోవైపు స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. రెజీనా కసాండ్ర సైతం ఇప్పటి వరకు చేయనటువంటి వైవిధ్యమైన పాత్రలో అలరిస్తుందని ట్రైలర్‌లో ఆమెను చూస్తుంటేనే తెలుస్తోంది. ఇంకా ఈ చిత్రంలో ఆరవ్, నిఖిల్ నాయర్ తదితరులు ఇతర పాత్రల్లో మెప్పించనున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

'బ్రహ్మ ఆనందం'లో అన్నీ అద్భుతం



ప్రియా వడ్లమాని, రాజా గౌతమ్

'మళ్లీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద' వంటి హిట్ చిత్రాలతో అందరి దృష్టిని ఆకర్షించింది స్వధర్మ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్.

ఈ ప్రొడక్షన్ నుంచి రానున్న నాలుగో సినిమా 'బ్రహ్మ ఆనందం'.

బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్స్‌గా నటించారు.

సావిత్రి, ఉమేష్ కుమార్ సమర్పకులు. నూతన దర్శకుడు ఆర్.వి.ఎస్.నిఖిల్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 14న రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీ టీజర్‌ను లాంచ్ చేశారు. గురువారం నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో బ్రహ్మానందం మాట్లాడుతూ, 'సరదాగా, నవ్వుతూ షూటింగ్ చేశాం. మితేష్ ఫోటోగ్రఫీ అద్భుతంగా ఉంటుంది. శాండిల్య మ్యూజిక్ ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. వెన్నెల కిషోర్ అద్భుతంగా నటించారు. సెట్‌లో యాక్టింగ్ చేసేటప్పుడే నాకు నవ్వొచ్చేది. ఈ చిత్రంలో అందరూ గొప్పగా నటించారు. నా లెగసీని కంటిన్యూ చేసే వారిలో కిషోర్ ఒకరు. దివిజ ఎంతో సహజంగా నటించింది' అని అన్నారు.

'బ్రహ్మానందం అంటేనే కింగ్ ఆఫ్ కామెడీ. అన్నం ఉడికిందో లేదో ఒక్క మెతుకు చూస్తే చాలన్నట్టు.. ఈ మూవీ ఎలా ఉంటుందో చెప్పడానికి ఈ టైటిల్ చాలు' అని వెన్నెల కిషోర్ చెప్పారు. నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా మాట్లాడుతూ, 'బ్రహ్మ ఆనందం అనే సినిమాను బ్రహ్మానందంతో చేయడం మామూలు విషయం కాదు. రాజా గౌతమ్ చాలా సర్‌ప్రైజింగ్‌గా అనిపిస్తారు. ఈ సినిమాతో నా సక్సెస్ మళ్లీ కంటిన్యూ అవుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

'మా నాన్నతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది' అని రాజా గౌతమ్ చెప్పారు. డైరెక్టర్ ఆర్వీఎస్ నిఖిల్ మాట్లాడుతూ, ''బ్రహ్మ ఆనందం' కథను పట్టుకుని తిరుగుతున్న టైంలో రాహుల్ దొరకడం నా అదృష్టం. నా డైరెక్షన్ టీం ఎంతో సపోర్ట్‌గా నిలిచింది. హీరో రాజా గౌతమ్ అద్భుతంగా నటించారు. ఆయన కోసమే ఈ సినిమాను నాలుగైదు సార్లు చూస్తారు' అని అన్నారు. ప్రియా వడ్లమాని మాట్లాడుతూ,'ఇంత మంచి చిత్రంలో నేను నటించినందుకు చాలా ఆనందంగా అనిపిస్తుంది' అని తెలిపారు.

శివరాత్రి కానుకగా 'రాక్షస' రిలీజ్



ప్రజ్వల్ దేవరాజ్

ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రాక్షస'. ఈ చిత్రాన్ని శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఒరిజినల్ వెర్షన్ కన్నడతో పాటు తెలుగులోనూ రిలీజ్ చేయనున్నారు.

గతంలో శివరాజ్ కుమార్ నటించిన 'వేద' చిత్రాన్ని విడుదల చేసిన ఎంవీఆర్ కృష్ణ 'రాక్షస' ట్రైలర్ నచ్చి తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్ పై రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా హీరో ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో ప్రజ్వల్ దేవరాజ్ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. లోహిత్ హెచ్ దర్శకత్వం వహించిన ఈ టైమ్ లూప్ హర్రర్ చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది.

ఈ సందర్భంగా నిర్మాత ఎంవిఆర్ కృష్ణ మాట్లాడుతూ,'ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. సంక్రాంతి సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే టీజర్, ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేస్తాం. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ చిత్రానికి కూడా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కుతుందని నమ్మకం ఉంది' అని చెప్పారు. అరుణ్ రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్, విహాన్ కృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : నోబిన్ పాల్, సినిమాటోగ్రఫీ :జైబిన్ పి జాకబ్, దర్శకుడు : లోహిత్ హెచ్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.